ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం అలుపెరగని పోరాటం చేసిన ఎమ్మార్పీఎస్ ఆకాంక్ష గురువారం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో సఫలమైంది. దేశం దృష్టిని ఆకర్షించడమే కాక విభిన్న అంశాలను చర్చకు తెచ్చింది ఆ ఉద్యమం. మూడు దశాబ్దాలకుపైగా అనేక ఆటుపోట్లను ఎదుర్కొని కొన్ని సందర్భాలలో చీలికలకు గురై బలహీనపడినట్లు కనిపించినా అంతిమంగా దామాషాకు అనుగుణంగా ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణను సాధించుకున్నారు. కాగా ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి బీజం పడింది, తొలి కార్యక్రమాలను నిర్వహించింది జిల్లాలోనే. మూడు దశాబ్దాల మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఉద్యమానికి ప్రధానంగా నాయకత్వం వహించింది వరంగల్‌కు చెందిన మందకృష్ణ మాదిగ అయినప్పటికీ జిల్లా నుంచే ఆయనకు బలమైన తోడ్పాటు లభించింది. ఇక్కడే సమితి ఆవిర్భవించడమే కాక అత్యంత క్రియాశీలకంగా జిల్లాకు చెందిన వారు వ్యవహరించారు.

సుప్రీంతీర్పును గౌరవిస్తాం

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును గౌరవిస్తున్నామని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ఏడుగురు సభ్యుల ధర్మాసనం ఎస్సీ వర్గీకరణపై గురువారం సానుకూలంగా తీర్పు ఇచ్చిన అనంతరం నియోజకవర్గ పర్యటనలో ఉన్న మంత్రి డాక్టర్ స్వామి ఈ అంశంపై స్పందించారు. న్యాయస్థానాలు, వాటి తీర్పులపై తమకు అత్యంత గౌరవం ఉందన్నారు. టీడీపీ ఎల్లప్పుడూ సామాజిక న్యాయానికి కట్టుబడి ఉందన్నారు. దళిత వర్గాల అభివృద్ధే ధ్యేయంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. కాగా ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతించినట్లు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.


ఒంగోలులో ఎంఆర్‌పీఎస్ నేతల కృతజ్ఞతా ర్యాలీ

జిల్లా నుంచే వర్గీకరణం నెరవేరిన లక్ష్యం

ఈదుమూడిలో ఆవిర్భవించిన ఎమ్మార్పీఎస్

ఒంగోలు కేంద్రంగా కార్యకలాపాలు విస్తరణ

జిల్లాకు చెందిన నేతల క్రియాశీలక పాత్ర

సుప్రీంతీర్పుతో ఆ వర్గీయులలో ఆనందోత్సాహాలు

ఒంగోలు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): నాగులుప్పలపాడు మండలం ఈదుమూడి గ్రామంలో 1994 జూలై 7న ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ లక్ష్యంతో ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించింది. వరంగల్‌కు చెందిన పూర్వపు రాడికల్ మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో 13 మంది యువకులతో సమితి ఏర్పడింది. మందకృష్ణ అధ్యక్షుడిగా వ్యవహరించగా వామపక్ష విద్యార్థి ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేసిన టంగుటూరు మండలం కారుమంచికి చెందిన కృపాకర్ మాదిగ కార్యదర్శిగా కార్యక్రమాలను ప్రారంభించారు. ఈదుమూడికి చెందిన కొమ్మూరి కనకారావు, ఉసురుపాటి బ్రహ్మయ్య, పిల్లి మాణిక్యాలరావు వంటి జిల్లావాసులు ఉద్యమాన్ని జిల్లాలోనే కాక రాష్ట్రవ్యాప్తంగా విస్తరింపజేయడంలో మందకృష్ణకు తోడుగా నిలిచారు. రాజకీయ, సామాజిక అంశాలపై మందకృష్ణ చురుకుగా కదులుతున్న సమయంలో ఉమ్మడి రాష్ట్ర అధ్యక్షుడుగా కొమ్మూరి కనకారావు, ఉమ్మడి రాష్ట్ర విభజన తర్వాత అధ్యక్షుడిగా బ్రహ్మయ్య మాదిగలు ఎంపిక కావడం జిల్లాలో ఆ ఉద్యమానికి ఉన్న బలమైన బంధానికి నిదర్శనం. ఈదుమూడిలో ఆవిర్భావంతోపాటు ఒంగోలు కేంద్రంగా కార్యక్రమాలు పెద్దఎత్తున సాగాయి. కాగా కొంతకాలం తర్వాత ఇలాంటి కీలక నాయకులు విభేదాలతో ఒకరికి ఒకరు దూరమైనా ఎవరి పరిధిలో వారు ఉద్యమాన్ని కొనసాగిస్తూనే ఉన్నారు.

1998లో ఆర్డినెన్స్ తెచ్చిన బాబు

1994 జూలై 7న ఈదుమూడిలో 13మందితో ప్రారంభమైన ఎమ్మార్పీఎస్ ఉద్యమం కేవలం రెండేళ్ల వ్యవధిలోనే నాటి చంద్రబాబు ప్రభుత్వం ఈ సమస్యపై కమిషన్ వేసేలా ఉద్యమాలు నడిపింది. అలాంటి ఉద్యమానికి సంబంధించిన తొలి బహిరంగసభ ఒంగోలులోనే జరిగింది. ఇక్కడ 1995 మే 31న దాదాపు లక్షమంది మాదిగ ప్రజలతో నిర్వహించిన సభకు మాజీ మంత్రి టి.ఎం.సదాలక్ష్మి హాజరయ్యారు. అక్కడి నుంచి ఉద్యమం విస్తరించి నెల్లూరు, విజయవాడ, హైదరాబాద్‌లో భారీ సభలు, ఆందోళన నిర్వహణ, మాదిగ విద్యార్థి, ఉద్యోగులు, మహిళా, యువజన విభాగాలు ఏర్పాటు వంటివి పెద్దఎత్తున సాగాయి. రెండేళ్ల కాలంలోనే ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని గుర్తించిన నాటి సీఎం చంద్రబాబు ప్రభుత్వం 1996 సెప్టెంబరు 10న రామచంద్రరాజు కమిషన్‌ను ఏర్పాటుచేయగా సానుకూలమైన నివేదిక ఇచ్చింది. దానికి వ్యతిరేకంగా మాలమహానాడు ఆవిర్భవించి నిరసనలు, ఆందోళనలు నిర్వహించగా అందులోనూ జిల్లాకు చెందిన వారు చురుకుగా పాల్గొన్నారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా చంద్రబాబు ప్రభుత్వ నిర్ణయం తీసుకొని 1998 అక్టోబరు 1న ఆర్డినెన్స్ కోసం రాష్ట్రపతికి పంపగా 1999 నవంబరు 30న రాష్ట్రపతి ఆర్డినెన్స్ జారీచేశారు. తదనుగుణంగా 2000 ఏప్రిల్ 1న రాష్ట్రప్రభుత్వం ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అమలుచేయగా నాలుగేళ్లు ఆ లబ్ధిని పొందింది. దీనికి వ్యతిరేకంగా మాలమహానాడు సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో వర్గీకరణ చేసే అధికారం రాష్ట్రానికి లేదని, పార్లమెంట్‌కు మాత్రమే ఉందని ఇవ్వడంతో రిజర్వేషన్లు ఆగిపోయాయి.


పోరాటాలకు స్ఫూర్తిగా ఈదుమూడిలో ఏర్పాటు చేసిన అమరవీరుల స్థూపం

మూడు దశాబ్దాల ఉద్యమం

వర్గీకరణ కోసం పదేళ్లుగా ఎమ్మార్పీఎస్ వివిధ రూపాలలో ఆందోళనలు కొనసాగిస్తూనే ఉంది. చివరకు ఈ అంశంపై భారత అత్యున్నత న్యాయస్థానం ఏడుగురు సభ్యుల ధర్మాసనం గురువారం సంచలన తీర్పును వెలువరించింది. కాగా మూడు దశాబ్దాల పాటు సాగిన ఉద్యమ ఆవిర్భావం, అనంతరం హైదరాబాద్‌కు సమానంగా ఒంగోలు కేంద్రంగా ఆ సమితి సాగించిన కార్యకలాపాలను ఆయా వర్గాలు గుర్తుచేసుకుంటున్నాయి. అనేక ఆటుపోట్లను, వందలాది కేసులను ఎదుర్కొని నడిపిన ఈ ఉద్యమంలో జిల్లాకు చెందిన కార్యకర్తలు అనేక మంది జైళ్ల పాలు కావడమే కాక కొందరు ప్రాణాలు కోల్పోయారు. కాగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించి పాతికేళ్లు అయినా సందర్భంగా మందకృష్ణ, బ్రహ్మయ్యల నేతృత్వంలో ఈదుమూడిలో భారీ బహిరంగసభను నిర్వహించి స్థూపాన్ని ఆవిష్కరించారు. నాటి సభలో కేంద్రమంత్రిగా ఉన్న బీజేపీ నేత కిషన్‌రెడ్డి పాల్గొని వర్గీకరణకు సానుకూలమని ప్రకటించారు. తాజాగా గత జూలై 7న ప్రస్తుత అధ్యక్షుడు బ్రహ్మయ్యమాదిగ ఆధ్వర్యంలో వార్షికోత్సవం నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణ లక్ష్యంతో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావం జరిగినా ఆ ఉద్యమం స్ఫూర్తితో అనేకమంది కార్యకర్తలు నేటికి వివిధ సామాజిక ఉద్యమాలలో, రాజకీయ కార్యకలాపాలలో చురుకుగా పాల్గొంటున్నారు.

తీర్పుపై ఎమ్మార్పీఎస్ సంబరాలు

ఒంగోలు (కార్పొరేషన్), ఆగస్టు 1 : ఎస్సీ వర్గీకరణ అంశంపై సుప్రీంకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పుతో జిల్లాలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకొన్నారు. ఈ మేరకు ఎమ్మార్పీఎస్, మహాజన సోషలిస్ట్ పార్టీ, వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో ఒంగోలులోని హెచ్‌సీఎం కాలేజీ, కలెక్టరేట్ ఎదుట, జిల్లాలోని అన్నీ ప్రాంతాలలో అంబేద్కర్ విగ్రహాలతోపాటు, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పాలభిషేకాలు చేసి, ర్యాలీలు నిర్వహించి సంతోషాలు పంచుకున్నారు. అనంతరం స్థానిక అంబేద్కర్ భవనంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ ముప్పై ఏళ్ల సుదీర్ఘ ఉద్యమ పోరాటానికి తగిన ప్రతిఫలం దక్కిందన్నారు. గురువారం సుప్రీంకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పు అభినందనీయమన్నారు. తమ నాయకుడు మందకృష్ణ మాదిగ నేతృత్వంలో చేపట్టిన ఉద్యమం ఎస్సీలను ఏబీసీడీలుగా విభజించాలనే డిమాండ్‌తో చేసిన ఉద్యమానికి అనేక అడ్డంకులు వచ్చాయన్నారు. ఈ పోరాటంలో ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పును దేశం మొత్తం హర్షిస్తుందన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికి, టీడీపీ కూటమికి తాము మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి ముఖ్యమంత్రిగా ఉన్న నారా చంద్రబాబునాయుడు వర్గీకరణ బిల్ అసెంబ్లీలో ప్రవేశపెట్టగా తమకు కొంతమేర మేలు జరిగిందన్నారు. కాగా ఇప్పుడు పూర్తిస్థాయిలో ఊరట లభించిందని, ఈ సందర్భంగా వారు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు తొరటి ఆనంద్, భిక్షాలు, నేలపాటి రాజు, తిరువీధి బాబు, మాదిగ ఉద్యోగుల సంఘం నాయకులు సర్వేపల్లి రవిరాజ్, కత్తి ఐజక్, జిర్రా బాబూరావు, తేళ్ల జాలారావు, పి.కిషోర్, నక్కిపోయిన కోటేశ్వరరావు, రావినూతల కోటయ్య, గద్దల విల్సన్ కుమార్, కొమ్మూరి రవిచంద్ర, జంధ్రాజుపల్లి ఆంజనేయులు మాదిగ, జి. ప్రభుదాస్, రాజారావు, దేవరపల్లి సంజీవ్ పాల్గొన్నారు.

ఒకటినే జీతాలు పడ్డాయ్!

ప్రభుత్వ ఉద్యోగులలో ఆనందం

తొలిరోజు 60శాతం మందికి వేతనాలు

రిటైర్డ్ ఉద్యోగులకు కూడా అందిన పెన్షన్లు



ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 1: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులకు ఒకటినే జీతాలు పడుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో వారికి జీతాలు, పెన్షన్లు ఎప్పుడు వేస్తారో తెలియని పరిస్థితి ఉండేది. ప్రభుత్వ ఉద్యోగులు వైసీపీ ప్రభుత్వంలో జీతాల కోసం రోజుల తరబడి ఎదురుచూడాల్సి వచ్చేది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉద్యోగులకు ఒకటో తేదీనే జీతాలు ఇచ్చే విధంగా వెంటనే చర్యలు తీసుకున్నారు. జూలై నెల 1వతేదీనే 50శాతం మందికి జీతాలు పడగా ఆగస్టు నెలలో 60శాతం మందికి పైగా ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులకు జీతాలు, పెన్షన్లు పడ్డాయి. గురువారం 1వ తేదీ కావడంతో ఉదయాన్ని అనేక ప్రభుత్వ శాఖల ఉద్యోగులకు తమ బ్యాంకు అకౌంట్లలో జీతాలు పడినట్లు మేసేజ్‌లు రావడంతో వారిలో ఆనందోత్సహాలు నెలకొన్నాయి. మొత్తంగా ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులకు సకాలంలో జీతాలు పడుతుండటంతో కూటమి ప్రభుత్వం పట్ల మరింత విశ్వాసం నెలకొంది.

బడుల్లో మోగిన ఎన్నికల నగారా

ఎస్‌ఎంసీ నోటిఫికేషన్ విడుదల



ఒంగోలు(విద్య), ఆగస్టు 1: ప్రభుత్వరంగ పాఠశాలల్లో పాఠశాల యాజమాన్య కమిటీ(ఎస్‌ఎంసీ)ల పునర్వ్యవస్థీకరణ కోసం ఎన్నికల నిర్వహణకు నగారా మోగింది. పాఠశాలల హెచ్‌ఎంలు గురువారం ఉదయం ఎస్‌ఎంసీ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీచేశారు. మధ్యాహ్నం 1 గంటకు ఎన్నికల్లో పాల్గొనే తల్లిదండ్రుల ఓటర్ల జాబితాను హెచ్‌ఎంలు ప్రకటించారు. మధ్యాహ్నం 2 గంటలకు ఓటర్లకు అందుబాటులో ఉండేలా ఓటర్ల జాబితాలను పాఠశాల నోటీసు బోర్డులో ప్రదర్శించారు.

2,427 పాఠశాలలకు ఎన్నికలు

జిల్లాలోని 2,427 ప్రభుత్వరంగ పాఠశాలలకు ఎస్‌ఎంసీ ఎన్నికలు నిర్వహిస్తున్నారు. వీటిలో సింహభాగం అంటే 2,126 మండల పరిషత్ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో మొదట సభ్యులను ఎన్నుకుంటారు. వారు తమలో ఒకరిని చైర్మన్‌గా, మరొకరిని వైస్ చైర్మన్‌గా ఎన్నుకుంటారు. ఈనెల 5 ఓటర్ల జాబితాలపై అభ్యంతరాలను స్వకరించి అదేరోజు సాయంత్రానికి తుది జాబితాను ప్రకటిస్తారు. 8న ఎస్‌ఎంసీ ఎన్నికలు నిర్వహిస్తారు. ఉదయం 7.30 నుంచి ప్రక్రియ ప్రారంభమవుతుంది. మొదట ప్రతి తరగతి నుంచి ఎస్‌ఎంసీ సభ్యులను ఎన్నుకొని అదేరోజు మధ్యాహ్నం చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకుంటారు. సాయంత్రం మొదట సమావేశం జరుగుతుంది. ఎన్నికలను రాజకీయాలకతీతంగా నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది.

ఒలింపిక్స్‌లో రాణించాలి



ప్యారిస్‌లో జరుగుతున్న ఒలింపిక్స్‌లో రాష్ట్రం నుంచి పాల్గొంటున్న క్రీడాకారులు ప్రతిభ చూపి దేశానికి పేరు తీసుకురావాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆకాంక్షించారు. కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన ఒలింపిక్స్ పాయింట్ వద్ద గురువారం ఆమె సెల్ఫీ దిగారు. క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్‌డీవో రాజరాజేశ్వరి, బాక్సింగ్ కోచ్ వేణు, సెపక్‌తక్రా కోచ్ శ్రీనివాసరావు, మణికంఠ పాల్గొన్నారు. -ఒంగోలు

వెలుగులోకి పంచాయతీల అవినీతి

ఇప్పటికే ఇరువురు ఉద్యోగులు సస్పెన్షన్

ఒక సర్పంచ్ చెక్‌పవర్ రద్దు

సింగరాయకొండ, ఉప్పుగుండూరుల్లో భారీగా అక్రమాలు

కొమరోలులో పారిశుధ్య కార్మికులకు జీతాలు డ్రా చేసినా చెల్లించని వైనం

ఒంగోలు (కలెక్టరేట్), ఆగస్టు 1 : గ్రామ పంచాయతీల్లో వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. అప్పట్లో అక్రమాలు జరుగుతున్నాయని ఫిర్యాదులు వచ్చినా ఎవరూ పట్టించుకున్న పరిస్థితి లేకుండా పోయింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇప్పుడు అవన్నీ బయటపడుతున్నాయి. పంచాయతీల్లో ఉన్న అరకొర నిధులను పాలకవర్గాలు, కార్యదర్శులు కుమ్మక్కై ఇష్టారీతిన సొంత అవసరాలకు వినియోగించుకున్నారన్న ఆరోపణలున్నాయి.

- ఇప్పటికే నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరు, సింగరాయకొండ మేజర్ పంచాయతీల్లో లక్షలాది రూపాయలు అక్రమంగా వాడుకున్నారని తేలిపోయింది. పంచాయతీ తీర్మానాలు చేసుకొని పనులు చేయకుండానే చేసినట్లుగా బిల్లులు డ్రా చేశారని బయటపడింది. సింగరాయకొండ పంచాయతీలో అయితే ఏకంగా ముగ్గురు కార్యదర్శుల హయాంలోనే అలా రూ.20లక్షలకుపైగా వివిధ పనులు చేసినట్లుగా బిల్లులు డ్రా చేసినా రికార్డులు మాత్రం లేవు. అదేరీతిలో ఉప్పుగుండూరు పంచాయతీలో కూడా నిధులు కైంకర్యం చేశారు. అనేకసార్లు ఆ పంచాయతీలో జరుగుతున్న అవినీతిపై అధికారులకు ఫిర్యాదుచేసినా పట్టించుకోలేదు. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నిధులు స్వాహా వ్యవహారాలు వెలికితీస్తున్నారు.
- మద్దిపాడు మండలం దొడ్డవరంలో కూడా వాటర్ స్కీంకు సంబంధించిన రూ.29లక్షలకు లెక్కాపక్కా లేకుండా పోయింది.
- దొడ్డవరప్పాడు పంచాయతీలో కూడా అక్రమాలు జరిగినట్లు అధికారులకు ఫిర్యాదులు రావడంతో అక్కడా విచారణ కొనసాగుతోంది.
- కొమరోలు గ్రామ పంచాయతీలో పారిశుధ్య కార్మికుల వేతనాల కోసం నగదు డ్రా చేసి ఇంతవరకూ వారికి చెల్లించలేదు. కార్మికులకు వేతనాలు ఇచ్చేందుకు అక్కడి సర్పంచ్ నిరాకరించినట్లు సమాచారం. అయితే ప్రస్తుతం అక్కడ టీడీపీ నేతలు కార్మికులకు మద్దతుగా నిలబడినా సర్పంచ్ వెనక్కితగ్గడం లేదు. జిల్లాలోని పలు పంచాయతీల్లో అవినీతి, అక్రమాలు వెలుగులోకి వస్తుండటంతో ఇప్పుడు కార్యదర్శుల్లో ఆందోళన నెలకొంది. పాలకవర్గాల చేతిలో పావుగా మారి ఇష్టారీతిన వ్యవహరించిన కార్యదర్శులు తమ పరిస్థితి ఏమిటో అర్థం కాక ఇప్పుడు మదనపడుతున్నారు.



ఒంగోలు పార్లమెంటు సభ్యుడు మాగుంట శ్రీనివాసులరెడ్డి గురువారం ఢిల్లీలో రాష్ట్ర కూటమి ఎంపీలు అందరికీ విందు ఇచ్చారు. ఈ విందుకు జిల్లాలోని ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌చార్జులు కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు రాష్ట్ర అభివృద్ధి, వర్తమాన అంశాల గురించి చర్చించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ మాగుంటతో పాటు నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు, జిల్లా ఎమ్మెల్యేలు డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డి, దామచర్ల జనార్దన్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య, దర్శి ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి, సాగర్ దంపతులు పాల్గొన్నారు. - ఒంగోలు

పండుగలా పంపిణీ

తొలిరోజు 97శాతానికిపైగా అందజేత

ఉదయం ఆరు గంటల నుంచే ప్రారంభం

లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఇచ్చిన అధికారులు, సచివాలయ సిబ్బంది

పాకలలో మంత్రి స్వామి, ఒంగోలులో కలెక్టర్ హాజరు

జిల్లావ్యాప్తంగా పాల్గొన్న టీడీపీ శ్రేణులు

ఒంగోలు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి)/ఒంగోలు నగరం: జిల్లాలో ఆగస్టు నెల సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం పండుగలా సాగింది. నెలలో తొలిరోజైన గురువారం ఉదయం ఆరు గంటలకే సచివాలయ సిబ్బంది, వారికి తోడుగా టీడీపీ ప్రజాప్రతినిధులు, శ్రేణులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పంపిణీ ప్రారంభించారు. రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక గతంలో ఉన్న రూ.3వేల పింఛన్ మొత్తాన్ని 4వేలకు పెంచిన విషయం విదితమే. తొలినెల అయిన జూలైలో రూ.4వేలకు అదనంగా మూడు నెలల బకాయి రూ.3వేలు కలిపి రూ.7వేలను అందజేశారు. రెండో నెల అయిన ఆగస్టు పింఛన్లు గురువారం రూ.4వేల వంతున అందజేశారు. జిల్లాలో వివిధ సామాజికవర్గాలకు చెందిన 2.90లక్షల మంది లబ్ధిదారులకు రూ.123.33 కోట్లు పింఛన్ మొత్తాలు ఇవ్వాల్సి ఉంది. ఉదయం ఆరు గంటలకే సచివాలయ సిబ్బంది పింఛన్ల పంపిణీ ప్రారంభించారు. గురువారం రాత్రి పొద్దుపోయే వరకు పింఛన్లను పంపిణీ చేస్తూనే ఉన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీనే పింఛన్ సొమ్ము లబ్ధిదారుల ఇంటికే వెళ్లి అందజేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం కాగా అందుకు అనుగుణంగా జిల్లాలో అధికారులు బుధవారమే నిధులను బ్యాంకుల నుంచి డ్రా చేశారు. ప్రతి మండలంలో పింఛన్ల పంపిణీ వేగంగా జరిగేందుకు ఒక జిల్లా అధికారిని ప్రత్యేకంగా నియమించారు.

సచివాలయ సిబ్బందితో...


పాకల పంచాయతీలో పింఛన్లు అందజేస్తున్న మంత్రి స్వామి

ఉదయం ఆరు నుంచి రాత్రి 8గంటల లోపుగానే దాదాపు 97శాతానికిపైగా లబ్ధిదారులకు వాటిని అందజేశారు. గతంలో వేలాదిమంది వలంటీర్లతో నాలుగైదు రోజులపాటు వైసీపీ ప్రభుత్వం పంపిణీ చేయించగా టీడీపీ కూటమి వచ్చాక సచివాలయ సిబ్బందితో పంపిణీకి చర్యలు తీసుకున్నారు. జిల్లాలో 719 సచివాలయాలలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న 5,727 మంది సిబ్బందితోపాటు కొందరు ఇతర శాఖల సిబ్బందిని అదనంగా నియమించి ఉదయం నుంచి సాయంత్రంలోపే పంపిణీ పూర్తికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వివిధ కారణాలతో ఇళ్ల వద్ద అందుబాటులో లేని మూడు నుంచి నాలుగు శాతం మంది లబ్ధిదారులు మినహా మిగతా అందరికి పింఛన్లు అందించారు. సచివాలయ సిబ్బంది, అధికారులతో పాటు ఆ కార్యక్రమంలో పార్టీశ్రేణులు, వివిధ స్థాయిలోని ప్రజాప్రతినిధులు పాల్గొనాలని టీడీపీ అధిష్టానం ఆదేశించింది. తదనుగుణంగా టీడీపీ ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, పార్టీశ్రేణులు పెద్దఎత్తున పాల్గొని పండుగలా పింఛన్లు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం పది గంటలకే 50శాతం పంపిణీ పూర్తిచేయగా మధ్యాహ్నానికి 80శాతం, రాత్రికి 97శాతం పింఛన్లు అందజేశారు. మిగిలిన వారికి శుక్ర, శనివారాల్లో అందజేయనున్నారు.

పాకలలో మంత్రి పంపిణీ

సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి సింగరాయకొండ మండలం పాకలలో పింఛన్లు పంపిణీ చేశారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ చీమకుర్తి మండలం కేవీపాలెం, మద్దిపాడు మండలం వెల్లంపల్లిలో పంపిణీ కార్యక్రమంలో పాల్గొనగా కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి కనిగిరి, వెలిగండ్ల మండలాల్లో పాల్గొన్నారు. టీడీపీ ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడు నూకసాని బాలాజీ ఒంగోలులోని భాగ్యనగర్ సచివాలయ పరిధిలో, వైపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు పెద్దారవీడు పంచాయతీ పరిధిలో పంపిణీలో పాల్గొన్నారు. శ్రీశైలం నుంచి విజయవాడ వెళ్తున్న రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మార్గమధ్యంలో దొర్నాల మండలంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పింఛనుదారులకు ప్రభుత్వం భరోసా !

కలెక్టర్ అన్సారియా
నగరంలో లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ
సంతనూతలపాడు, వెల్లంపల్లిలో
ఎమ్మెల్యే బీఎన్ చేతుల మీదుగా అందజేత

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 1: రాష్ట్ర ప్రభుత్వం సామాజిక భద్రత కల్పించేందుకు వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు, ఇతర పింఛనుదారులకు భరోసా కల్పించేలా చర్యలు తీసుకుందని కలెక్టర్ తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. గురువారం ఒంగోలు నగరంలోని కబాడీపాలెం, తూర్పుక్రిష్టియన్‌పాలెం సచివాలయాల పరిధిలో జరుగుతున్న ఎన్టీఆర్ భరోసా పింఛను పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. వృద్ధులకు కలెక్టర్ స్వయంగా పింఛన్లు అందజేసి లబ్ధిదారులతో కలెక్టర్ మాట్లాడారు. కార్యక్రమంలో నగర కమిషనర్ జశ్వంతరావు, వార్డు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధికి కోసం
చంద్రబాబు కృషి : ఎమ్మెల్యే బీఎన్

సంతనూతలపాడు: గత వైసీపీ పాలనలో రాష్ట్ర అభివృద్ధి కుంటుపడిందని, ప్రస్తుతం రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో ఉంచేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అహర్నిశలు కష్టపడుతున్నారని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం సంతనూతలపాడులో ఆయన ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్లను ఆయన ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాడు ఉమ్మడి రాష్ట్ర విభజన తర్వాత తొలి ముఖ్యమంత్రిగా చంద్రబాబుకు అప్పులతో, కష్టాలతో కూడిన రాష్ట్రాన్ని అప్పగించారని, అయితే కష్టపడి దానికి ఒక స్థాయికి తెచ్చారన్నారు. అనంతరం జగన్ మాత్రం ఒక్క చాన్స్ అంటూ ముఖ్యమంత్రి అయ్యి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి మరలా చంద్రబాబుకు కష్టాలకడలిలో ఉన్న ఆంధ్రప్రదేశ్‌ను అప్పగించారని విమర్శించారు.


తూర్పుక్రిష్టియన్‌పాలెంలో పింఛన్లను అందజేస్తున్న కలెక్టర్ అన్సారియా


సంతనూతలపాడులో పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

మరలా రాష్ట్రాన్ని దేశంలో నెంబర్‌వన్‌గా ఉంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని, ప్రతిపక్షాలు ప్రజలను తప్పుదారి పట్టించేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ, నియోజకవర్గ పరిశీలకులు చౌటపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర సెక్రటరీ అడకాస్వాములు, మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, ఎం.శ్రీనివాసరావు, అంకారావు, ఆర్.సురేష్, బి.శంకర్, ఎం.వెంకటేశ్వర్లు, శ్రీను, సుబ్బారావు పాల్గొన్నారు.


వెల్లంపల్లిలో వృద్ధుడికి పింఛను నగదును అందిస్తున్న ఎమ్మెల్యే బీఎన్

వెల్లంపల్లిలో..

మద్దిపాడు: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం వెల్లంపల్లిలో సచివాలంయం వద్ద పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామని తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్లు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమలో నాయకులు దేవబత్తిన ప్రసాద్, ముల్లూరి మురళి, ముచ్చు సుబ్బారావు, ఎంపీటీసీ అద్దేపల్లి లక్ష్మీదుర్గభవాని, సర్పంచ్ చిట్టిబోయిన అనిల్‌కుమార్ యాదవ్, దాట్ల వేణుగోపాల్ రాజు, గడ్డం రవికుమార్, బాపట్ల ఆశీర్వాదం, బత్తుల రవి, బత్తుల వెంకటేశ్వర్లు, పసుపులేటి వెంకట్రావు, పసుపులేటి శ్రీను, మీసాల వెంకటేశ్వర్లు, నూతలపాటి ప్రసాద్, మేడికొండ అనిల్‌కుమార్, నూతలపాటి ప్రతాప్, రావి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పుగుండూరులో..

నాగులుప్పలపాడు: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ మండలంలో సజావుగా సాగింది. ఉప్పుగుండూరులో జరుగుతున్న పింఛన్ల పంపిణీని ప్రత్యేకాధికారి జేడీఏ బేబీరాణి పరిశీలించారు. పలువురికి స్వయంగా పింఛను నగదును అందించారు. అలాగే ఎంపీడీవో మహాలక్ష్మి, టీడీపీ నాయకులు లబ్ధిదారులకు పింఛన్లను అందజేశారు.


పింఛను అందిస్తున్న జేడీఏ బేబీరాణి

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం : ఎమ్మెల్యే దామచర్ల

ఒంగోలు (కార్పొరేషన్), ఆగస్టు 1 : ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతించినట్లు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ వర్గీకరణ అంశానికి సీఎం చంద్రబాబునాయుడు కట్టుబడి ఉన్నారని పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఎస్సీల రిజర్వేషన్‌పై చంద్రబాబు అమలు చేసిన విధానంతో సుమారు 22 వేల మందికి పైగా మాదిగలకు న్యాయం చేకూరిందన్నారు. తద్వారా ప్రభుత్వశాఖల్లో ఆయా రిజర్వేషన్ ప్రకారం ఉద్యోగాలు సాధించారని తెలిపారు. దశాబ్దాల పోరాటానికి మంద కృష్ణమాదిగ చేసిన పోరాట ఫలితమే నేటి తీర్పు అని, అందుకు ఆయనకు దామచర్ల శుభాకాంక్షలు తెలిపారు. అలాగే వర్గీకరణకు కట్టుబడిన ఎన్డీయే ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకుందన్నారు. ప్రధాని నరేంద్రమోదీకి దామచర్ల ధన్యవాదాలు తెలిపారు.

ఫైల్స్ పెండింగ్ లేకుండా చూడాలి : ఎస్పీ

ఒంగోలు(క్రైం), ఆగస్టు1: పోలీసు సిబ్బందికి చెందిన ఫైల్స్ పెండింగ్ లేకుండా పరిష్కరించాలని ఎస్పీ దామోదర్ పేర్కొన్నారు. గురువారం ఒంగోలులోని జిల్లా పోలీసు కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బందితో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు సిబ్బందికి సంబంధించిన ఎలాంటి ఫైళ్లు పెండింగ్ లేకుండా చూడాల్సిన బాధ్యత కార్యాలయం సిబ్బందిపై ఉందన్నారు. విధుల్లో సమయపాలన పాటించాలని చెప్పారు. ఎలాంటి నిర్లక్ష్యం వహిచినా శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్పీ కె.నాగేశ్వరరావు, ఏవో సులోచన, అసిసెంట్ ఏవో ఉస్మాన్‌బాషా, సూపరింటెండెంటెండ్లు శైలజ, యాస్మిన్‌భాను పాల్గొన్నారు.

పోలీసు అధికారులు, సిబ్బందికి సత్కారం

విధినిర్వహణలో ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ దామోదర్ ప్రశంచించి సత్కరించారు. గంజాయి అక్రమ రవాణాను అడ్డుకట్ట వేసి నిందితులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకున్న పోలీసు అధికారులను ఎస్పీ అభినందించి ప్రశాంసాపత్రాలను అందజేశారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

మద్దిపాడు, ఆగస్టు 1: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని బ్రహ్మకుమారి విశ్వవిద్యాలయం ప్రతినిధి కడియాల రాజ్యలక్ష్మి అన్నారు. గురువారం బ్రహ్మకుమారి విశ్వవిద్యాలయం వార్షికోత్సవం సందర్భంగా మద్దిపాడులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో కులమతాలకు అతీతంగా ఆధ్మాత్మికత కార్యక్రమాలు ఉంటాయన్నారు. కార్యక్రమానికి గంట కోటేశ్వరరావు, బత్తిన సత్యవతి, శారద ఉండవల్లి, సుందరరావు, వెంకామయ్య, బ్రహ్మకుమారి సభ్యులు పాల్గొన్నారు.

పేదలకు మరింత ఉపాధి : ఏపీవో

మద్దిపాడు, ఆగస్టు 1: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పేదలకు వివిధ పనులను కేంద్రం కల్పిస్తున్న విషయం తెలిసిందే. మద్దిపాడు మండలంలోని 23 గ్రామాలలో ఆర్థిక సంవత్సరం నాలుగు నెలలకే సుమారు 564 పనిదినాలను పూర్తి చేశారు. దీంతో మండలంలో వేలాది మందికి ఉపాధి దొరికిందని ఏపీవో ధనుంజయ్‌వర్మ గురువారం తెలిపారు. జూన్ నుంచి పని దినాలు కూలీలకు వేతం విడుదల కావాల్సి ఉందని, వారం రోజుల్లో కూలీలు ఖాతాలో పెండింగ్ వేతనాలు జమచేయనున్నట్లు పేర్కొన్నారు. అదనపు పని దినాలు లభించకపోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం లక్ష్యాలకు అనుగుణంగా పనులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

రామచంద్రాపురం సర్పంచ్‌పై విచారణ

● రాజీనామాను తండ్రి ద్వారా సమర్పించిన మౌనిక

చీమకుర్తి, ఆగస్టు 1 : మండలంలోని రామచంద్రాపురం సర్పంచ్‌పై వచ్చిన ఆరోపణల మీద ఈవోఆర్డీ శ్రీనివాసులు గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో విచారణ జరిపారు. సర్పంచ్ మౌనిక విదేశాల్లో ఉంటూ పంచాయతీ సమావేశాలకు సైతం గైర్హాజరై ఇక్కడ కార్యాలయంలో రికార్డుల్లో మాత్రం ఆమె సంతకాలు ఉండటంతో స్పందనలో ఫిర్యాదు అందింది. దీంతో ఈవోఆర్డీ విచారణ జరిపారు. నివేదికను ఉన్నతాధికారులకు అందచేయనున్నారు. కాగా సర్పంచ్ మౌనిక తన తండ్రి ద్వారా అందజేసిన రాజీనామాపత్రాన్ని ఆమోదం కోసం ఉన్నతాధికారులుకు నివేదించినట్లు ఎంపీడీవో రాఘవేంద్ర తెలిపారు.

బీచ్‌కబడ్డీ జట్టులో పాకల విద్యార్థినులు


క్రీడాకారులతో కోచ్ హజరత్తయ్య

సింగరాయకొండ, ఆగస్టు 1 : రాష్ట్రస్థాయి మహిళా బీచ్ కబడ్డీ పోటీలకు పాకల జడ్పీ స్కూల్‌కు చెందిన ఆరుగురు విద్యార్థినులు ఎంపికయ్యారని కోచ్ పిల్లి హజరత్తయ్య గురువారం చెప్పారు. గ్రామానికి చెందిన కె.భూమిక, వి.అర్చన, వి.అపర్ణ, కె.నందిని, కె.సౌమ్య, కె.సిపోరా ఎంపికయ్యారని కోచ్ వివరించారు. వీరంతా శుక్రవారం నుంచి 4వ తేదీ వరకు నెల్లూరు జిల్లా కోవూరు మండలం ఇందుకూరుపేటలో జరిగే రాష్ట్ర ఇంటర్ డిస్ట్రిక్ట్ మహిళా బీచ్ కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని కోచ్ వివరించారు.

కాలేజీకి సమీపంలోని మద్యం దుకాణాన్ని తొలగించండి

మర్రిపూడి, ఆగస్టు 1 : మర్రిపూడి ప్రభుత్వ జూనియర్ కాలేజీ సమీపంలో ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణాన్ని తొలగించాలని ప్రిన్సిపాల్ అల్లురయ్య, గ్రామస్థులు గురువారం ఓ ప్రకటనలో కోరారు. జూనియర్ కాలేజీ దగ్గరలో ఉన్న మద్యం దుకాణం ఉండటం వలన విద్యార్థుల చదువుకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. మద్యం సేవించి గుంపులుగా చేరడం, అల్లరి చేయడం వంటివి చేస్తుంటారని వారు పేర్కొన్నారు.

'మదర్ మిల్క్ బ్యాంకులు' ఏర్పాటుకు చర్యలు

కలెక్టర్ అన్సారియా
ఘనంగా తల్లిపాల వారోత్సవాలు ప్రారంభం


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు(కార్పొరేషన్), ఆగస్టు 1: పిల్లలకు ఆస్తి, మంచి చదువుకు ఎలాంటి ప్రాధాన్యత ఇస్తామో, అంతకుమించి పిల్లలకు తల్లిపాలు ఇవ్వడం వల్ల మంచి ఆరోగ్యాన్ని అందించవచ్చని, తల్లిగా తాను కూడా అదే నిర్ణయం తీసుకున్నానని కలెక్టర్ తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. గురువారం ఒంగోలులోని జీజీహెచ్‌లో తల్లిపాల వారోత్సవాలను కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు. బిడ్డలకు తల్లిపాలు పలు కారణాల వల్ల ఇవ్వలేకపోయే వారికి మదర్ మిల్క్ బ్యాంక్స్ (ఫీడింగ్ బ్యాంకులు) జిల్లాలో ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని గుర్తించామని తెలిపారు. ఆ దిశగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెల్లడించారు. వెయ్యి రోజులపాటు తల్లిపాలు బిడ్డకు ఇవ్వడం ఎంతో ఉత్తమమైన మార్గమని, ప్రజల్లో ఈ విషయంపై పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. ఇద్దరు బిడ్డల తల్లిగా తాను ఇదే తరహా పాటించినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. రిమ్స్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు మాట్లాడుతూ బిడ్డకు తల్లి తన పాలు ఇవ్వని పక్షంలో బ్రెస్ట్‌కేన్సర్ వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని తల్లులు అందరూ తమ బిడ్డలకు పాలు ఇవ్వడం తప్పనిసరి పేర్కొన్నారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ దుర్గాభవానీ మాట్లాడుతూ జీజీహెచ్‌లోని పనిచేస్తున్న సిబ్బందితోపాటు వచ్చే రోగులకు ఫీడ్ రూములు ఏర్పాటు చేశామన్నారు. వారం రోజుల పాటు తల్లిపాలపై పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. జిల్లావ్యాప్తంగా తల్లిపాల వారోత్సవాలపై ఆరోగ్యకేంద్రాలలో ప్రజలకు అవగాహన కల్పిస్తామని చెప్పారు. చిన్నపిల్లల విభాగం అధికారి డాక్టర్ ఎలిజబెత్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డీఎంహెచ్‌వో సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

ఒంగోలు(కలెక్టరేట్): ప్రభుత్వ సహాయంతో ప్రారంభమైన గృహ నిర్మాణాలు త్వరగా పూర్తయ్యేలా చూడాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. గృహ నిర్మాణ సంస్థ, టిడ్కో ఆధ్వర్యంలో చేపట్టిన ఇళ్ల నిర్మాణాల స్థితిగతులపై గురువారం స్థానిక కలెక్టరేట్‌లో ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలలో పూర్తనవి, వివిధ దశలలో ఉన్నవాటి వివరాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అధికారులు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ లబ్ధిదారులు త్వరగా ఇళ్లు పూర్తి చేసుకునే చూడాలన్నారు. ఎద్దైనా సమస్యలు ఎదురైతే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని కలెక్టర్ తెలిపారు. జిల్లా స్థాయిలో సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. టిడ్కో కాలనీల్లో మౌలిక సదుపాయాల కోసం చెల్లింపులు జరిగిన పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. సమావేశంలో హౌసింగ్ పీడీ పేరయ్య, ఒంగోలు, మార్కాపురం ఈఈలు పెరుగు శ్రీనివాస్‌ప్రసాద్, దశరథిశర్మ, డీట్కో ఈఈ వెంకటేశ్వరరావు, డీఈఈ వీరబ్రహ్మాచారి తదితరులు పాల్గొన్నారు.

బాలిక ప్రసవంపై కేజీబీవీలో విచారణ

● రంగంలోకి దిగిన పోలీసులు

కొత్తపట్నం(ఒంగోలునగరం) ఆగస్టు 1: కొత్తపట్నం మండలంలోని మోటుమాల -పాదర్తి గ్రామాల మధ్య ఉన్న కస్తూర్బాగాంధీ విద్యాలయంలో బుధవారం జరిగిన సంఘటనపై పోలీసులు రంగంలోకి ప్రాథమిక విచారణ చేపట్టారు. ఒంగోలు డీఎస్పీ కిషోర్‌బాబు, చీమకుర్తి సీఐ సుబ్బారావు సదరు పాఠశాలను సందర్శించారు. ఇక్కడ ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న బాలిక బుధవారం ఉదయం పాఠశాలలోని బాత్‌రూమ్‌లో ప్రసవించింది. ఆమెక మగబిడ్డకు జన్మనివ్వగా, బిడ్డ పుట్టిన వెంటనే చనిపోయింది. దీనిపై కూడా పోలీసులు ఆరా తీస్తున్నారు. ఈ సంఘటనపై ఇప్పటికే చీమకుర్తి పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు కాగా పూర్తి వివరాలను తెలుసుకునే దిశగా విచారణకు సిద్ధమయ్యారు. కాగా డీఎస్పీ కిషోర్‌బాబు గురువారం పాఠశాల ప్రత్యేక అధికారి అరుణకుమారి, ఇతర ఉపాధ్యాయులతో మాట్లాడారు. బాలికను ఇంటర్‌లో గత నెల 19వ తేదీన కేజీబీవీలో చేర్చుకున్న తర్వాత ఆమె గర్భవతి అన్న విషయాన్ని పాఠశాల సిబ్బంది ఎందుకు గుర్తించలేక పోయారు, ప్రసవించే సమయంలో కనీసం ప్రసవ వేదన పడుతున్న విషయాన్ని కూడా గుర్తించక పోవటంపై విచారణ జరుపుతున్నారు. రెసిడెన్షియల్ పాఠశాలలో స్పెషల్ ఆఫీసర్, ఉపాధ్యాయులు, ఇతర ఆయాలు, వాచ్‌మెన్‌లు ఉన్నా బాలిక గర్భవతి అన్న విషయాన్ని ఎందుకు కనిపెట్టలేకపోయరని, ప్రసవం సమయం దగ్గర పడుతున్నా బాలిక పరిస్థితిని ఎందుకు గమనించలేకపోయారన్న దిశగా విచారణ చేస్తున్నట్లు సమాచారం. అయితే కేజీబీలో ఏఎన్ఎం పోస్టు కూడా ఉంది. నిరంతరం విద్యార్థినుల ఆరోగ్య పరిరక్షణ చూసేందుకు ప్రభుత్వం ఏఎన్ఎంను కూడా నియమించింది. గత నెల 19వ తేదీన పాఠశాలలో చేరిన విద్యార్థిని గర్భంతో ఉన్నదనే విషయాన్ని ఏఎన్ఎం అయినా గుర్తించాల్సి ఉంటుంది. కాని అలా జరగలేదని అంటున్నారు. పాఠశాలలో జరిగిన ఈ సంఘటనపై అనేక అనుమానాలు, పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యం కనిపిస్తోంది. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరిగిన తర్వాతే అసలు విషయాలు వెలుగు చేసే అవకాశం ఉంది.

రొయ్యల సాగులో మేలైన పద్ధతులు పాటించాలి

● మత్స్యశాఖ కమిషనర్ శంకర్



మాట్లాడుతున్న కమిషనర్ శంకర్, పక్కన కలెక్టర్ అన్సారియా

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 1 : రొయ్యల సాగులో మేలైన పద్ధతులు పాటించి మంచి దిగుబడులు సాధించే దిశగా అడుగులు వేయాలని మత్స్యశాఖ కమిషనర్ టి.శంకర్ పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో గురువారం రొయ్యల పెంపకందారులు, హెచరీలయాజమాన్యం, ప్రాసెసింగ్ ప్లాంట్ల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతకు ముందు రొయ్యల రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ నాసిరకం సీడ్ వల్ల తీవ్రంగా నష్టపోయామని ఇవేదన వ్యక్తం చేశారు. పి.మోనోడాన్ సీడ్‌ను వైష్ణవి హెచరీ గూడూరు నుంచి, మున్నంగి హెచరీ నెల్లూరు నుంచి దిగుమతి చేసుకున్న సీడ్ వల్ల రొయ్య ఎదుగుదల తగ్గిపోయి రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చిందని చెప్పారు. దీనిపై కమిషనర్ శంకర్ మాట్లాడుతూ ఆయా హెచరీలసీడ్ శాంపిల్స్‌ను సేకరించి ఎస్ఎఫ్‌డీబీ హైదరాబాద్ ల్యాబ్‌కు పంపడం జరిగిందన్నారు. ఆ ల్యాబ్ నుంచి నివేదిక వచ్చాక ప్రభుత్వానికి పంపుతామని తెలిపారు. అనంతరం కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ రొయ్యల సాగు కోసం మంచి నాణ్యమైన సీడ్‌ను అందించే విధంగా హెచరీలు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అందుకు సంబంధించిన అంశాలను దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో ఒంగోలు, నెల్లూరు మత్స్యశాఖ అధికారులు ఆవుల చంద్రశేఖర్‌రెడ్డి, ఎం.నాగేశ్వరరావు, మత్స్యశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ వీవీఆర్.బాబు, సంఘం అధ్యక్షుడు గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పుపై ఎమ్మార్పీఎస్ హర్షం


ఈదుమూడిలో సంబరాలు నిర్వహిస్తున్న కనకారావు తదితరులు

నాగులుప్పలపాడు, ఆగస్టు 1 : ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో మండలంలోని ఈదుమూడి, ఉప్పుగుండూరు తదితర గ్రామాలలో సంబరాలు జరిగాయి. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణే లక్ష్యంగా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆవిర్భవించిన ఈదుమూడి గ్రామంలో గురువారం ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక సభ్యుల ఆధ్వర్యంలో అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పాలాభిషేకం చేశారు. కేక్ కట్ చేసి బాణాసంచా కాల్చి సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక సభ్యుడు, మాదిగ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మూరి కనకారావు మాట్లాడుతూ దాదాపు మూడు దశాబ్దాలుగా ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ కోసం మాదిగలు ఎదురుచూస్తున్నారన్నారు. 2000-2004 మధ్య సీఎం చంద్రబాబు ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉండటంతో ఎంతో మంది మాదిగలు, మాదిగఉప కులాలకు న్యాయం జరిగిందన్నారు. అనంతరం నిలిచిపోయిన ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ నేడు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మాదిగల విజయంగా భావిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ అధ్యక్షులు పేరి పోగు వెంకటేశ్వరరావు, కొమ్మూరి హైమారావు, తేళ్ల యెషయ, అత్తంటి మోహనరావు పాల్గొన్నారు.

టీడీపీ ఎస్సీసెల్ ఆధ్వర్యంలో..

మద్దిపాడు: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం ఎంతో సంతోషందాయకమని తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు రెబ్బవరపు ప్రభాకర్ రావు దుద్దుకూరి డేవిడ్, పాటిబండ్ల చెంచయ్య, ఏగూరి ప్రభుదాస్ పాటిబండ్ల మాణిక్యరావు హర్షం వ్యక్తం చేశారు. మాదిగ రిజర్వేషన్‌కు నుకూలంగా వర్గీకరణ చేపట్టడం పట్ల ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు మందకృష్ణలకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

అవీ..ఇవీ..

కేజీబీవీ ఘటనపై సమగ్ర విచారణ చేయాలి

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 1 : కొత్తపట్నం మండలం మోటుమాలలోని కేజీబీవీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న మైనర్ బాలిక గర్భం దాల్చిన ఘటనపై సమగ్ర విచారణ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్.వినోద్, ఐద్వా జిల్లా కార్యదర్శి కె.రమాదేవి గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తల్లిదండ్రుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని బాలికను శారీరకంగా లొంగదీసుకొని గర్భం దాల్చడానికి కారణమైన వ్యక్తులపై పోక్సో చట్టం కింద నమోదు చేయాలన్నారు. బాలికకు మనోధైర్యాన్ని కల్పించి చదువుకు ఆటంకం లేకుండా చూడాలని వారు కోరారు.

విద్యార్థులు మంచి ఇంజనీర్లుగా ఎదగాలి

● ఇస్రో సైంటిస్టు సుబ్బారావు



సదస్సులో పాల్గొన్న అతిథులు

ఒంగోలు(విద్య), ఆగస్టు 1: ఇంజనీరింగ్ విద్యలో ప్రవేశిస్తున్న విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని ప్రణాళికబద్ధంగా ముందుకు సాగి మంచి ఇంజనీర్లుగా ఎదగాలని ఇస్రో సైంటిస్టు సుబ్బారావు పేర్కొన్నారు. గురువారం ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రధానంగా సాఫ్ట్‌వేర్ రంగంలో వచ్చిన ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీ అండ్ మెషిన్‌లెర్నింగ్, డేటా సైన్స్ వంటి కొత్త ఒరవడులను నేర్చుకోవాలని సూచించారు. క్విస్ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ నిడమానూరి సూర్యకళ్యాణచక్రవర్తి మాట్లాడుతూ విద్యార్థులు కోటి రూపాయాల ప్యాకేజి అందుకోవడానికి కంప్యూటర్ లాంగ్వేజీతో పాటు ప్రాడక్ట్ డెవలప్‌మెంట్‌లో నైపుణ్యం సాధించాలన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యతో పాటు మానవతా విలువలను కూడా పెంపొందించుకోవాలన్నారు. కళాశాల ఉపాధ్యక్షుడు బి.చెంచుప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో చరిత్ర సృష్టించవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వైవీ.హనుమంతరావు, విభాగాధిపతి జి.శ్రీనివాసరావు, డీన్‌లు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

బీపీఈడీ పరీక్షా కేంద్రం తనిఖీ

ఒంగోలు(విద్య), ఆగస్టు 1: ఒంగోలులోని ఆంధ్రకేసరి యూనివర్శిటీ కళాశాలలో జరుగుతున్న బీపీఈడీ పరీక్షా కేంద్రాన్ని వైస్ చాన్స్‌లర్ డీవీఆర్.మూర్తి గురువారం తనిఖీ చేశారు. ఈ పరీక్షా కేంద్రంలో మేరదమెట్ల శారదా బీపీఈడీ కళాశాలకు చెందిన విద్యార్థులు 109 మంది పరీక్షకు హాజరయ్యారు. యూనివర్శిటీ పరిధిలోని వ్యాయామ కళాశాలల్లో మంగళవారం నుంచి పరీక్షలు జరుగుతున్నాయి. పరీక్షల నిర్వహణ పట్ల వీసీ సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట యూనివర్శిటీ కళాశాల ప్రిన్సిపాల్ జి.రాజమోహన్ ఉన్నారు.

ఓపెన్ స్కూళ్ల అడ్మిషన్లకు నోటిఫికేషన్

ఒంగోలు(విద్య), ఆగస్టు 1 : ఏపీ ఓపెన్ స్కూలు సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పదో తరగతి, ఇంటర్ కోర్సుల్లో 2024-25 విద్యాసంవత్సరంలో అడ్మిషన్లకు నోటిఫికేషన్ విడుదలైంది. ఈ మేరకు ఏపీ ఓపెన్ స్కూలు సొసైటీ డైరెక్టర్ కె.నాగేశ్వరరావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 27లోపు అడ్మిషన్లు పొందవచ్చు. ఆన్‌లైన్‌లో ఓపెన్ స్కూలు వెబ్‌సైట్‌లో రూ.200 రుసుం చెల్లించి అడ్మిషన్ పొందవచ్చని ఆయన పేర్కొన్నారు.

11లోపు డీఈఎల్ఈడీ పరీక్ష ఫీజు చెల్లించాలి

ఒంగోలు(విద్య), ఆగస్టు 1 : డిప్లమో ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఈఎల్ఈడీ) 2023-25 బ్యాంచ్ రెగ్యులర్, 2021-23, 2021-2024 బ్యాచ్‌లు ఒకసారి ఫైయిలైన విద్యార్థులు రెండవ సెమిస్టర్ పరీక్ష ఫీజు ఈనెల 11వ తేదీ లోపు చెల్లించాలని మైనంపాడు డైట్ ప్రిన్సిపాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష ఫీజు రూ.150, అపరాధరుసుంతో ఈనెల 19వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లింపునకు అవకాశం కల్పించారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష ఫీజు చెల్లించి పరీక్షలకు హాజరు కావాలని ఆయన కోరారు.

సమతానగర్‌లో చోరీ


ఆధారాలను సేకరిస్తున్న క్లూస్ టీం

ఒంగోలు(క్రైం), ఆగస్టు1 : తాళం వేసిన ఇంటి తలుపు పెకలించి దుండగులు చోరీకి పాల్పడ్డారు. సుమారు రూ.2లక్షల సొత్తు అపహరించారు. ఈ సంఘటన ఒంగోలు నగరం సమతానగర్‌లో శ్రీసాయి కాన్సెప్ట్ స్కూలు సమీపంలో గురువారం వెలుగు చూసింది. వివరాలలోకి వెళితే.. మాజీ సైనిక ఉద్యోగి అంకోజీ వెంకటేశ్వర్లు గత నెల 28న కుటుంబ సభ్యులతో కలిసి తిరుపతి వెళ్లారు. గురువారం తిరిగి ఇంటికి వచ్చే సరికి ఇంటి తలుపు పెకలించి ఉంది. ఇంట్లో బీరువా పగలగొట్టి వస్తువులు అన్నీ చిందరవందరగా గా పడవేసి ఉన్నాయి. దీంతో ఇంట్లో దొంగలు పడ్డారని గుర్తించిన ఆయన వెంటనే తాలుకా పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈమేరకు పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బీరువాలో ఉన్న రూ.లక్ష నగదు, రెండు సవర్లు బంగారం ఆభరణాలు దుండగులు చోరీ చేసినట్లు యజమానికి వెల్లడించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉన్నత విద్యపై మాగుంట ప్రశ్న

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 1: ఉన్నత విద్యపై కేంద్ర ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకుందని ఒంగోలు లోక్‌సభసభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి గురువారం పార్లమెంట్‌లో ప్రశ్నించారు. ఆయా అంశాలపై కేంద్ర విద్యాశాఖ సహాయక మంత్రి డాక్టర్ సుకాంత మజుందార్ సమాధానం ఇస్తూ జాతీయ స్థాయి సర్వే 2021-22 ప్రకారం దేశంలో ఉన్నత విద్య స్థూల నమోదు ఉత్పత్తి 2021-22లో 28.4శాతంగా ఉందని, ఉన్నత విద్యాసంస్థల్లో 2.26 కోట్ల మంది విద్యార్థులు నమోదు కాగా 2.07 కోట్ల మంది విద్యార్థినులు నమోదయ్యారని తెలిపారు. దేశంలో ఎస్సీ,ఎస్టీ, ఓబీసీ విద్యార్థుల కోసం పలు ఉపకార వేతనాలు, ఫెలోషిప్పులు అమలు చేస్తున్నట్లు వివరణ ఇచ్చారు.

రేపు ఎంపీ మాగుంట రాక : ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి శనివారం ఒంగోలులో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఉదయం 8గంటల నుంచి తన కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. అనంతరం నగరంలో జరిగే పలు కార్యక్రమాలకు మాగుంట హాజరవుతారు.

శివం ఫౌండేషన్ చేయూత


నగదును అందజేస్తున్న వెంకట్రావు

చీమకుర్తి, ఆగస్టు 1: అనారోగ్యంతో మంచంపట్టిన ఓ పేదకుటుంబానికి శివం ఫౌండేషన్ చేయూతనిచ్చింది. చీమకుర్తి పట్టణానికి చెందిన బండారు సుబ్బారావు, ఆదిలక్ష్మి అనే వృద్ధ దంపతులు అనారోగ్యంతో బాధపడుతూ శివం ఫౌండేషన్ అధ్యక్షుడు గొల్లపూడి శ్రీహరిని సంప్రదించారు. దీనికి స్పందించిన శివం ఫౌండేషన్ గురువారం టీడీపీ నాయకుడు పూనాటి వెంకట్రావు చేతులమీదుగా రూ.15వేల నగదును దంపతులకు అందజేశారు. కార్యక్రమంలో పోకూరి ఆంజనేయులు, తిరుమల, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

స్కూటీ అదుపుతప్పి మహిళకు గాయాలు

మద్దిపాడు, ఆగస్టు 1: ఏడుగుండ్లపాడు హర్షిణీ కాలేజీ వద్ద గురువారం స్కూటీ అదుపుతప్పి మహిళకు గాయాలయ్యాయి. మద్దిపాడు నుంచి ఒంగోలు వైపు అద్దంకిలోని భవానీసెంటర్‌కు చెందిన పి.రమాదేవి ప్రయాణిస్తుండగా కారు అతివేగంగా రావడంతో మహిళ తీవ్ర ఆందోళనకు గురయ్యింది. దీంతో స్కూటీ అదుపుతప్పి కిందపడడంతో గాయాలు కాగా ఆమెను చికిత్స నిమిత్తం ఒంగోలులోని ప్రయివేటు వైద్యశాలకు తరలించారు.

200 మంది రోగులకు వైద్య సేవలు


సూచనలిస్తున్న వైద్యుడు హనుమంతరావు

టంగుటూరు, ఆగస్టు 1 : మక్కెన వెంకట క్రిష్ణారావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం టంగుటూరు పంచాయతీ ఆవరణలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 200మంది రోగులకు వైద్యసేవలు అందాయి. రోగులకు మందులను ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు హనుమంతురావు, మహేష్‌కుమార్, దివ్య యాగంటి, ప్రియాంక ఉన్నారు. మాజీ సర్పంచ్ బెల్లం జయంత్‌బాబు, రావి బ్రహ్మయ్య ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

పింఛన్ల పెంపుతో లబ్ధిదారుల కళ్లలో ఆనందం

మంత్రి స్వామి

రికార్డు స్థాయిలో పంపిణీ కార్యక్రమాలు

సింగరాయకొండ, ఆగస్టు 1 : ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం పింఛన్ నాలుగు వేల రూపాయలకు పెంపు చేయడంతో లబ్ధిదారుల కళ్లలో మునుపెన్నడూ లేని ఆనందం కనిపిస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి చెప్పారు. మండలంలోని పాకల, ఊళ్లపాలెంల్లో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. రాష్ట్రంలో ఎన్టీఆర్ హయాంలో సామాజిక భద్రత పింఛన్లను టీడీపీ ప్రభుత్వమే మొదటిసారి ప్రవేశపెట్టిందన్నారు. అలాగే పింఛన్ డబ్బును పలు దఫాలు పెంచింది కూడా టీడీపీయేనని గుర్తు చేశారు. వైసీపీ ప్రభుత్వం పదేపదే గతంలో తాము పెంపుదల చేసినట్లు అబద్ధపు ప్రచారాలు చేసుకున్నదని విమర్శించారు. పింఛన్ డబ్బు ఇళ్ల వద్ద ఇవ్వలేమని గత ప్రభుత్వం వృద్ధుల జీవితాలతో ఆడుకుందన్నారు. రెండు రోజుల్లోనే వందశాతం పింఛన్లు అందజేయగలమని కూటమి ప్రభుత్వం రుజువు చేసిందని చెప్పారు. టీడీపీ కూటమి చేతిలో ఘోర ఓటమిపాలైన వైసీపీ నాయకులు ఏమి చేయాలో పాలుపోక కూటమి మేనిఫెస్టోపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. అనంతరం లబ్ధిదారులతో మంత్రి మాట్లాడారు. ఆ తర్వాత సింగరాయకొండలోని సుందర్‌నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని మంత్రి సందర్శించారు. కేంద్రంలో కనీస వసతులు లేకుండా చేసిన వైసీపీ నాయకులు నాడు-నేడు అని ఆర్భాటపు ప్రకటనలు చేసుకుని కాలం వెళ్లదీశారని విమర్శించారు. ఈ సందర్భంగా చిన్నారులతో మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వేల్పుల సింగయ్య, పార్టీ పరిశీలకుడు అడకా స్వాములు, సీనియర్ నాయకుడు వల్లెపు రామవులు, చిగురుపాటి గరి, పాకల సర్పంచ్ సైకం చంద్రశేఖర్, నాయకులు చీమకుర్తి కృష్ణ, సన్నెబోయిన శ్రీనివాసులనాయుడు, నాయకులు రాజగోపాల్‌రెడ్డి, కూనపరెడ్డి సుబ్బారావు, సందానిబాషా, సుదర్శి చంటి, మించల బ్రహ్మయ్య, బాయిరెడ్డి మురళి, బాలాజీ, గాలి హరిబాబు, వేల్పుల వెంకటరావు, యస్థాని, సనావుల్లా, రామారావు జనసేన మండల పార్టీ అధ్యక్షుడు రాజేష్, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న మంత్రి స్వామి

ముమ్మరంగా పింఛన్ల పంపిణీ

కొండపి: నెల తొలిరోజే అర్హులైన పింఛన్లదారులందరికీ పింఛన్ డబ్బులు అందజేసే కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. అందులో భాగంగా నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో తొలిరోజు దాదాపు 95శాతం పైగా లబ్ధిదారులకు పింఛన్ డబ్బులు అందజేశారు. కొండపి మండలంలోని ఇలవర (నేతివారిపాలెం) గ్రామంలో గురువారం ఉదయం పింఛన్‌ల పంపిణీ కార్యక్రమాన్ని హౌసింగ్ పీడీ, కొండపి మండల పింఛన్ల పంపిణీ కార్యక్రమ ప్రత్యేకాధికారి పేరయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలువురు లబ్ధిదారులకు పింఛన్ డబ్బులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగమణి గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. అన్ని గ్రామాల్లో ప్రభుత్వ సిబ్బందితోపాటు ఆయా గ్రామాల టీడీపీ నాయకులు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పొన్నలూరులో...

పొన్నలూరు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో గురువారం ఉదయం 5 గంటలకే లబ్ధిదారులకు పింఛన్ డబ్బులు అందజేసే కార్యక్రమాన్ని ఆయా గ్రామాలకు కేటాయించిన ప్రభుత్వ సిబ్బంది ప్రారంభించారు. పంపిణీ కార్యక్రమాన్ని జడ్పీ డిప్యూటీ సీఈవో, మండల ప్రత్యేకాధికారి హనుమంతరావు పొన్నలూరులో పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు, ఎంపీడీవో కల్పన పాల్గొన్నారు.



ఇలవరలో పింఛను డబ్బులు అందజేస్తున్న హౌసింగ్ పీడీ పేరయ్య



పొన్నలూరులో పింఛను డబ్బులు అందజేస్తున్న ప్రత్యేకాధికారి హనుమంతరావు

గ్రానైట్ కార్మికుడు ఆత్మహత్య



మృతి చెందిన వరప్రసాద్

సంతనూతలపాడు, ఆగస్టు 1: సంతనూతలపాడు పార్కు సమీపంలోని గ్రానైట్ పాలిషింగ్ యూనిట్‌లో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్న వ్యక్తి ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన సంఘటన గురువారం వేకువజామున చోటుచేసుకుంది. ఎస్సై దేవకుమార్ తెలిపిన వివరాల మేరకు.. కృష్ణా జిల్లా ఉయ్యూరుకు చెందిన అయినంపూడి వరప్రసాద్(48) గత కొంతకాలంగా పాలిషింగ్ యూనిట్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. ఈక్రమంలో ఆర్థిక ఇబ్బంధులు తలెత్తడంతో తన గదిలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డట్లు భావిస్తున్నారు. సంఘటన ప్రాంతాన్ని సీఐ అజయ్‌కుమార్, ఎస్సై దేవకుమార్‌లు పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. పాలిషింగ్ లీజు దారుదు వై.భాస్కర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యునిగా మాగుంట

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 1: పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యునిగా ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి నియమితులయ్యారు. 2025 ఏప్రిల్ 30 వరకు పదవి కాలం ఉన్న 15 మంది సభ్యులు పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఎన్నికలకు 19 మంది నామినేషన్లు వేశారు. వారిలో నలుగురు సభ్యులు నామినేషన్లను ఉపసంహరించుకోవడంతో 15 మంది సభ్యులు ఏకగ్రీవమయ్యారు. కమిటీ సభ్యులుగా తనను నియమించేందుకు సహకరించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఎంపీ మాగుంట కృతజ్ఞతలు తెలిపారు.

ఎంఆర్‌పీఎస్ ఆనంద హేళ

టంగుటూరు, ఆగస్టు 1 : ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు వెలువడడంతో గురువారం కొందరు బాణసంచా పేల్చి ఆనందం పంచుకున్నారు. ఈసందర్భంగా టంగుటూరు బస్టాండ్ సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పీఎస్ నాయకుడు బక్కా తిరుమలరావు మాదిగ మాట్లాడతూ వర్గీకరణకు మద్దతుగా నిలిచిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్లు పట్టివేత

దర్శి, ఆగస్టు 1: మండలంలో అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు. ప్రధానంగా వైసీపీ నాయకులు గతంలో నిరంతరం అక్రమ మట్టి వ్యాపారంలో కాసులు పండించుకున్నారు. నేటికీ కొంతమంది ఆ వ్యాపారాన్ని మానుకోలేకపోతున్నారు. తాజాగా మండలంలోని రాజంపల్లి చెరువులో ఓ వైసీపీ నాయకుడు టిప్పరు, ఎక్స్‌కవేటర్‌తో మట్టి తరలిస్తుండగా రెవెన్యూ అధికారులు బుధవారం రాత్రి పట్టుకున్నారు. రాజంపల్లి చెరువులోని మట్టిని అక్రమంగా తరలిస్తున్న విషయాన్ని గ్రామస్థులు అధికారులకు ఫిర్యాదే చేశారు. ఈక్రమంలో రెవెన్యూ, పోలీసు అధికారులు హుటాహుటీన అక్కడకు వెళ్లి అక్రమ మట్టి రవాణాను అడ్డుకున్నారు. మట్టి ఎత్తుతున్న ఎక్స్‌కవేటర్‌ను, మూడు టిప్పర్లను పట్టుకొని దర్శికి తరలించినట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఏపీ రవిశంకర్ తెలిపారు. ఎక్కడైనా మట్టి అక్రమ రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వైద్యశిబిరం నిర్వహణ అభినందనీయం

• ఎమ్మెల్యే విజయ్‌కుమార్



శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

చీమకుర్తి, ఆగస్టు 1 : పేదప్రజల ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ ఉచితవైద్యశిబిర నిర్వహించటం అభినందనీయమని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని కూనంనేనివారిపాలెం గ్రామంలో నల్లూరి ఫౌండేషన్, తెలుగుదేశంపార్టీ ,కిమ్స్ ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బీఎన్ మాట్లాడుతూ సేవాతత్పరతతో చేసే ఇలాంటి కార్యక్రమాలు ఆదర్శనీయమని తెలిపారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ, ఏఎస్పీ నాగేశ్వరరావులు నిర్వాహకులను అభినందించారు. దాదాపు 350మందికి పైగా రోగులకు కిమ్స్ వైద్యులు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ గొట్టిపాటి రాఘవరావు, సర్పంచ్ శ్రీనివాసరావు, ఎంపీటీసీ వేమా అశ్విని, నాయకులు పుట్టా బ్రహ్మయ్య, గోరంట్ల ప్రసాద్, పాలడుగు వెంకట నారాయణ, పుట్టా శ్రీనివాసరావు, పమిడి సుబ్బారావు, ఎర్రగుంట్ల హరికృష్ణ, వెంకటేశ్వర్లు, రాయపూడి కోటయ్య, కోటేశ్వరరావు, ప్రభాకర్, ప్రసాద్, నరసింహారావు, వేమా చిన్నబ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీ చేసిన బీఎన్ : కూనంనేనివారిపాలెంలో గురువారం సామాజిక పింఛన్లను ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలైన దిగుబడులు



పంటను పరిశీలిస్తున్న డీఏఈవో శ్రీనివాసరావు

పీసీపల్లి, ఆగస్టు 1: ప్రకృతి వ్యవసాయంతో మేలైన దిగుబడులు సాధించవచ్చునని జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని వెపగంపల్లి గ్రామంలో గడ్డం బాలసుబ్బయ్య అనే రైతు సాగుచేస్తున్న ప్రకృతి వ్యవసాయాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా రైతులతో ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో ఏడీఏ వెంకటరమణ, ఎంపీడీవో సుబ్బారావు, ఏఈవోలు పుల్లయ్య గోపి కృష్ణ, వీఏఏలు మనోహర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

చీరాలలో సీఐలకు స్థానచలనం

చీరాల, ఆగస్టు 1 : పోలీస్ అధికారుల బదిలీలలో భాగంగా ఇప్పటికే చీరాల వన్‌టైన్ సీఐగా బాధ్యతలు నిర్వహిస్తున్న శేషగిరిరావును బదిలీ చేశారు. ఆయన స్థానంలో గుంటూరు రేంజి వీఆర్‌లో ఉన్న మారీడు శ్రీనివాసరావును చీరాల వన్‌టౌన్ స్టేషన్ సీఐగా నియమించారు. ఈ నేపథ్యంలో చీరాల టూటౌన్, రూరల్ సీఐలకు కూడా స్థాన చలనం కలగనున్నట్లు సమాచారం. అందులో భాగంగా చీరాల టూటౌన్‌కు ప్రస్తుతం మార్కాపురం సీఐగా పనిచేస్తున్న ఏ.వెంకటేశ్వర్లు, రూరల్ సీఐగా ప్రస్తుతం త్రిపురాంతకం సీఐగా పనిచేస్తున్న ఎస్. సుబ్బారావు బదిలో పై రానున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ క్రమంలో ప్రస్తుం టూటౌన్ సీఐ సోమశేఖర్, రూరల్ సీఐ నిమ్మగడ్డ సత్యన్నారాయణలకు బదిలీ అనివార్యమని తెలుస్తోంది. ఇక చీరాల డీ ఎస్పీ నూతనంగా బదిలీపై రానున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికి అందిన సమాచారం మేరకు ఆవుల శ్రీనివాసరావు నియమితులయ్యే అవకాశం ఉంది. టెక్నికల్‌గా కొన్ని నిబంధనలను పరిగణలోకి తీసుకుని ఉన్నతాధికారులు పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

మార్టూరు సీఐగా శేషగిరిరావు

మార్టూరు : మార్టూరు సీఐగా పనిచేస్తున్న రాజశేఖర్‌రెడ్డి స్థానంలో ఎస్.శేషగిరిరావును నియమించారు. ఆయన గుంటూరులో వీఆర్ నుంచి బదిలీపై మార్టూరుకు వస్తున్నారు. 2010 నుంచి ఆయన మార్టూరు ఎస్ఐగా 20 నెలలు పనిచేశారు. శుక్రవారం ఆయన ఇక్కడ సీఐగా బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం.

కొట్లాటపై కేసు

ఇంకొల్లు, ఆగస్టు 1 : ఇంకొల్లు వడ్డెర కాలనీకి చెందిన భూలక్ష్మి కొంతకాలంగా చీటీపాటలు నిర్వహిస్తోంది. ఈ క్రమంలో కొంతమందికి తిరిగి చెల్లించాల్సిన డబ్బులు ఇవ్వలేక ఐపీ దాఖలు చేసి, నోటీసులు పంపింది. దీనిపై చీటీలు కట్టిన కోవూరి రంగయ్య, ఆదిమ్మ, అజయ్ తదితరులు వారి కట్టిన సొమ్ము తిరిగి చెల్లించాలని అడిగే విషయంలో భూలక్ష్మికి కొట్లాటకు దారితీసింది. ఈ ఘటనలో భూలక్ష్మికి గాయాలు అయ్యాయి. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మల్లికార్జునరావు తెలిపారు.

అనంతవరం పోస్టాఫీస్‌లో నిధులు గల్లంతు

సుమారు రూ.20 లక్షలు కాజేసినట్లు అంచనా • బీపీఎం, ఏబీపీఎంలను నిలదీసిన ఖాతాదారులు • ఒప్పుకున్న ఉద్యోగులు

తిరిగి చెల్లిస్తామని హామీ.. ఆమేరకు చెక్కుల అందజేత • పోస్టల్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలతో వెలుగు చూసిన మోసం



పోస్టాఫీస్ వద్దకు చేరుకున్న ఖాతాదారులు



బీపీఎం, ఏబీపీఎంలను విచారిస్తున్న విచారణాధికారి

టంగుటూరు, ఆగస్టు 1 : మండలంలోని అనంతవరం పోస్టాఫీస్‌లో వివిధ రూపాల్లో జనం జమ చేసిన లక్షలాది రూపాయల నిధులు గల్లంతయ్యాయి. మూడేళ్ల నుంచి ఈ వ్యవహారం గుట్టుగా నడుస్తున్నా గురువారం వెలుగుచూసింది. విషయం తెలియడంతో బీపీఎం శ్రీనివాసనాయక్, ఏబీపీఎం సుందరరావులను ప్రజలు నిలదీశారు. దీంతో వారు ఖాతాదారులకు నగదు తిరిగి చెల్లిస్తామని లిఖితపూర్వకంగా రాసి ఇవ్వడంతో పరిస్థితి కొంతమేర సద్దుమణిగింది. ఉన్నతాధికారులు సైతం వారి వద్ద నుంచి డబ్బు రికవరీకి మొదట ప్రాధాన్యత ఇచ్చి ఆ తర్వాత చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నట్లు విశ్వసనీయ సమాచారం.

బీపీఎం, ఏబీపీఎంలు కుమ్మక్కై...

మూడేళ్ల క్రితం అనంతరం పోస్టాఫీస్‌లో బీపీఎం నాయక్ కొత్తగా బాధ్యతలు తీసుకున్నారు. అప్పటికే విధుల్లో ఉన్న ఏబీపీఎం, బీపీఎంలు కుమ్మక్కయ్యారు. జనం నెలనెలా కడుతున్న సొమ్ముపై కన్నేశారు. అలా చెల్లిస్తున్న నగదు వారి ఖాతాలకు జమ వేయకుండా బొక్కేయడం ప్రారంభించారు. వీటిలో నెలనెల చెల్లించే సాధారణ నగదుతోపాటు ఫిక్స్‌డ్ డిపాజిట్ల సొమ్ము కూడా ఉంది. అయితే ఖాతాదారులకు ప్రతి నెలా కట్టే సొమ్మును పుస్తకంలో నమోదు చేసి ఇవ్వాలి. అలా వారికి ఇవ్వకుండా పుస్తకాలన్నీ పోస్టాఫీస్‌లోనే ఉంచారు. ఎవరైనా పుస్తకం కావాలని అడిగిన వారికి ఏబీపీఎం రేపిస్తా మాపిస్తానంటూ వాయిదాలు వేసేవాడు. గట్టిగా అడిగిన వారికి వారిచ్చిన నగదు చెల్లించకుండానే చెల్లించినట్లు పుస్తకాల్లో రాసి ఇచ్చారు.

దాదాపు రూ.20 లక్షలు పక్కదారి

అనంతవరం పోస్టాఫీస్‌లో దాదాపు రూ.20 లక్షలు పక్కదారి పట్టినట్లు అంచనా. సుమారు 175 మంది ఖాతాదారులు ప్రతి నెల కడుతున్న నగదును వారి ఖాతాల్లో జమచేయకుండా నొక్కేశారు. ఇందులో సేవింగ్స్ ఖాతాలే కాకుండా ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఉన్నాయి.

గుట్టును బయటకు తీసిన తనిఖీ అధికారి

సాధారణంగా ఏటా ఒకట్రెండు సార్లు పోస్టాఫీస్‌లో లావాదేవీలపై అధికారులు తనిఖీలు చేస్తుంటారు. ఇటీవల పోస్టల్ ఇన్‌స్పెక్టర్ రవిరెడ్డి తనిఖీ సందర్భంగా కొన్ని లొసుగులను కనిపెట్టారు. ఖాతాలకు రెండు మూడేళ్లుగా నెలవారీ నగదు చెల్లించకుండా ఉండడం గమనించారు. దీంతో ఆయన ఒంగోలు పోస్టాఫీస్ నుంచి నేరుగా కొంతమంది ఖాతాదారులకు ఫోన్లు చేసి మీరు నెలనెలా నగదు ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు. వారు నెలనెలా తమ ఖాతాలకు డబ్బులు జమ చేస్తున్నామని బదులిచ్చారు. దీంతో ఖాతాదారులు కూడబలుక్కుని గురువారం పోస్టాఫీస్ వద్దకు వచ్చి బీపీఎం, ఏబీపీఎంలను నిలదీయడంతో ఈ అవినీతి వ్యవహారం బయటపడింది. దీంతో వారిద్దరూ కంగుతిని పక్కదారి పట్టిన ప్రజల సొమ్మును తాము చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ఆ మేరకు గ్రామ పెద్దల సమక్షంలో లిఖితపూర్వకంగా రాసి ఇవ్వడమేగాక ఆ మేరకు ష్యూరిటీగా కొన్ని బ్యాంక్ చెక్కులు కూడా ఇచ్చారు. దీంతో వ్యవహారం కాస్త సద్దుమణిగింది. దీనిపై పోస్టల్ ఉన్నతాధికారులు ఏ మేరకు చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సి ఉంది.

వెలిగొండ, గుండ్లకమ్మ పూర్తికి చర్యలు

• విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి



పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రి గొట్టిపాటి

పెద్ద దోర్నాల, ఆగస్టు 1: జిల్లా అభివృద్ధి కోసం వెలిగొండ, గుండ్లకమ్మ ప్రాజెక్టు నిర్మాణాల పూర్తికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శ్రీశైలంలో నిర్వహించిన జలహారతి కార్యక్రమంలో పాల్గొని తిరిగి ఒంగోలు వెళ్తూ గురువారం పెద్దదోర్నాలలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి రవికుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలంటీర్లు లేకపోయినా సచివాలయ సిబ్బందితో ఒక్క రోజులోనే 99 శాతం పింఛన్లు పంపిణీ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. ఆగస్టు 15వ తేదీ నుంచి అన్న క్యాంటీన్లు ప్రారంభించనున్నట్లు తెలిపారు. గిరిజనగూడేల్లో విద్యుత్ సౌకర్యం కల్పించాలని గిరిజన సంఘం కో-ఆర్డినేటర్ భూమని మంతన్న మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన మంత్రి త్వరలోనే సంబంధిత అధికారులతో చర్చించి చర్యలు చేపట్టనున్నట్లు హామీ ఇచ్చారు. మండల కేంద్రంలోని మసీదు సమీపంలో రహదారి సరిగ్గా లేదని మహిళలు మంత్రికి తెలిపారు. రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ ఎర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకున్న ప్రభుత్వం : ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు కొద్ది రోజులకే అమలు చేసి మాట నిలబెట్టుకున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. శ్రీశైలంలో నిర్వహించిన జలహారతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో గురువారం పాల్గొన్న మంత్రి రామానాయుడు తిరుగు ప్రయాణంలో దోర్నాలలో పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సుప్రీం తీర్పు హర్షణీయం : ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు ధర్మాసనం గురువారం వెలువరించిన తీర్పు హర్షణీయమని టీడీపీ ఎర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. ఈ సందర్భంగా స్థానిక నటరాజ్ కూడలిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంద కృష్ణమాదిగల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.

తాగునీరు, పారిశుధ్య సమస్యలు రాకుండా చూడాలి

• కలెక్టర్ తమీమ్ అన్సారియా



సమ్మర్‌స్టోరేజి ట్యాంకును పరిశీలిస్తున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు(కార్పొరేషన్), ఆగస్టు 1: ఒంగోలు నగరంలో తాగునీరు, పారిశుధ్య సమస్యలు రాకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. గురువారం నగరంలోని పర్యటించిన కలెక్టర్ సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు, గుంటూరురోడ్‌లోని పోతురాజు కాలువను, కొప్పోలులోని మురుగు నీరును మంచినీరుగా మార్చే సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్‌టీపీ) ప్రాజెక్టును కార్పొరేషన్ అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు రోజు అందించే తాగునీటి సరఫరాలో లోపాలు లేకుండా చూడాలన్నారు. లీకులును నియంత్రించి, ప్రతిరోజు నీటి పరీక్షలు చేయాలని ఆదేశించారు. సాగర్ నీరు త్వరితగతిన విడుదల అయ్యేందుకు ఇరిగేషన్ శాఖ అధికారులతో మాట్లాడి సమన్వయం చేసుకోవాలని సూచించారు. పోతురాజు కాలువలో వ్యర్థాలు, ప్లాస్టిక్, ఇతర చెత్తాచెదారం పేరుకుపోడంపై కలెక్టర్ పలు ఆదేశాలు జారీ చేశారు. నగరంలోని ప్రధానమైన పోతురాజుకాలువ నుంచి వెళ్ళే నీరు కొప్పోలులో నిర్మించిన ఎస్‌టీపీ ప్రాజెక్టుకు చేరుతుందని, అక్కడకు చేరిన మురుగునీటిని మంచినీరుగా మార్చి పంటపొలాలకు, వాడుక ఉపయోగించేలా దీనిని నిర్మించినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఇక నగర సుందరీకరణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కమిషనర్ ఎం.జశ్వంత్‌రావు, ఎంఈ జానీబాషా, డీఈ గణపతి, శానిటరీ సూపర్‌వైజర్ ఎన్.పిచ్చయ్య, పలువురు అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి బీచ్ కబడ్డీ పోటీలకు జట్ల ఎంపిక

చినగంజాం, ఆగస్టు 1 : రాష్ట్ర స్థాయి బీచ్ కబడ్డీ పోటీలకు ఉమ్మడి ప్రకాశం జిల్లా స్త్రీ, పురుషుల జట్లను ఎంపిక చేసినట్లు ఉమ్మడి ప్రకాశం జిల్లా కబడ్డీ ఆర్గనైజింగ్ సెక్రటరీ చెరుకూరి పుల్లయ్య తెలిపారు. సోపిరాల గ్రామంలోని లలితా పరమేశ్వరి సమేత రామకోటేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం జిల్లా కబడ్డీ జట్లను ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. గత నెల 14వ తేదీన బీచ్ కబడ్డీ పోటీలకు జిల్లా స్త్రీ, పురుషుల కబడ్డీ జట్లకు ప్రాబబుల్స్‌ను ఎంపిక చేసి, జూలై 15వ తేదీ నుంచి గురువారం వరకు పురుషుల జట్టుకు స్థానిక రామకోటేశ్వరస్వామి దేవస్థాన ప్రాంగణంలో, స్త్రీల జట్టుకు పాకల సముద్ర తీరంలో శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. పురుషుల జట్టులో 7గురుకి శిక్షణ ఇచ్చి, వారిలో ప్రతిభ చూపిన ఆరుగురుని, స్త్రీల జట్టులో శిక్షణ ఇచ్చిన ఆరుగురిని జిల్లా కబడ్డీ జట్టుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. చిల్లర నరసింహారావు జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యులు ఎంపికైన జిల్లా స్త్రీ, పురుషుల కబడ్డీ క్రీడాకారులకు క్రీడా దుస్తులను అందజేసినట్లు తెలిపారు. ఈ నెల 2 నుంచి 4వ తేదీ వరకు నెల్లూరు జిల్లా ఇందుకూరుపేటలో జరిగే రాష్ట్ర స్థాయి బీచ్ కబడ్డీ పోటీలలో ఉమ్మడి ప్రకాశం జిల్లా స్త్రీ, పురుషుల బీచ్ కబడ్డీ జట్లు పాల్గొన్నట్లు పుల్లయ్య తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ కబడ్డీ క్రీడాకారులు కుర్రి శ్రీనివాసరావు, భోగిరెడ్డి స్వామిరెడ్డి, పోలకం వెంకయ్యనాయుడు, ఫిజికల్ డైరెక్టర్ ముంగర సురేష్, రైల్వే గార్డ్ చిల్లర శేషుబాబు, రిటైర్డ్ రైల్వే గార్డ్ పల్లపోలు గోపాలరావు, జనసేన పార్టీ సీనియర్ నాయకులు సందు శ్రీరామ్, కబడ్డీ క్రీడాకారులు పాల్గొన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా బీచ్ కబడ్డీ పురుషుల జట్టుకు వై.రాజశేఖర్‌రెడ్డి(కెప్టెన్), కోట హరిప్రసాద్‌రెడ్డి, గాలి లక్ష్మారెడ్డి, కుక్కల రామాంజనేయులురెడ్డి, బ్రహ్మారెడ్డి, ప్రసాద్‌రెడ్డి ఎంపిక కాగా, కోచ్‌లుగా భోగిరెడ్డి స్వామిరెడ్డి, మేనేజర్ తుమ్మలపెంట పద్మారావు ఉంటారు. స్త్రీల జట్టుకు వాయిల అర్చన (కెప్టెన్), కటారి భూమిక, వాయిల అపర్ణ, కొక్కిలిగడ్డ నందని, కుమారి సౌమ్య, కోడూరి త్రిపుర ఎంపికయ్యారు. వీరికి కోచ్‌లుగా పోలకం రామచంద్రారావు, మేనేజర్ దేవిరెడ్డి శ్రీనివాసరావు వ్యవహరిస్తారు.



ఎంపికైన క్రీడాకారులతో సెలక్టర్లు

అధ్వానంగా రహదారులు

గోతులతో ప్రయాణం నరకప్రాయం

అవస్థలు పడుతున్న ప్రజలు

పట్టించుకోని అధికారులు, నాయకులు

కొనకనమిట్ల, ఆగస్టు 1 : మండలంలోని గనివిన పాడు గ్రామానికి వెళ్ళే రహదారి కంకర లేచిపోయి గోతులు పడింది. దీంతో ఆ రహదారిపై ప్రయాణం చేయాలంటేనే భయ పడుతున్నారు. మార్కాపురం-ఒంగోలు రహదారి నుంచి వాగుమడుగు గ్రామం మీదుగా గనివినపాడు గ్రామం వరకు 11 కిలోమీటర్లు రహదారి ఉంటుంది. అయితే వాగుమడుగు గ్రామం వరకు ఆర్అండ్‌బీ ఆధ్వర్యంలో రహదారి నిర్మించారు. వాగుమడుగు గ్రామం నుంచి గనివినపాడు వరకు పంచాయతీ నిధులతో 4 కిలోమీటర్ల రోడ్డు వేశారు. ఈరోడ్డు నిర్మించి సుమారు 15 సంవత్సరాలు అయింది. వర్షాలకు రోడ్డుపై వేసిన కంకర బయటపడి గోతుల మయంగా మారింది. దీంతో ఆరహదారిలో ప్రయాణం చేయాలంటే ప్రజలు హడలెత్తి పోతున్నారు. అంతే కాకుండా మరసవాగు సమీపంలో గతంలో కురిసిన వర్షాలకు కోతకు గురైంది. దీంతో ఎక్కడ ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. అదేవిధంగా గొట్లగట్టు నుంచి నాయుడిపేట గ్రామానికి వెళ్లే రహదారి కిలోమీటర్ల మేర గోతులతో ప్రయాణికులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే పాతపాడు నంద్యాల- ఒంగోలు రహదారి పాతపాడు గ్రామం నుంచి తువ్వపాడు గ్రామం వరకు సుమారు 11 కిలోమీటర్ల రోడ్డు వర్షాలకు పూర్తిగా గోతుల మయంగా మారింది. దీంతో గరిమిన పెంట, పెరారెడ్డిపల్లి, వెంగళపల్లి, కాట్రగుంట, తువ్వపాడు గ్రామాల వరకు ఉన్న ఈరహదారిపై ప్రయాణం చేయాలంటే ఒళ్ళు హూనం అవుతుందని వాపోతున్నారు. గతప్రభుత్వంలో అధికారులకు, నాయకులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయిందని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి రోడ్డు నిర్మించాలని కోరుతున్నారు.



గోతులతో అధ్వానంగా గనివినపాడు రోడ్డు



మరసవాగు వద్ద కోతకు గురయిన రోడ్డు



పూజల్లో పాల్గొన్న కమిషనర్ సత్యనారాయణ

ఆలయాల్లో దేవదాయశాఖ కమిషనర్ పూజలు

త్రిపురాంతకం, ఆగస్టు 1: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం త్రిపురాంతకేశ్వరస్వామి, బాలాత్రిపుర సుందరీదేవి అమ్మవార్ల ఆలయాల్లో రాష్ట్ర దేవదాయ, ధర్మదాయ శాఖ కమిషనర్, ప్రిన్సిపల్ సెక్రటరీ కె.సత్యనారాయణ గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికిన అనంతరం ఆలయ ప్రదక్షిణలు చేసి స్వామివారికి మహాన్యాసపూర్వక అభిషేకం చేశారు. అనంతరం చినమస్తాదేవికి పూజలు, బాలాత్రిపుర సుందరీదేవి అమ్మవారికి అర్చనలు చేశారు. అర్చకులు సత్యనారాయణకు స్వామి, అమ్మవార్ల శేష వస్త్రాలను, తీర్థ ప్రసాదాలను అందజేసి ఆశీర్వదించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈవో చెన్నకేశవరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు కనీస వసతులు కల్పించాలి

తర్లుపాడు, ఆగస్టు 1: తర్లుపాడులోని ఎస్సీ, బీసీ హాస్టల్‌లో చదువుతున్న విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తానని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తనయుడు కందుల విగ్నేష్‌రెడ్డి అన్నారు. తర్లుపాడులోని ఎస్సీ, బీసీ హాస్టల్ వసతి గృహాలను ఆయన పరిశీలించారు. విద్యార్థులకు తగిన వసతులు ఉన్నాయా లేవా అని వార్డెన్‌లను అడిగి తెలుసుకున్నారు. బీసీ హాస్టల్ అద్దె భవనంలో ఉండటంతో విద్యార్థులు సౌకర్యాలు లేక ఇబ్బందులకు గురవుతున్నామని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. బీసీ హాస్టల్‌కు కొత్త భవనాన్ని నిర్మించేందుకు శాయశక్తుల కృషి చేస్తామన్నారు. వసతి గృహాల్లో విద్యార్థుల విద్యాభివృద్ధికి దాతల సహకారంతో కొన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయులు ఎం.సుధాకర్ బాబు అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలను కల్పించేందుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం తర్లుపాడులోని 1, 2 రేషన్ దుకాణాలను ఆయన ప్రారంభించారు. అనంతరం తర్లుపాడులో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌వో భాస్కర్‌రెడ్డి, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ సావిత్రి

తల్లిపాలే బిడ్డకు శ్రేష్ఠం

మార్కాపురం రూరల్, ఆగస్టు 1: చంటిబిడ్డల ఆరోగ్యానికి తల్లిపాలే శ్రేష్ఠమని ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సావిత్రి అన్నారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బిడ్డలకు తల్లిపాలు ఇవ్వడం వలన వారు దృఢంగా ఆరోగ్యవంతంగా ఉంటారని తెలిపారు. డబ్బాపాలతో భవిష్యత్తులో పిల్లలు అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు. వైద్యశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజమన్నార్ మాట్లాడుతూ తల్లులు తగిన పోషకాహారాన్ని తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, గైనిక్ హెచ్‌వోడీ డాక్టర్ జి.కేశవరావు, ఆర్ఎంవో డాక్టర్ చంద్రరావు, సీఎస్ఎస్ డాక్టర్ సుబ్బారెడ్డి, వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

పుట్టిన బిడ్డకు తల్లిపాలు తాగించాలి

మార్కాపురం వన్‌టౌన్ : పుట్టిన వెంటనే బిడ్డకు తల్లిపాలు తాగించటం సర్వశ్రేష్ఠం అని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ బుజ్జి అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాలలో భాగంగా స్థానిక తూర్పువీధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం బాలింతలకు అవగాహన సదస్సు నిర్వహించారు. పుట్టిన బిడ్డకు తల్లిపాలే మొదటి టీకా అని బుజ్జి అన్నారు. తల్లిపాలు బిడ్డ పుట్టిన వెంటనే తాగించటం వలన బిడ్డ పెరుగుదలకు ఎంతగానో ఉపయోగం అన్నారు. ఏఎన్ఎం రవీనా, శిరీష, అంగన్‌వాడీ కార్యకర్తలు నాగమల్లేశ్వరి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవాలు

పొదిలి : ప్రపంచతల్లిపాల వారోత్సవాలను గురువారం సీడీపీవో సుధామారుతి ప్రారంభించారు. అనంతరం పట్టణంలోని ప్రకాష్‌నగర్, ముదిరాజ్ కాలనీల్లో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బిడ్డ పుట్టిన గంటలోపే తల్లిపాలను అందించాలని సూచించారు. అంతే కాకుండా మొదటి తల్లిపాలు ప్రథమరోగ నిరోధక టీకాగా భావించాలన్నారు. పుట్టిన బిడ్డకు ఆరునెలల వరకు తల్లిపాలనే పట్టించాలన్నారు. అలాగే మహిళ గర్భందాల్చిన దగ్గర నుంచి తీసుకోవలసిన జాగ్రత్తలపై గర్భవతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.



కంభం ప్రభుత్వ పాఠశాలలో ఎన్నికల ప్రకటన నోటీసును అంటిస్తున్న ఎంఈవో మాల్యాద్రి

ఎస్ఎంసీ ఎన్నికలకు నోటిఫికేషన్

కంభం, ఆగస్టు 1 : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలకు సోమవారం నోటిఫికేషన్ జారీ చేశారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు వారి పరిధిలోని పంచాయతీ కార్యాలయాలలో, పాఠశాలల్లో ఎన్నికల ప్రకటన పత్రాలను, ఓటర్ల జాబితాను ప్రదర్శించారు. ఎంఈవో మాల్యాద్రి పలు పాఠశాలలను సందర్శించి ఓటర్ల జాబితాను పరిశీలించారు. ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు, సచివాలయ అధికారులు పాల్గొన్నారు.

త్రిపురాంతకంలో..

త్రిపురాంతకం : మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్ఎంసీ కమిటీల ఏర్పాటుకు ఎన్నికల నోటిఫికేషన్‌ను గురువారం విడుదల చేసినట్లు ఎంఈవో మల్లికార్జునాయక్ తెలిపారు.

సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయం

పొదిలి, ఆగస్టు 1 : ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీంకోర్టులో తీర్పు అనుకూలంగా రావడం శుభపరిణామమని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పందిటి రవి అన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారం కల్పిస్తూ ఆదేశాలు జారీ చేయడం హర్షణీయమన్నారు. ఈసందర్భంగా పొదిలిలో ఎంఆర్‌పీఎస్, ఎంఈఎఫ్, ఎంఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బాప్టిస్టుపాలెం, చిన్నబస్టాండ్, పెద్దబస్టాండ్ మీదుగా భారీ ర్యాలీ నిర్వహించారు. ఏబీఎం కాంపౌండ్ ఆవరణలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంఆర్‌పీఎస్, తదితర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వెలిగొండ, గుండ్లకమ్మ పూర్తికి చర్యలు

పింఛన్ల పంపిణీలో మంత్రి గొట్టిపాటి

పెద్ద దోర్నాల, ఆగస్టు 1: జిల్లా అభివృద్ధి కోసం వెలిగొండ, గుండ్లకమ్మ ప్రాజెక్టు నిర్మాణాల పూర్తికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని రాష్ట్ర విద్యుత్‌శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శ్రీశైలంలో నిర్వహించిన జలహారతి కార్యక్రమంలో పాల్గొని తిరిగి ఒంగోలు వెళ్తూ గురువారం పెద్దదోర్నాలలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి రవికుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలంటీర్లు లేకపోయినా సచివాలయ సిబ్బందితో ఒక్క రోజులోనే 99 శాతం పింఛన్లు పంపిణీ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. ఆగస్టు 15వ తేదీ నుంచి అన్న క్యాంటీన్లు ప్రారంభించనున్నట్లు తెలిపారు. గిరిజన గూడేల్లో విద్యుత్ సౌకర్యం కల్పించాలని గిరిజన సంఘం కో-ఆర్డినేటర్ భూమని మంతన్న మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన మంత్రి గొట్టిపాటి త్వరలోనే సంబంధిత అధికారులతో చర్చించి తగిన చర్యలు చేపట్టనున్నట్లు హామీ ఇచ్చారు. మండల కేంద్రంలోని మసీదు సమీపంలో రహదారి సరిగ్గా లేదని మహిళలు మంత్రికి తెలిపారు. రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఎర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు, మండల నాయకులు షేక్ మాబు, దొడ్డా శేషాద్రి, ఈదర మల్లయ్య పాల్గొన్నారు.



పెద్దదోర్నాలలో పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రి గొట్టిపాటి

మాట నిలబెట్టుకున్న ప్రభుత్వం

ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు కొద్ది రోజులకే అమలు చేసి మాట నిలబెట్టుకున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనని రాష్ట్ర జలవనరులశాఖా మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. శ్రీశైలంలో నిర్వహించిన జలహారతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతో గురువారం పాల్గొన్న మంత్రి రామానాయుడు తిరుగు ప్రయాణంలో దోర్నాలలో పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు, మండల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సుప్రీం తీర్పు హర్షణీయం

ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు ధర్మాసనం గురువారం వెలువరించిన తీర్పు హర్షణీయమని టీడీపీ ఎర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. తీర్పు వెలువరించడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్థానిక నటరాజ్ కూడలిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంద కృష్ణమాదిగల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.

వాడవాడలా పింఛన్ల పంపిణీ



పింఛన్లు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ వెంకటసుబ్బయ్య

గిద్దలూరు టౌన్, ఆగస్టు 1 :పట్టణ, గ్రామాలలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో చేశారు. స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఆదేశాల మేరకు సచివాలయ సిబ్బందితోపాటు టీడీపీ శ్రేణులు పాల్గొని ప్రతి లబ్ధిదారునికి పింఛన్లను అందజేశారు. గిద్దలూరు మున్సిపాలిటీ పరిధిలోని పాముల పల్లె గ్రామంలో మున్సిపల్ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, టీడీపీ నాయకులు పాముల వెంకటరమణయాదవ్, శ్రీనివాసరెడ్డి పంపిణీ చేశారు. సంజీవరాయునిపేటలో జడ్పీటీసీ బుడత మధుసూదన్‌యాదవ్, కొత్తకోట పంచాయతీలో మండల పార్టీ అధ్యక్షులు మార్తాల సుబ్బారెడ్డి, ఉయ్యాలవాడలో టీడీపీ నాయకులు బోదనబోయిన గోపాలకృష్ణ, ముండ్లపాడులో కడియం శేషగిరి, గిద్దలూరు పట్టణంలోని 9వ వార్డు పట్టణ పార్టీ అధ్యక్షులు షానేషావలి, కెఎస్‌పల్లిలో పాలుగుళ్ళ పత్రాపరెడ్డి, 2వ వార్డులో చంద్రశేఖర్‌యాదవ్, 11వ వార్డులో లొక్కు రమేష్, 7వ వార్డులో బిల్లా జయలక్ష్మి, బిల్లా రమేష్, 8వ వార్డులో గడ్డం భాస్కర్‌రెడ్డిలు సచివాలయ సిబ్బందితో కలిసి పింఛన్లు అందజేశారు.



కందులాపురంలో పింఛన్ పంపిణీ చేస్తున్న స్పెషల్ ఆఫీసర్, ఎంపీడీవో

గొట్టిపడియలో పెన్షన్ పంపిణీ

మార్కాపురం రూరల్ : మండలంలోని గొట్టిపడియ గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో ఎంపీడీవో తోట చందన గురువారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో సచివాలయ ఉద్యోగులు పంపిణీ చేస్తున్న పెన్షన్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పంచాయతీ పరిధిలోని అక్కచెరువు తండాలో ప్రభుత్వ గిరిజన పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి వారికి ఉపాధ్యాయులు అందిస్తున్న బోధనా పద్ధతిని తెలుసుకున్నారు. అలాగే గ్రామంలో డ్రాప్ అవుట్లను తగ్గించి బాల్య వివాహాలను అరికట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

96 శాతం పింఛన్ల పంపిణీ

కంభం : కంభం మండలంలో ఎన్‌టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీలో భాగంగా గురువారం 96శాతం పంపిణీ చేసినట్లు ఎంపీడీవో మస్తాన్‌వలి విలేకరులకు తెలిపారు. గురువారం ఉదయం 6గంటల నుంచి అన్ని గ్రామాలలో ఇంటింటికీ తిరిగి పింఛన్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. మండలంలో మొత్తం 6,100 పింఛన్లు ఉండగా 96.54 శాతం పంపిణీ చేసినట్లు తెలిపారు. 10శాతం డెత్ కేసులని, మిగిలిన వారు వేరే గ్రామాలకు వెళ్ళినట్లుతెలిపారు. ఈ పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ సైమన్‌విక్టర్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పింఛన్‌లు అందజేసిన సచివాలయ ఉద్యోగులు

పొదిలి : ఎన్టీఆర్ సామాజిక పింఛన్‌లను సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు సంయుక్తంగా పంపిణీ చేశారు. మండలంలోని అన్ని సచివాలయ ఉద్యోగులతో పింఛన్‌ల కార్యక్రమం దాదాపుగా పూర్తి అయినట్లు కార్యదర్శులు తెలిపారు. పట్టణంలోని 11వ వార్డులో పింఛన్‌ల పంపిణీ సందర్భంగా మాజీ ఎంపీటీసీ సభ్యులు ఇమాంమ్‌సా మాట్లాడుతూ ఎన్నికల ముందు చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మూడువేల పింఛన్‌ను నాలుగువేలకు పెంచి మాట నిలబెట్టుకున్నారన్నారు. ఈకార్యక్రమాల్లో సచివాలయ, కార్యదర్శులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పొదిలిలో వృద్ధులకు పింఛన్ అందజేస్తున్న టీడీపీ నాయకులు, పంచాయతీ కార్యదర్శులు

పాఠ్యపుస్తకాల పంపిణీ

కంభం, ఆగస్టు 1 : ప్రభుత్వం విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను అందిపుచ్చుకుని ఉన్నత శిఖరాలకు చేరాలని కంభం మండలం తురిమెళ్ళ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.సోని తెలిపారు. గురువారం తురిమెళ్ళ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుంచి వస్తున్న విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలని సర్పంచ్ సుభద్రను కోరగా ప్రత్యేక బస్సును ఏర్పాటుచేసే విషయాన్ని ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి దృష్టికి తీసుకెళతానన్నారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్ నారిశెట్టి వీరమ్మ, విశ్రాంత ఎంపీడీవో సంగతాల నాగేశ్వరరావుపాల్గొన్నారు.

ఉపాధి పనుల తనిఖీ

బేస్తవారపేట,ఆగస్టు1:మండలంలో గతంలో చేసిన ఉపాధి పనులను సామాజిక తనిఖీలో భాగంగా బుధవారం బేస్తవారపేటలో సామాజిక తనిఖీ బృందం తనిఖీ చేసింది. కొండ ప్రాంతాల్లో కూలీలు చేసిన పనులు,రైతులు సాగు చేసిన పండ్ల తోటలకు మెటీరియల్ పెమెంట్‌కు సంబంధించిన పనులను తనిఖీ చేశారు.అయితే రైతులు సాగు చేసిన పండ్ల తోటలు అన్నీ సక్రమంగా పెంచుకున్నారని అన్నారు. కూలీలకు మూడు నెలలుగా కూలీ డబ్బులు పడలేదని వారి దృష్టికి తెచ్చినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో టెక్నికల్‌అసిస్టెంట్ అంబటి రమేష్, మేట్ రాజా పాల్గొన్నారు.

ఆసుపత్రి తనిఖీ

గిద్దలూరు, ఆగస్టు 1: పట్టణంలోని నంద్యాల రోడ్డు జగనన్న కాలనీలో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్‌ను బీజేపీ నాయకులు సందర్శించారు. ఆసుపత్రి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో ప్రత్యేకంగా బోరు ఏర్పాటు, చుట్టూ ప్రహరీగోడ నిర్మాణం చేయించాలని వైద్యులను కోరారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు రామాంజనేయులు, ఎస్సీమోర్చ ప్రధాన కార్యదర్శి ఎం.పుల్లయ్య, రూరల్, మండలశాఖ అధ్యక్షులు కె.తిరుపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై హర్షం

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 1: ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్‌ల వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును హర్షిస్తూ ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నాయకులు గురువారం సంబరాలు నిర్వహించారు. స్థానిక పాత బస్టాండ్‌లో కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో ఎంఈఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జీవరత్నం, జాతీయ నాయకులు పందీటి కాశీరావు మాదిగ, ఎంఈఎఫ్ నాయకులు సంజీవయ్య ఆదామ్, ఎమ్మార్పీఎస్ నాయకులు కిషోర్, టీడీపీ నాయకులు రాజు, అబ్రహం, జాకబ్, పాపయ్య, మాదిగ జర్నలిస్టు ఫోరం సభ్యుడు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

స్కీం వర్కర్లపై వేధింపులు మానాలి

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 1: స్కీం వర్కర్లపై వేధింపులు మానాలని ఏపీ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్పన అన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కార్మికులపై రాజకీయ వేధింపులకు స్వస్తి పలకుంటే ఉద్యమాలను ఉధృతం చేస్తామన్నారు.సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బాలనాగయ్య పాల్గొన్నారు.

నర్సరీల తనిఖీ

గిద్దలూరు, ఆగస్టు 1 : మండలంలోని బురుజుపల్లి పరిసరాలలో ఉన్న పలు నర్సరీలను ఉద్యాన శాఖాధికారిణి విష్ణుప్రియ తనిఖీ చేశారు. నర్సరీ యజమానులు తప్పనిసరిగా లైసెన్సు పొందాలని సూచించారు. చీడపురుగులు, తెగుళ్ల యాజమాన్యం చేసి నాణ్యమైన మొక్కలను మాత్రమే రైతులకు అందించాలని సూచించారు. లైసెన్సు కోసం దరఖాస్తు చేసుకున్న నర్సరీలలో పెంచుతున్న నారు మొక్కల నాణ్యతను పరిశీలించారు. మొక్కలు అమ్మినపుడు రైతులకు బిల్లులు ఇవ్వాలని సూచించారు.

నాయకుల చిత్రపటాలు సిద్ధం



చిత్రపటాలను చూపుతున్న జనసేన నాయకులు

గిద్దలూరు, ఆగస్టు 1 :రాచర్ల మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో నాయకుల ఫొటోలు ఏర్పాటు చేసేందుకు వీలుగా జనసేన నాయకులు వారి చిత్రపటాలను సిద్ధం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కె.పవన్‌కళ్యాణ్, ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి చిత్రపటాలను సిద్ధం చేశామని, ప్రతి ప్రభుత్వ కార్యాలయానికి వెళ్ళి వాటిని అందజేస్తామని ఆ పార్టీ నాయకులు నాయుడు వెంకటేశ్వర్లు, టి.వెంకటేశ్వర్లు, జనార్దన్ తదితరులు పేర్కొన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ



ఎరువుల దుకాణాన్ని పరిశీలిస్తున్న ఏవో

పెద్ద దోర్నాల, ఆగస్టు 1: మండల కేంద్రంలోని పలు ఎరువుల దుకాణాలను వ్యవసాయాధికారి జవహర్‌లాల్ నాయక్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులు లేకుండా ఎరువులు, మందులు విక్రయించరాదన్నారు. రైతులకు విధిగా రసీదులు ఇవ్వాలన్నారు. బోర్డులపై ఎప్పటికప్పుడు స్టాక్ వివరాలు, ధరలు తెలియజేయాలన్నారు. నియమాలను పాటించకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని దుకాణదారులను హెచ్చరించారు.

చెర్లోపల్లి వాసికి గౌరవ డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న సత్యనారాయణ

త్రిపురాంతకం, ఆగస్టు 1: మండలంలోని టి.చెర్లోపల్లి గ్రామానికి చెందిన పరిటాల సత్యనారాయణ హైదరాబాద్‌లోని అమెరికా హోప్ థియలాజికల్ యూనివర్శిటీ ఆధ్వర్యంలో గౌరవ డాక్టరేట్‌ను అందుకున్నారు. కొవిడ్ సమయం నుంచి ఇప్పటి వరకూ అనేక మంది నిరాశ్రయులకు, పేదలకు వైద్య సహాయంతో పాటు సామాజిక సేవలు అందించినందుకుగాను గౌరవ డాక్టరేట్ లభించినట్లు సత్యనారాయణ తెలిపారు. హైదరాబాద్‌లోని త్యాగరాయ గాన సభలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యూనివర్శిటీ చైర్మన్, డిప్యూటీ డైరెక్టర్ జ్యోతి చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నట్లు తెలిపారు.

ఆరునెలలు సెలవు కోసం సర్పంచ్ వినతి



ఎంపీడీవో చందనకు వినతిపత్రాన్ని అందిస్తున్న సర్పంచ్ శ్రీరాములు

మార్కాపురం రూరల్, ఆగస్టు 1: అనారోగ్యం కారణంగా ఆరు నెలలు సెలవు మంజూరు చేయాలని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో చందనకు గురువారం కె.కొత్తపల్లి సర్పంచ్ ఇమ్మడి శ్రీరాములు వినతిపత్రాన్ని అందజేశారు. దీనిపై ఎంపీడీవో మాట్లాడుతూ వినతిపత్రాని జిల్లా పంచాయతీ అధికారికి అనుమతి కోసం పంపించనున్నట్లు పేర్కొన్నారు.

మధ్యాహ్న భోజనం ప్రారంభం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు, ఉపాధ్యాయులు

పొదిలి, ఆగస్టు 1: పట్టణంలోని జడ్పీ ఉన్నతపాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ప్రధానోపాధ్యాయురాలు, టీడీపీ నాయకులు సంయుక్తంగా ప్రారంభించారు. అనంతరం టీడీపీ నాయకులు రసూల్ మాట్లాడుతూ విద్యార్థులు ఆకలితో ఉండకుండా ఉండేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు మంచి పౌష్టికాహారం ఏర్పాటు చేశారన్నారు. కనుక పాఠశాలలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్యార్థినీ విద్యార్థులకు మంచి నాణ్యమైన ఆహారం అందించాలని ప్రధానోపాధ్యాయురాలిని కోరారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లబ్ధిదారులందరికీ బియ్యం పంపిణీ చేయాలి



రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్న టీడీపీ మండలాధ్యక్షుడు జవాజి, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు

మార్కాపురం రూరల్, ఆగస్టు 1: రేషన్ కార్డు లబ్ధిదారులందరికీ ప్రభుత్వం అందిస్తున్న ఉచిత బియ్యాన్ని తప్పనిసరిగా పంపిణీ చేయాలని షాపు నిర్వాహకులు కోరారు. మండలంలోని దరిమడుగు గ్రామంలో రేషన్ బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని టీడీపీ మండలాధ్యక్షుడు జవ్వాజి రామానుజులరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు గ్రామ టీడీపీ నాయకులతో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్క లబ్ధిదారునికి రేషన్ బియ్యం సకాలంలో ఎటువంటి అవకతవకలు లేకుండా పంపిణీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోడౌన్ డీటీ శేఖర్, దరిమడుగు గ్రామ టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మెనూ సక్రమంగా అమలు చేయాలి



మెనూ పరిశీలిస్తున్న ఎరిక్షన్‌బాబు

పెద్ద దోర్నాల, ఆగస్టు 1: విద్యార్థులకు మెనూ సక్రమంగా అమలు చేయాలని టీడీపీ ఎర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. స్థానిక కస్తూర్బా గురుకుల బాలికల పాఠశాలలో గురువారం ఎరిక్షన్ బాబు తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని వసతులు, మెనూ పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు షేక్ బాబు, దొడ్డా శేషాద్రి, ఈదర మల్లయ్య, దేసు నాగేంద్ర, చంటి, కె.సుబ్బారెడ్డి, షేక్ మంజూర్ బాష, రాజేంద్ర, ఇస్మాయిల్‌బాష తదితరులు పాల్గొన్నారు.

రెండు వాహనాలు ఢీ- ఒకరు మృతి



మృతిచెందిన ఆటో డ్రైవర్ మాలకొండయ్య

బేస్తవారపేట,ఆగస్టు1: అనంతపురం-అమరావతి జాతీయ రహదారిపై గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. మాచర్ల నుంచి అనంతపురంకు పత్తి విత్తనాల లోడ్‌తో వస్తున్న బొలెరో వాహనం బేస్తవారపేట మండలం చిన్న ఓబినేనిపల్లె గ్రామం నుంచి కంభంకు వెళ్తున్న ఆటో ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రెండు వాహనాలు బోల్తా పడ్డాయి. ఆటో డ్రైవర్ నుంజల మాలకొండయ్య(40) అక్కడికక్కడే మృతి చెందాడు.మాలకొండయ్య తనకు పండిన కూరగాయాలు తన ఆటోలో వేసుకొని రోజూ కంభం మార్కెట్‌కు వెళ్ళి అక్కడ విక్రయిస్తుంటాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సన్మానం

గిద్దలూరు, ఆగస్టు 1 : ఎమర్జెన్సీ కాలంలో జైలుకు వెళ్ళిన బీజేపీ నాయకుడు రెడ్డి మల్లారెడ్డిని పలు సంఘాల ప్రతినిధులు సన్మానించారు. ఈకార్యక్రమంలో ఆపార్టీ జిల్లా ఉపాధ్యక్షులు రామాంజనేయులు, చిన్ని సేవాసంస్థ అధ్యక్షులు శ్రీకాంత్, వాకర్స్‌క్లబ్ మాజీ అధ్యక్షులు రామచంద్రుడు, మహాత్మాగాంధీ క్లబ్ ప్రతినిధి సత్యం, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి

దొనకొండ, ఆగస్టు 1: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని టీడీపీ జిల్లా లీగల్‌సెల్ మాజీ అధ్యక్షుడు పరిటాల సురేష్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని రుద్రసముద్రం ప్రభుత్వ పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణంలో ఉష్ణోగ్రతలు తగ్గదల ఉండాలంటే మొక్కలు నాటి వాటిని బాధ్యతగా సంరక్షించాలన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో వివిధ రకాల మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఆంజనేయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి సహకారం అభినందనీయం

దొనకొండ, ఆగస్టు 1: ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదువుకుంటున్న విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ అందిస్తూ వారి విద్యాభివృద్ధికి టీడీపీ ప్రభుత్వం అందిస్తున్న సహకారం అభినందనీయమని దొనకొండ జూనియర్ కళాశాల ఛైర్మన్ మాడిశెట్టి ప్రకాష్ పేర్కొన్నారు. గురువారం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.దునుమని మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల తరువాత ఇంటర్ చదివే విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ అందించేలా చర్యలు చేపట్టిన విద్యాశాఖ మంత్రివర్యులకు ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థులకు త్వరలో బ్యాగులు కూడా అందజేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వెలిగండ్లలో 98 శాతం పింఛన్ల పంపిణీ

వెలిగండ్ల, ఆగస్టు 1: వెలిగండ్ల మండలంలో గురువారం చేపట్టిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌ల పంపిణీ మెదటి రోజు 98 శాతం పూర్తయింది. మండలంలో లబ్ధిదారులు 4626 మంది ఉన్నారు. శుక్రవారం మిగిలిన లబ్ధిదారులకు పంపిణీ చేస్తామని ఎంపీడీవో రామచంద్రరావు తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి మెగళ్నూరు పంచాయతీలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులతో మాట్లాడారు.

పీసీపల్లిలో 94.55శాతం.. పీసీపల్లి, ఆగస్టు 1: పీసీపల్లి మండలంలో గురువారం చేపట్టిన ఎన్టీఆర్ భరోసా పింఛన్‌ల పంపిణీ సాయంత్రం ఐదుగంటల సమయానికి 94.55శాతం పూర్తయింది. మండలంలో పింఛన్‌ల లబ్ధిదారులు 4808మంది ఉండగా సాయంత్ర వరకు 4564 మంది లబ్ధిదారులకు పంపిణీ చేసినట్టు ఎంపీడీవో సుబ్బారావు తెలిపారు.

దొనకొండలో 97శాతం.. దొనకొండ, ఆగస్టు 1: మండలంలో గురువారం 97శాతం పింఛన్లు పంపిణీ పూర్తి చేసినట్లు ఎంపీడీవో వసంతరావునాయక్ తెలిపారు. మొత్తం 5695 పింఛన్లకు గాను 5500 మందికి అందజేసినట్లు తెలిపారు. అన్నీ గ్రామాల్లో టీడీపీ నాయకులు పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని వారివంతు సహకారం అందించారు.

ముండ్లమూరులో 97 శాతం.. ముండ్లమూరు, ఆగస్టు 1: మండలంలోని శంకరాపురంలో గురువారం ఎంపీడీవో ఆర్.జనార్ధన్, టీడీపీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు పింఛన్‌లు పంపిణీ చేశారు. మండలంలో 7,181 మందికి పింఛన్‌లు పంపిణీ చేయాల్సి ఉండగా సాయంత్రం మూడు గంటల కల్లా 97 శాతం పంపిణీ చేసినట్టు ఎంపీడీవో తెలిపారు. మండల ప్రత్యేకాధికారి ఎస్‌వీ రమణ మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న పింఛన్‌ల పంపిణీ తీరును పరిశీలించారు. ఆయా గ్రామాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు పింఛన్‌ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పాడిరైతులకు ప్రభుత్వం చేయూత



పాడి రైతులకు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్న డీడీ యోగేంద్రప్రసాద్, వెటర్నరీ వైద్యులు

కనిగిరి, ఆగస్టు 1: పాడి రైతులకు ప్రభుత్వం సంక్షేమ పథకాల ద్వారా ఎంతో చేయూత అందిస్తుందని మార్కాపురం పశుసంవర్ధకశాఖ డీడీ యోగేంద్ర ప్రసాద్ అన్నారు. మండలంలోని పాతపాడు గ్రామంలో గురువారం మండల వెటర్నరీ అధికారి డాక్టర్ బాలకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఉచిత పశువైద్య శిబిరంలో పాడి రైతులకు ఉచితంగా మినరల్ మిక్సర్, పశువులకు మందులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడిరైతులు సకాలంలో పశువులకు వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కాలానుగుణంగా పశువులకు టీకాలు వేయించాలని సూచించారు. డాక్టర్ బాలకృష్ణ పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స అందచేశారు. కార్యక్రమంలో కనిగిరి ఏడీఏ శ్రీనివాసరెడ్డి, డాక్టర్ రమేష్, గోపాలమిత్రలు, సిబ్బంది రేష్మాబేగం, డాక్టర్ బాషా, వెంకటేశ్వరరెడ్డి, వాసు, వెంకటేశ్, శివ, హబీబ్, షఫీ, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానానికి రూ.లక్ష విరాళం

పామూరు, ఆగస్టు 1: స్థానిక పాత పోస్టాఫీసు ఎదురుగల శ్రీషిరిడి సాయిబాబా మందిరంలో ప్రతి గురువారం జరుగుతున్న అన్న ప్రసాద కార్యక్రమానికి ఒంగోలుకు చెందిన భక్తులు లక్ష రూపాయల నగదును అందజేసినట్లు దేవస్థాన కమిటీ అధ్యక్షుడు పబ్బతి వెంకటసుబ్బయ్య తెలిపారు. దాతలు బాపనపల్లి శ్రీనివాసులు - సుగుణకుమారి, శ్రీహరి -పాప దంపతులు ప్రకటించిన విరాళ నగదును తిరుపతయ్య అందజేసి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ పూజారి చంద్రకాంత్ దివేది, బాబాభక్త సమాజ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్లు తొలగింపు

పామూరు, ఆగస్టు 1: మండలంలోని వగ్గంపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని కొండారెడ్డి గ్రామానికి వచ్చే హెచ్‌టీ లైన్ తీగలకు చిల్లచెట్లు తగిలి విద్యుత్ సరఫరా నిలిచిపోతున్నది. దాంతో అసౌకర్యానికి గురవుతున్న గ్రామస్థులు సంబంధిత విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన సంబంధిత శాఖ అధికారుల ఆదేశాల మేరకు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు పార వెంకటేశ్వర్లు యంత్రాల ద్వారా తీగలకు అడ్డుగా ఉన్న చెట్లను తొలగింపు కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో లైన్‌మన్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

టీ షాపులో అగ్నిప్రమాదం

సీఎస్‌పురం(పామూరు), ఆగస్టు 1: సీఎస్‌పురం పట్టణంలోని పడమటి బజారులో పోలిశెట్టి సూర్య నారాయణ టీ షాపులో గురువారం తెల్లవారు జామున గ్యాస్ లీకయి మంటలు అంటుకున్నాయి. ప్రమాదంలో షాపులోని వస్తువులన్నీ అగ్నికి ఆహుతి అయి లక్ష రూపాయాలు ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు. సమాయానికి స్థానికులు స్పందించి మంటలను ఆర్పేయడంతో పక్క షాపులకు వ్యాపించలేదు.

65 కింటాళ్ల వరి విత్తనాలు మంజూరు

పామూరు, ఆగస్టు 1: మండలంలోని 19 ఆర్బీకే పరిధిలో 65 కింటాళ్ల బీపీటీ వరి విత్తనాలు మంజూరైనట్లు వ్యవసాయాధికారిణి కె.రాధ తెలిపారు. కందులు ఎల్ఆర్‌జీ రకం 30 శాతం రాయితీపై రైతులకు అందజేసినట్టు తెలిపారు. సన్‌ఫ్లవర్ మినీకిట్లను ఉచితంగా అందజేస్తున్నట్టు ఆమె తెలిపారు.

పాఠశాలకు టేబుళ్లు, ఫ్యాన్లు బహూకరణ

పీసీపల్లి, ఆగస్టు 1: మండలంలోని దివాకరపురం ప్రభుత్వ పాఠశాలకు ఉపాధ్యాయురాలు శ్రీవేణి ఐదువేల విలువచేసే టేబుళ్లు ప్రధానోపాధ్యాయురాలుకు అందజేశారు. అలాగే, పెదవరిమడుగు గ్రామానికి చెందిన పోతుకూరి శ్రీనివాసులు ఐదువేల రూపాయల విలువగల సీలింగ్ ఫ్యాన్‌లను పాఠశాలకు అందజేశారు. పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన సౌర్యాలకల్పనకు సహకరించిన ఉపాధ్యాయురాలు శ్రీవేణి, మరోదాత శ్రీనివాసులును ప్రధానోపాధ్యాయురాలు అరుణ, గ్రామస్థులు అభినందించారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేష్టం

కనిగిరి, ఆగస్టు 1: అంగన్‌వాడీ కేంద్రాలు భావితరాల విద్యార్థులకు పునాదులుగా నిలవాలని ఐసీడీఎస్ సీడీపీవో సరోజిని అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా నియోజకవర్గంలోని కనిగిరి, వెలిగండ్ల మండలాల్లో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి బిడ్డకు తల్లిపాలే అమృతంతో సమానమన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న పౌష్టికాహారాన్ని అందిపుచ్చుకుని తమపిల్లల భావిజీవితం ఆరోగ్యంగా, ఉజ్వలంగా ఉండేలా చూడాలన్నారు. ఈనెల 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈసందర్భంగా ప్రతి గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది తల్లిపాల ఆవశ్యకతను ప్రజలకు వివరించాలన్నారు. చిన్ననాటి నుంచే చిన్నారులకు విద్యపై మక్కువ పెంచే విధంగా విద్య అందించటం జరుగుందనే విషయాన్ని తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో వెలిగండ్ల ఎంఈవో దేవిరెడ్డి రామిరెడ్డి, సూపర్‌వైజర్‌లు కమలకుమారి, దేవకృపావరం, ఐసీడీఎస్ సిబ్బంది గంధం శ్యామ్యూల్, గుడ్‌హెల్ప్ ప్రవీణ్, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

» ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

పీసీపల్లి, ఆగస్టు 1: పేదల సంక్షేమమే టీడీపీ కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. మండలంలోని రామాపురం గ్రామంలో గురువారం జరిగిన ఎన్టీఆర్ సామాజిక పింఛన్‌ల పంపిణీలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మూడువేల పింఛన్‌ను రూ.నాలుగు వేలకు పెంచి ఇచ్చిన ఏకైక ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో వెయ్యి పింఛన్ పెంచేందుకు ఐదేళ్ళు పట్టిందని విమర్శించారు. అన్నివర్గాల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి మరువలేనిదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు సూపర్ సిక్స్ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు అందించడం జరుగు తుందని చెప్పారు. త్వరలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్టు చెప్పారు.

కార్యక్రమంలో ముక్కు జయసింహారెడ్డి, ఎంపీడీవో వెంకట సుబ్బారావు, మండల పార్టీ అధ్యక్షుడు రామయ్య, పెద్దన్న, వెంకట్, సర్పంచ్ సాంసన్, నాగేశ్వరరావు, లక్ష్మీనారాయణ, జోసఫ్, శ్రీరాములు, జనసేన నాయకులు రాజు, మాచర్ల, నానిబాబు, సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకున్న చంద్రబాబు

పామూరు, ఆగస్టు 1: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను చంద్రబాబు నిలబెట్టుకున్నారని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. గురువారం ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సీఎస్‌పురంలో గురువారం జరిగిన కార్యక్రమంలో టీడీపీ శ్రేణులతో కలిసి పాల్గొన్నారు. ఎన్నికల్లో చంద్రబాబు చెప్పిన మాట ప్రకారం పింఛన్లను పెంచి 1వ తేదీనే లబ్ధిదారులకు ఇంటివద్దనే పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు.



కనిగిరి: పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

పామూరు మండలంలో జరిగిన పింఛన్‌ల పంపిణీ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు. స్థానిక సీఎస్‌పురం రోడ్డులో జరిగిన కార్యక్రమాన్ని ఎంపీడీవో పి.పుట్టారెడ్డి పరిశీలించారు. కాగా, పట్టణంలో, మండలంలో జరిగిన కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని పింఛన్లు అందజేశారు.

వృద్ధులకు మేలు చేకూర్చిన బాబు

కనిగిరి, ఆగస్టు 1: వృద్ధులు తమ కుటుంబాలకు భారం కారదనే సదుద్దేశంతో సీఎం చంద్రబాబు రూ.3 వేల నుంచి రూ.4వేలకు పింఛన్ పెంచి వారికి మేలు చేకూర్చారని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహా రెడ్డి అన్నారు. గురువారం పట్టణ సమీపంలోని శంఖవరం గ్రామంలో జరిగిన పింఛన్‌ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ టీడీపీ మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వం అని సీఎం చంద్రబాబు మరోసారి రుజువు చేశారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రంగారావు, మేనేజర్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అవ్వా తాతల కళ్లల్లో ఆనందం చూస్తున్నాం

దర్శి, ఆగస్టు 1: టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతినెలా ఒకటో తేదీనే పింఛన్లు అందజేస్తూ అవ్వా, తాతలు, దివ్యాంగుల కళ్లల్లో ఆనందం చూస్తున్నామని మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు అన్నారు. గురువారం దర్శి పట్టణంలో జరిగిన పింఛన్‌ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని వృద్ధులకు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పండుగ వాతావరణంలో పింఛన్లు పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. గత వైసీపీ పాలకులు ఏరోజు సక్రమంగా పింఛన్ అందించలేదన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ల ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి నెలలో పెంచిన పింఛన్లు బకాయిలతో ఏకకాలంలో అందించినట్టు చెప్పారు. ఈ నెలలో కూడా ఉద్యోగుల ద్వారా లబ్ధిదారుల ఇళ్ల కు వెళ్లి ఒకటో తేదీనే అందరికీ పింఛన్లు పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో నగర పంచాయతీ ఛైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, వైస్‌ఛైర్మన్ జి.స్టీవెన్, నగర పంచాయతీ కమిషనర్ వై.మహేశ్వరరావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు యాదగిరి వాసు, పులల్లచెరువు చిన్నా నక్కా రంగా, మారెళ్ళ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. గ్రామాల్లో జరిగిన పింఛన్ల పంపిణీలో టీడీపీ నాయకులు పాల్గొని తమవంతు సహకారం అందించారు.



పింఛన్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే పాపారావు, తదితరులు

కాగా, దర్శి మండలంలో 98 శాతం పింఛన్లు పంపిణీ పూర్తి చేశారు. దర్శి పట్టణంలో 3200 మంది పింఛన్‌దారులు, రూరల్ మండలంలో 6404 పింఛన్‌దారులు ఉన్నారు. ఉదయం 6గంటల నుంచి పంపిణీ చేపట్టి సాయంత్రానికి 98శాతం పూర్తి చేసినట్టు ఎంపీడీవో హనుమంతరావు, నగర పంచాయతీ కమిషనర్ వై.మహేశ్వరరావు తెలిపారు.

వైసీపీతో అంటకాగిన అధికారుల బదిలీలు

» కొత్తవారు నియామకానికి శ్రీకారం



నూతన డీఎస్పీగా నియమితులైన లక్ష్మీనారాయణ

దర్శి, ఆగస్టు 1: దర్శి నియోజకవర్గంలో ఇప్పటి వరకు వైసీపీతో అంటకాగిన అధికారులను బదిలీల ద్వారా సాగనంపుతున్నారు. ఇప్పటికే పలుశాఖల అధికారులకు బదిలీల ఉత్తర్వులు అందాయి. వారి స్థానంలో నూతన అధికారుల నియామకాలు జరుగుతున్నాయి. అందులో భాగంగా దర్శి నూతన డీఎస్పీగా కర్నూల్ సీఐడీ విభాగంలో పనిచేస్తున్న బి.లక్ష్మీనారాయణను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే.

అలాగే, ముండ్లమూరు ఎస్సైను నియమించారు. గత ఎన్నికల్లో ఇక్కడ పనిచేసిన పోలీసులు డివిజనల్ అధికారితో పాటు అన్నీ మండలాల్లో అధికారులు వైసీపీ కార్యకర్తల్లా వ్యవహరించారు. నాయకులకు తొత్తులుగా వ్యవహరిస్తూ టీడీపీ క్యాడర్‌ను ఇబ్బంది పెట్టారు. వైసీపీ నాయకులు టీడీపీ కార్యకర్తలపై దాడులు చేసినా పట్టించుకోలేదు. కొన్నిచోట్ల బాధితులైన టీడీపీ కార్యకర్తలపైనే ఎదురు కేసులు పెట్టారు.

ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలో రావటతో వైసీపీలో అంటకాగిన అధికారుల భరతం పట్టాలని టీడీపీ నాయకులు వారు చేసిన అక్రమాలను ఉన్నతాధికాలకు వివరించారు. దీంతో వైసీపీతో అంటకాగిన అధికారుల ప్రక్షాళనలో భాగంగా డీఎస్పీ అశోక్‌వర్ధన్‌రెడ్డిపై వేటు పడింది. ఆయనకు పోస్టింగ్ కూడా ఇవ్వకుండా హెడ్ క్వాటర్‌లో రిపోర్టు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అలాగే, అన్నీ మండలాల్లో తహసీల్దార్లు బదిలీలపై వెళ్లారు. కొద్దిరోజుల్లో నూతన తహసీల్దార్లు నియమితులయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. దర్శి తహసీల్దార్‌గా గతంలో ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ మళ్లీ నియమితులయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆయన సమర్థవంతమైన అధికారిగా గుర్తింపు ఉన్నా, వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నాయకులు చెప్పిన తప్పుడు పనులు చేయలేదనే ఉద్దేశంతో బదిలీ చేయించారు. ఆయనకు జిల్లాలో మంచి అధికారిగా గుర్తింపు ఉండటంతో మళ్లీ దర్శి తహసీల్దార్‌గా నియమించేందుకు సన్నాహాలు జరుగుతున్నట్టు తెలిసింది. దర్శి సీఐతోపాటు మిగిలిన మండలాల్లోని ఎస్సైలు కొద్దిరోజుల్లో బదిలీపై వెళ్లే సూచనలు కనిపిస్తున్నాయి. వారిస్థానంలో కొత్త వారు నియమితలైన తర్వాత కూటమి ప్రభుత్వం మార్పు పాలన అమల్లోకి వచ్చే అవకాశం కనిపిస్తుంది.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం

» టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి



డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దర్శి, ఆగస్టు 1: ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి పేర్కొన్నారు. ఈమేరకు గురువారం ఆమె ఓ ప్రకటన విడుదలచేశారు. మాదిగల చిరకాల వాంఛ నెరవేరటం ఆనందంగా ఉందన్నారు. గత 30 సంవత్సరాలుగా వారు చేసిన పోరాట ఫలిత ఫలాలు త్వరలో అందుకుంటారన్నారు. సీఎం చంద్రబాబు ఎస్సీ వర్గీకరణకు చిత్తశుద్ధితో కృషి చేశారన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ కూడా ఈ విషయాన్ని బాహాటంగా తెలిపి టీడీపీ చిత్తశుద్ధితో వ్యవహరించిందని తెలపటం ఆనందంగా ఉందన్నారు. మాజీ సీఎం జగన్ మాదిగలను ఓటు బ్యాంకుగా వాడుకున్నారే తప్పా వారికి న్యాయం చేసేందుకు ఏనాడు ప్రయత్నించలేదన్నారు. ఎస్సీల మధ్య చిచ్చుపెట్టి లబ్ధిపొందే కుటిల రాజకీయం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈవిషయాన్ని తెలుసుకున్న ఎస్సీలు గత ఎన్నికల్లో వైసీపీకి తగిన గుణపాఠం చెప్పారని అన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా పండుగ వాతావరణంలో పింఛన్ల పంపిణీ జరుగుతుందని గొట్టిపాటి లక్ష్మి తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం పెంచిన పింఛన్లు 1వ తేదీన క్రమం తప్పకుండా అందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వంకే దక్కిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం పింఛన్ రూ.వెయ్యి పెంచటానికి ఐదు సంవత్సరాల పట్టిందని ఎద్దేవా చేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లు ఇచ్చిన మాట మేరకు ఒకేసారి రూ.వెయ్యి పెంచి 1వ తేదిన అందరికీ అందించటంతో అవ్వా, తాతల కళ్లల్లో ఆనందం వ్యక్తమవుతుందన్నారు.

చంద్రబాబు, మోదీకి రుణపడి ఉంటాం

కనిగిరి, ఆగస్టు 1: ఎస్సీ వర్గీకరణ చేయటంలో సంపూర్ణ సహకారం అందించిన సీఎం చంద్రబాబు, ప్రధాని మోదీకి మాదిగలు ఎప్పుడూ రుణపడి ఉంటారని పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బుల్లాబాలబాబు అన్నారు. పట్టణంలోని పాతూరులోని మాదిగపాలెంలో గురువారం సంబరాలు చేసుకున్నారు. ఈసందర్భంగా బాలబాబు మాట్లాడుతూ వర్గీకరణతో మాదిగలు సామాజికంగా, రాజకీయంగా, ఉద్యోగపరంగా అభివృద్ధి చెందుతారన్నారు. కార్యక్రమంలో రాచపూడి సుధీర్‌కుమార్, సర్దబాబు, గంటా సురేష్, మానిపోగు లీలాబాబు, వంగేపురం జాన్, గంటా రూబెన్, ఆలూరి రోమా, ఆలూరి, యలమంద, తదితరులు పాల్గొన్నారు.

సుప్రీం తీర్పుపై హర్షం

తాళ్లూరు, ఆగస్టు 1: ఎస్సీ వర్గీకరణ న్యాయసమ్మతమని సుప్రీం తీర్పు ఇవ్వటంపై ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి అనపర్తి ఆదామ్ మాదిగ హర్షం వ్యక్తం చేశారు. తాళ్లూరు ఎస్సీ కాలనీలోని జగ్జీవన్‌రామ్, అంబేడ్కర్ విగ్రహాలకు గురువారం పాలభిషేకం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు మద్దతుపలికిన పీఎం నరేంద్రమోదీకి, సీఎం చంద్రబాబు నాయుడు అభినందనలు తెలిపారు. ఎమ్మార్పీఎస్ శ్రేణులు బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో అనపర్తి ప్రకాశరావు, శీమోన్, సుబ్బారావునాగేశ్వరరావు, వెస్లీ, పి.రవికుమార్, బాలకోటయ్య, తదితరులు పాల్గొన్నారు.

దొనకొండలో ఎమ్మార్పీఎస్ ర్యాలీ

దొనకొండ, ఆగస్టు 1: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తూ సర్పంచ్ కొంగలేటి గ్రేస్‌రత్నకుమారి, దేవానంద్, ఎమ్మార్పీఎస్ మండల మాజీ అధ్యక్షుడు ఉప్పలపాటి కిరణ్‌ప్రసాద్‌మాదిగ నేతృత్వంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అధికసంఖ్యలో ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ముండ్లమూరులో సంబరాలు

ముండ్లమూరు, ఆగస్టు 1: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తూ సుప్రీంకోర్టు తీర్పుపై జడ్పీటీసీ తాతపూడి రత్నరాజు, దళిత సంఘాల నాయకులు గురువారం ముండ్లమూరులో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. దళిత సంఘాల నాయకులు పాలెపోగు డగ్లస్‌తో పాటు వివిధ గ్రామాల దళిత నాయకులు పాల్గొన్నారు.

వర్గీకరణపై తీర్పు హర్షణీయం

పామూరు, ఆగస్టు 1: ఎస్సీ వర్గీకరణను సమర్థిస్తూ సుప్రీంకోర్టు తీర్పుపై ఎమ్మార్పీఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ గురువారం సంబరాలు జరుపుకొన్నారు. స్థానిక మమ్మిడాడి సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో రాచూరి ఏలియా, పిప్రభాకర్, శేషం మోషే, ఏలీయాజర్, రవి హనోక్, సాల్మన్, ఆరోన్, పేతూరు, బెంజిమన్, రాజురమేష్, జైరావు, యేసు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలైన దిగుబడులు



పంటలను పరిశీలిస్తున్న శ్రీనివాసరావు

పీసీపల్లి, ఆగస్టు 1: ప్రకృతి వ్యవసాయంతో మేలైన దిగుబడులు సాధించవచ్చునని జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని వెపగంపల్లి గ్రామంలో గడ్డం బాలసుబ్బయ్య అనే రైతు సాగుచేస్తున్న ప్రకృతి వ్యవసాయాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా రైతులతో ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో ఏడీఏ వెంకటరమణ, ఎంపీడీవో సుబ్బారావు, ఏఈవోలు పుల్లయ్య, గోపికృష్ణ, వీఏఏలు మనోహర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



అక్రమంగా మట్టి తరలిస్తుండగా పట్టుబడిన టిప్పర్లు, ఎక్స్‌కవేటర్

అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్లు పట్టివేత

దర్శి ఆగస్టు 1: మండలంలో అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు. ప్రధానంగా వైసీపీ నాయకులు గతంలో నిరంతరం అక్రమ మట్టి వ్యాపారంలో కాసులు పండించుకున్నారు. నేటికీ కొంతమంది ఆ వ్యాపారాన్ని మానుకోలేకపోతున్నారు. తాజాగా మండలంలోని రాజంపల్లి చెరువులో ఓ వైసీపీ నాయకుడు టిప్పరు, ఎక్స్‌కవేటర్‌తో మట్టి తరలిస్తుండగా రెవెన్యూ అధికారులు బుధవారం రాత్రి పట్టుకున్నారు. రాజంపల్లి చెరువులోని మట్టిని అక్రమంగా తరలిస్తున్న విషయాన్ని గ్రామస్థులు అధికారులకు ఫిర్యాదే చేశారు. ఈక్రమంలో రెవెన్యూ, పోలీసు అధికారులు హుటాహుటీన అక్కడకు వెళ్లి అక్రమ మట్టి రవాణాను అడ్డుకున్నారు. మట్టి ఎత్తుతున్న ఎక్స్‌కవేటర్‌ను, మూడు టిప్పర్లను పట్టుకొని దర్శికి తరలించినట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఏవీ రవిశంకర్ తెలిపారు. ఎక్కడైనా మట్టి అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు



కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

కురిచేడు, ఆగస్టు 1: లయన్స్ క్లబ్ ఆఫ్ కురిచేడు ఆధ్వర్యంలో గురువారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పేద మహిళలకు కుట్టు మిషన్లు, పదో తరగతిలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు, మూడు పాఠశాలలకు అవసరమైన వస్తువులు అందజేశారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమానికి అధ్యక్షుడు వీవీ రమణారావు అధ్యక్షత వహించగా, ఆర్సీ రామాంజనేయులు, జోన్ ఛైర్మన్ జేబీ రామారావు మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు చేయడంలో తృప్తి ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సీతారామయ్య, ఎంఈవో వస్రాం నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికే పెద్దపీట

తాళ్లూరు, ఆగస్టు 1: ప్రజా సంక్షేమానికే కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేస్తూ ముందుకు సాగుతున్నదని టీడీపీ మండల అధ్యక్షుడు బి.ఓబుల్‌రెడ్డి, ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు అన్నారు. గురువారం ఎన్టీఆర్ భరోస పింఛన్ల పంపిణీ కార్యక్రమం మండలంలోని అన్ని గ్రామాల్లో పండుగ వాతావరణంలా జరిగింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మాట నిలబెట్టుకున్న సీఎం చంద్రబాబును పెద్దన్నగా, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను చిన్నన్నగా ప్రజలు భావిస్తూ ఆనందం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మేడగం వెంకటేశ్వరరెడ్డి, శాగం కొండారెడ్డి, మానం రమేష్‌బాబు వల్లభనేని సుబ్బయ్య, పిన్నిక రమేష్ బాబులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల కమిటీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

సీఎస్‌పురం(పామూరు), ఆగస్టు 1: సీఎస్‌పురం మండలంలో పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలకు అన్నిఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఎంఈవోలు జె.ప్రసాదరావు, ఆర్.కొండారెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని అన్ని పాఠశాలల హెచ్‌ఎంలతో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికల్లో అలసత్వం, నిర్లక్ష్యం తగదన్నారు. ఎన్నికల ప్రక్రియలో లోపాలు జరిగితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మండలంలోని విద్యార్థులకు నూరు శాతం స్టూడెంట్ల కిట్లు పంపిణీ చేసినట్టు చెప్పారు. సమావేశంలో ఎమ్మార్సీలు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

చినకొత్తపల్లిలో పింఛన్‌ను అందజేసిన సచివాలయ సిబ్బంది

తాళ్లూరు, ఆగస్టు 1: అనారోగ్యంతో అద్దంకి మండలం చిన్నకొత్తపల్లిలో ఉంటున్న పింఛన్ లబ్ధిదారురాలు నన్నూరి అంజమ్మకు తెలుగుయువత రాష్ట్ర కార్యదర్శి గొల్లపూడి వేణుబాబు,సచివాలయం సిబ్బంది గురువారం అందజేశారు. మండలంలోని కొత్రపాటివారిపాలెం గ్రామానికి చెందిన నన్నూరి అంజమ్మ అనారోగ్యంతో కుమార్తు వద్ద ఉంటున్నారు. ఈక్రమంలో చిన్నకొత్తపల్లి వెళ్లి ఆమెకు పింఛన్ అందజేశారు.

పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ

దొనకొండ, ఆగస్టు 1: టీడీపీ మండల నాయకుడు వీరపనేని వెంకన్నచౌదరి పుట్టినరోజును పురస్కరించుకొని ఆపార్టీ నాయకులు గురువారం పేదలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయం వద్ద కేకు కట్ చేసి ప్రజలకు కేకు, స్వీట్లు పంపిణీ చేశారు. నిరుపేద కుటుంబాలకు చెందిన పలువురికి 25 కేజీల బియ్యం బస్తా, కంది పప్పు, సోలాపూర్ దుప్పట్లు పంపిణీ చేశారు.

కార్యక్రమంలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ రాచగొర్ల వెంకటయ్య, కామేపల్లి చెంచయ్య, తాండ్ర వెంకటేశ్వర్లు, షేక్ సుభానీ, దుగ్గెంపూడి కోటేశ్వరరావు, వల్లపునేని ఆదినారాయణ, విప్పర్ల శేషు, సింగమనేని హనుమంతు, ఫణిదపు వీరాంజనేయులు, వైకే చౌదరి, బత్తుల గాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
శుక్రవారం 2 ఆగస్టు 2024





మున్నంగి నుంచి ఐదు కిలోమీటర్ల మేర కరకట్టపై ఇసుక కోసం బారులు తీరిన లారీలు

ఇసుక సీరియల్.. చీటీ రూ. 2500

డబ్బు, మద్యం సీసా ఇస్తారా! అయితే మీకు వెంటనే ఇసుక లోడ్ అయిపోతుంది. ఇవేమీ ఇచ్చుకోలేమంటారా!... మూడు నుంచి నాలుగు రోజులు కరకట్టపై పడిగాపులు పడాల్సిందే. ప్రభుత్వం ఇస్తున్నది ఉచిత ఇసుకే కదా! ఇట్టే లోడ్ చేయించుకుని ఇంటికి పట్టుకెళ్లిపోవచ్చని లారీ తీసుకుని వెళితే మీకు చుక్కలు కనిపించాల్సిందే. దళారులు, సిబ్బంది కుమ్మక్కయి ఉచిత ఇసుక నుంచి తైలం పిండేస్తున్నారు. ఇసుక రీచ్‌లన్నీ లేకపోవటం, ఇసుక గుట్టలకే అనుమతి ఇవ్వటంతో, అవి ఉన్న నాలుగైదు చోట్ల దళారులు, సిబ్బంది కలసి వినియోగదారులను నిలువునా దోచేస్తున్నారు. ప్రభుత్వం నిర్మాణదారులకు ఇసుకను ఉచితంగా ఇద్దామని ప్రతిష్ఠాత్మక నిర్ణయం తీసుకుని, కేవలం లోడింగ్ ఖర్చులు మాత్రమే చెల్లించి ఇసుక తీసుకువెళ్లొచ్చని ప్రకటిస్తే, చివరకు ఇసుక కొన్నంత రేటుకు రెట్టింపు వసూళ్లతో వినియోగదారుడికి 'ఉచిత' ఇసుక గుప్పెడు కూడా దొరకనివ్వటంలేదు. ప్రభుత్వం చెప్పిన పద్ధతి ప్రకారం ఇసుక కోసం వెళ్లి ఒక లారీ ఇసుక తెచ్చుకోవాలంటే కనీసం మూడు నుంచి ఐదు రోజులు కరకట్టపై పడిగాపులు పడాల్సిన దయనీయ పరిస్థితి.

- ఇసుక సీరియల్ నంబర్లు నల్లబజార్‌లో
- లోడింగ్ దగ్గర దళారులు, సిబ్బందిదే రాజ్యం
- డబ్బు, మద్యానికి సీరియల్ చీటీల అమ్మకం
- అధికారులు, విలేకరులకు వాటాలివ్వాలట...
- అధికార పార్టీ నాయకుల పేరు చెప్పి సిబ్బందే బరితెగింపు
- ఒక్కో చీటీ రూ. 1500 నుంచి రూ. 2,500
- డబ్బిస్తే వెంటనే లోడింగ్... మందు బాటిలిస్తే అదే రోజు ఇంకో లోడ్
- లేకుంటే నాలుగు రోజులకో లోడ్
- మున్నంగిలో బరితెగింపు...

తెనాలి, ఆగస్టు 1, (ఆంధ్రజ్యోతి): ఒక లారీ ఇసుక కావాలంటే ప్రభుత్వం రూ. 2,500 చెల్లించాలని కూలి రేటు నిర్ణయిస్తే, అంతే మొత్తం సిబ్బందికి సమర్పించుకుంటే కానీ ఇసుక లోడ్ కాని పరిస్థితి. ట్రాక్టర్‌కు మినహా 6 చక్రాల లారీకి సీరియల్ నంబర్ వెంటనే కావాలంటే రూ. 1500, పది చక్రాల లారీకి సీరియల్ స్లిప్ కావాలంటే రూ. 2,500 చెల్లించాల్సిందే. లేకుంటే లారీ లోపలికి దిగదు. కొల్లిపర మండలం మున్నంగిలో ఇదేతరహా బరితెగింపు రాజ్యమేలుతోంది. అదేమని అడిగితే పాత సీరియల్ ఇంకా కాలేదంటూ వరుసలో ఉన్న లారీలను వరుసలోనే నిలబెట్టి వారికి డబ్బిచ్చిన లారీలను ఒక్క గంటకూడా నిలవనివ్వకుండా ఒక్క రోజులోనే ఒకటి నుంచి మూడు లోడుల ఇసుక ఇప్పించేస్తున్న పరిస్థితి. గురువారం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కొల్లిపర మండలం వస్తుండటంతో ఎక్కడ ఇసుక రీచ్‌కు వస్తారో! ఏ తనిఖీలు చేసి ఎక్కడ చర్యలకు దిగుతారోనన్న భయంతో మధ్యాహ్నం 12 గంటలలోపే 90 లారీలకు లోడ్ చేసి పంపేయటం విశేషం. ఆదివారం నుంచి ఇసుక కోసం పడిగాపులు కాస్తున్నవారికి ఉపశమనం లభించిందంటే, కచ్చితంగా ఇసుక సీరియల్ నంబర్ల ప్రకారం రోజూ లోపలికి అనుమతిస్తే రోజుల తరబడి లారీలు నిలిచి ఉండాల్సిన పని ఉండదు. లోపల ఏం జరుగుతుందనేది బహిరంగ రహస్యమే అయినా, లోపం మాత్రం సరిచేసేవారు కరువయ్యారు. దీంతో ప్రభుత్వం ఉచితంగా వినియోగదారునికి ఇసుక ఇద్దామన్నా మధ్య దళారులు దానిని ఆచరణలో అమలు కానివ్వకుండా అప్రతిష్ఠతెచ్చే ప్రయత్నాలు బహిరంగంగానే చేస్తున్నారు.

ప్రభుత్వ నిర్ణయం ఘనం... ఆచరణే ఆమ్యామ్యాల మయం

ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం అమలు చేస్తున్నట్టు ఆదేశాలిచ్చాక ముందుగా గత ప్రభుత్వ కాలంలో అక్రమంగా ఒడ్డున నిల్వ ఉంచిన భారీ ఇసుక గుట్టలను ఇచ్చేందుకు అనుమతులిచ్చారు. ప్రకాశం బ్యారేజి దిగువున మున్నంగి, కొల్లిపరలోనే అవకాశం ఉంటే, ఎగువున మాత్రం లింగాయపాలెం, తాళ్లాయపాలెం, వైకుంఠపురం దగ్గర ఇసుక గుట్టలకు అనుమతి ఇచ్చారు. దీనికోసం రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, ఎంపీడీఓ, సచివాలయ సిబ్బందిని ఒక్కో చోట 20 మందికిపైగా సిబ్బందిని ఏర్పాటుచేసి మరీ వినియోగదారునికి అసౌకర్యం కలగకుండా ఇచ్చేందుకు ప్రభుత్వం పగడ్బందీ ఏర్పాట్లే చేసింది. ఇసుక లోడ్ కూడా గత ప్రభుత్వ కాలంలో ఓవర్ లోడ్‌లా కాకుండా, ట్రాక్టర్‌కు 5 టన్నులు, ఆరు చక్రాల లారీలకు 10 టన్నులు, పది చక్రాల లారీలకు 20 టన్నుల ఇసుక లోడ్‌కు అనుమతినిచ్చారు. అయితే ఒక్కో రీచ్ దగ్గర లారీలు బారులు తీరితే ఏ రోజుకారోజు నిలిపి ఉన్న లారీల దగ్గరకే అధికారులు వెళ్లి సీరియల్ నంబర్ వేసి ఇవ్వటం, దాని ప్రకారమే లోనికి అనుమతించి, లోడింగ్ ఛార్జీల చెల్లింపులు చేయించటం ఒక క్రమ పద్ధతిలోనే జరిగిపోయాయి. అయితే వీటిలో రీచ్‌లున్న ప్రాంతాల్లో స్థానిక నేతలకు ఒత్తిడులు రావటంతో కొన్ని లారీలకు సీరియల్‌తో పనిలేకుండా ప్రయారిటీ పేరుతో ఎప్పుడు లారీ వచ్చినా వరుసలో ఆగకుండా నేరుగా లోడింగ్‌కు వెళ్లేలా సిఫార్సులు చేయించారు. ఈ అవకాశం వచ్చిందోలేదో వెంటనే దళారులు పుట్టుకొచ్చేశారు. వారు సిబ్బందితో కుమ్మక్కయిపోయి నాయకుల పేర్లు చెప్పి చీటీల అమ్మకానికి బరితెగించేశారు. నేతలు చెప్పిన లారీలు పదుల సంఖ్యలో ఉంటే, వీరు మాత్రం వందల సంఖ్యలో అక్రమ పద్ధతిలో లారీలకు అదనపు వసూళ్లుచేసి మరీ ఇసుక ఇప్పించేస్తున్నారు.

నేతలు.. అధికారులు.. విలేకరులకు వాటాలని చెప్పి..

సీరియల్ తప్పించి వారికిష్టమొచ్చిన లారీలకు ఒకటికి మించి ఇసుక లోడ్‌కు అవకాశం కల్పిస్తూ ఒక్కో ట్రిప్‌కు రూ. 2,500 వసూలు చేస్తున్నారు. అంటే ఒకలారీ ఆ రోజులో మూడు ట్రిప్‌లు వేసిందనుకుంటే ఆ లారీనుంచే రూ. 7,500 వసూలు చేస్తున్నట్టు. ఇట్లా రోజుకు 60 నుంచి 80 లారీల వరకు అవకాశం ఇస్తున్నారు. అంటే ఎంత భారీ మొత్తంలో దళారులు, సిబ్బంది కలసి చేతివాటం చూపించి నేతల పేర్లు ఉపయోగించుకుని దోచేస్తున్నారనేది అర్థమవుతుంది. పోనీ లోడింగ్ పెద్దగా కావటంలేదా! అంటే అదీలేదు. రోజుకు 200 నుంచి 280 వరకు లారీలకు లోడ్ చేసేస్తున్నారు. మున్నంగి-వల్లభాపురం మధ్య అటు, ఇటు ఐదు నుంచి ఆరు కిలోమీటర్లమేర లారీలు కరకట్టకు ఇరువైపులా ఆగిపోయి ఉంటున్నాయి. దీనికి తోడు కట్టకు అంచున నిలువుగా నిలపకుండా సీరియల్ తప్పించేసి ఎప్పుడు కావాలంటే అప్పుడు గుట్టల దగ్గరకు వెళ్లే లారీలు ముందుభాగం కరకట్టపైకి ఉండేలా పెడుతుండటంతో కరకట్ట సగంపైగా ఆక్రమించేస్తున్నాయి. ఇదే పరిస్థితి రెండు పక్కల ఉండటంతో రేపల్లె-విజయవాడ బస్సు వెళ్లటానికి, చివరకు కార్లు వెళ్లటానికి కూడా గంటకొద్దీ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. అయితే బిల్లుల దగ్గర ఇద్దరు, ముగ్గురు పోలీస్ సిబ్బంది ఉంటున్నా వారిలో ఒకరిద్దరు పోలీసులు మాత్రం దొంగ స్లిప్‌లు ఎవరు తీసుకుంటున్నారో చూసుకుని, వారిదగ్గర నుంచి వాటాలు రాబట్టుకునే పనికే ప్రాధాన్యం ఇస్తున్నారనే విమర్శ ఉంది. వీరు కనీసం లారీలు అడ్డదిడ్డంగా పెడుతున్నా వాటిని వారించకుండా, క్రమ పద్ధతిలో పెట్టించకుండా వదిలేస్తుండటంతో సమస్య మరింత జటిలమవుతోంది. నేరుగా లారీలు తీసుకవెళ్లిన వినియోదగారులే అదంతా చూడలేక అదేమని ప్రశ్నిస్తే ఈ మొత్తం వాటాలు మాకొక్కరికే కాదని, ఒక్కో స్లిప్‌కు వచ్చిన డబ్బు నేతలకు, మాపై అధికారులకు, చివరకు విలేకరులకు కూడా ఇవ్వాల్సిందేనని, మొత్తం మేము తినటంలేదని బహిరంగంగానే చెప్పటం వీరి బరితెగింపునకు నిదర్శనం.

సీరియల్ చీటీలు... డబ్బు, మద్యానికి అమ్మకం

ఒక ట్రాక్టర్ ఇసుకకు మున్నంగి వంటి రీచ్‌లలో టన్నుకు రూ. 250 చొప్పున ప్రభుత్వం నిర్ణయించిన కూలి రేట్ల ప్రకారం రూ. 1250 చెల్లించాలి. 6 చక్రాల లారీలకు రూ. 2,500 చెల్లించాలి. 10 చక్రాల లారీలకు రూ. 5వేలు చెల్లించాల్సి ఉంటుంది. ఈ రేట్ల ప్రకారం వినియోగదారుడు చెల్లిస్తే ఇసుక తీసుకువెళ్లొచ్చు. అయితే ఇక్కడ దీనిప్రకారం జరగటంలేదు. ఇక్కడ దళారులదే ఇష్టారాజ్యం. సిబ్బందికీ వాటాలు అందుతుండటంతో వారు చెప్పినవారికి స్లిప్‌లు ఇచ్చేస్తున్నారు. ఇసుక అనుమతిచ్చిన మొదట్లో ఆగిన లారీల దగ్గరకే సిబ్బంది వెళ్లి సీరియల్ నంబర్‌తోపాటు బిల్‌కూడా ఇచ్చేసేవారు. ఆ సీరియల్ ప్రకారం లారీలను పోలీసులు లోపలకు అనుమతిస్తే, లోపలకు వెళ్లాక ఆన్‌లైన్ విధానంలో డబ్బు చెల్లించాల్సి ఉంటుంది. ఆ డబ్బు కట్టేశాక లోడింగ్ దగ్గర ఇసుక లారీలకు నింపుతారు. అయితే ఇసుక కొరత, డిమాండ్ ఎక్కువ కావటంతో దళారులు, సిబ్బంది కుమ్మక్కయి ఇసుక స్లిప్‌లను అమ్మేస్తున్నారు. లారీల దగ్గరకు వెళ్లకుండా ముందుగానే దళారులకు ఒక్కొక్కరికి పది నుంచి 20 స్లిప్‌లు సీరియల్ నంబర్ వేసి ఇచ్చేయటం పరిపాటిగా మారిపోయింది. మరో విశేషమేమంటే ఆ సీరియల్ నంబర్ లున్న స్లిప్ తీసుకునేవారికి అసలు లారీకూడా వెంట ఉండకపోవటమే. ఒక్కమాటలో చెప్పాలంటే వీరికి ఇసుకే అవసరం ఉండదు. కేవలం నల్లబజార్‌లో స్లిప్‌లను అమ్మేందుకు వారు సిద్ధమవుతున్నారు.

ఉచితంగా అందాల్సిన ఇసుకకు..

ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం తీసుకొస్తే, నామమాత్రపు కూలి రేట్లు మినహా రీచ్ దగ్గర పెద్దగా ఖర్చు పెట్టాల్సిన పనిలేదు. కానీ ఇక్కడ జరుగుతున్న లోపాలతో ఉచితం మాట అటుంచితే, అసలు చెల్లించాల్సిన ఛార్జీలకంటే మూడు నుంచి ఐదు రెట్లు అదనంగా చెల్లించుకోవలసిన దయనీయ పరిస్థితి. ఉదాహరణకు తెనాలికి చెందిన ఒకరు, నారాకోడూరు, సంగంజాగర్లమూడికి చెందిన మరో ఇద్దరు మూడు లారీలు తీసుకుని ఇసుక కోసం ఆదివారం మున్నంగి రీచ్‌కు వెళితే, వారికి 74,78,79 సీరియల్ నంబర్లిచ్చారు. ఆ రోజు లోడ్ కాకపోవటంతో సోమవారం తమ సీరియల్ వచ్చిందేమోనని చూసుకుంటే ఇంకా 22వ సీరియల్ నడుస్తున్నట్టు చూపించారు. వారికి అనుమానం వచ్చి సోమవారం మొత్తం లోడయిన వాహనాలను లెక్కిస్తే లారీలు, ట్రాక్టర్లు మొత్తం 256 ఉన్నట్టు తేలింది. అయితే తర్వాత రోజు కూడా తమ సీరియల్ కాకపోవటం, మూడో రోజు ఏకంగా 112 నంబర్ కనిపించటంతో అదేమని అడిగితే మీకన్నా ముందు ఇచ్చిన సీరియల్ ఇంకా కాలేదని సిబ్బంది బుకాయించటం కొసమెరుపు. నాలుగు రోజులు గడిచినా వారి లారీలకు సీరియల్ మాత్రం అందలేదు. దీంతో రోజుకు డ్రైవర్‌కు రూ. వెయ్యి చొప్పున ఒక్కో లారీకి రూ. 4వేలు చెల్లించుకున్నారు. గురువారం ఎట్టకేలకు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి మనోహర్ పర్యటన పుణ్యమా అని వారికి ఐదో రోజు లోడ్ లభించింది. లోడ్ కోసం రూ.5వేలు చెల్లిస్తే, డ్రైవర్ ఖర్చులు, కొనుగోలు కలిపి లారీకి రూ. 9 వేల ఖర్చు. ఇదికాక రవాణా ఛార్జీలు కూడా కలిపితే వారి ఇంటికి లారీ ఇసుక చేరటానికి రూ. 12వేలపైనే ఖర్చయింది. అంటే గతంలో ఇసుక కొనుగోలు సమయంలో చేసినంత ఖర్చే ఇప్పుడు చెయ్యాల్సిన పరిస్థితి. పోనీ ఇవన్నీ కాకుండా నల్ల బజార్‌లోనే చీటీలు కొనుక్కుని ఇసుక తీసుకువెళ్లినా లారీ ఇసుక రూ. 5వేలు, సీరియల్ చీటీ ఖరీదు రూ. 2,500, రవాణా ఛార్జీలు కలిపి రూ.10,500పైనే వినియోగదారునికి పడుతోంది. ఇంత భారం పడటానికి కారణం ఏమంటే లోపమంతా దళారులు, సిబ్బంది దగ్గరే. దీనిని పర్యవేక్షించాల్సిన అధికారులుకూడా పట్టించుకోకపోవటం, ఎవరైనా ప్రశ్నిస్తే, నేతల పేరుచెప్పి వారి సిఫార్సుల వల్ల తప్పటంలేదని సిబ్బంది తప్పించుకుంటున్న పరిస్థితులూ ఉన్నాయి.

మంత్రి మనోహర్ వస్తున్నారని..

వారం నుంచి ఇసుక లోడ్ కాకుండా ఉన్న లారీలు, కిలోమీటర్ల పొడవున నిలిచిన లారీలకు గురువారం మధ్యాహ్నం లోపే ఇసుక లోడింగ్ జరిగిపోయింది. ఎవరినీ బ్రతిమాలకుండా, సీరియల్ కోసం బారులుతీరి నిలబడాల్సిన పనిలేకుండా అంతా మాయ జరిగినట్టు జరిగిపోయింది. రోజులతరబడి నిరీక్షించినవారికి ఏం జరుగుతుందో! సిబ్బందిలో ఇంత చిత్తశుద్ధి ఎందుకు వచ్చిందో చాలా సేపు అర్థంకాలేదు. తీరా ఏంటాఅని ఆరాతీస్తే రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పెన్షన్ల పంపిణీ కోసం కొల్లిపర మండలంలో పర్యటించనుండటమేనని తెలిసి ఇసుక వినియోగదారులు సంతోషపడిపోయారు. గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం 12 గంటలలోపే 90 లారీలకు లోడింగ్ అయిపోయిందంటే, అదికూడా సీరియల్ ప్రకారం జరిగిందంటే ఆశ్చర్యమే. అంటే అంతా సక్రమంగా జరిగితే ఒక్క లారీ కూడా ఒక పూటకు మించి నిరీక్షించాల్సిన పనిలేదన్నమాట. మనోహర్ గతంలో కొల్లిపర ఇసుక గుట్టల దగ్గర ఆకస్మిక తనిఖీలు చేసి లోపాలపై అధికారులపై మండిపడటం, మరోసారి జరిగితే ఉపేక్షించమని, చర్యలు తప్పవని హెచ్చరించిన విషయం తెలిసిందే. అయితే గురువారం కూడా ఆయన కొల్లిపర వచ్చిన సందర్భంలో ఆకస్మికంగా తనిఖీ చేస్తారేమోనని సిబ్బందే బిల్లుల పాకల దగ్గర కూర్చోకుండా లారీల దగ్గరకే వచ్చి సీరియల్ నంబర్ ఇవ్వటం, ఇచ్చిన లారీల ఫోటోలు బిల్లింగ్ సిబ్బందికి పెట్టటం వంటివి చేసేశారు. అటు పోలీసులు కూడా అన్నీ సక్రమమైన పద్ధతిలో తీసుకొచ్చారు. అంటే లోపం లోడింగ్‌లో కాదని, సిబ్బంది, దళారుల పాత్రపైనే ఆధారపడిఉందనేది దీనిద్వారా అర్థమవుతున్న విషయమే. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ దళారుల దోపిడీకి అడ్డుకట్ట వేస్తారో! లేదో చూడాలి.



సీరియల్ నంబర్ వేసి, బిల్ ఇచ్చే క్యాబిన్ వద్ద ఒకవైపు వరుసలో బిల్‌కోసం బారులు తీరితే, మరో కిటికీ దగ్గర దళారులిచ్చిన స్లిప్‌లకు బిల్లులు తీసుకునేందుకు గుమికూడిన చిత్రం

మున్నంగిలోనే ఎందుకు కట్టడి కావటం లేదో! నేతలకే ఎరుక. గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని లారీలే కాకుండా ఇక్కడికి కృష్ణా జిల్లా లారీలు భారీగానే వచ్చి చేరుతున్నాయి. కృష్ణా జిల్లాలో కీసర దగ్గర ఇసుక ఉన్నా, వారికి మున్నంగి దగ్గర కావటంతో వచ్చేస్తున్నారు. దీంతో స్థానికంగా ఉండే లారీలకు 50 మందికి స్లిప్‌లు ఇస్తుంటే, అటు కృష్ణా జిల్లా లారీలకూ మరో 50 ఇస్తున్నారు. దీంతో రద్దీ కూడా పెరిగిపోతోంది. గతంలో సబ్‌కలెక్టర్ ప్రఖర్ జైన్ రీచ్ దగ్గర పరిశీలించినప్పుడు స్థానిక లారీల యజమానులు కృష్ణా జిల్లా లారీల విషయం చెప్పటంతో వాటిని ప్రోత్సహించవద్దని ఆదేశాలిచ్చారు కూడా. అయితే అటు నుంచి వచ్చిన లారీలు స్థానిక లారీల కంటే మరో రూ.500 అదనంగా ఇస్తుండటంతో దళారులు, సిబ్బంది వారి కి అవకాశం ఇస్తున్నారు. పైగా వారు కృష్ణా జిల్లా నుంచి కాకుండా గుంటూరు జిల్లా నుంచే వచ్చామని చెప్పించిమరీ ఇసుక తీసుకెళుతున్నారు. దీంతో రద్దీ మరింత పెరిగిపోతోంది.

ఇదే పరిస్థితి గతంలో వైకుంఠపురం రీచ్ దగ్గర ఉంటే దానిని చాలావరకు సరిచేశారు. తాజాగా పెదకూరపాడు ఎమ్మెల్యేనే రంగంలోకి దిగి, ఇసుక విషయంలో ఎవరైనా దళారులు ఉంటే అరెస్ట్ చేయాలని పోలీసులను ఆదేశించిన పరిస్థితి ఉంది. దీంతో చాలావరకు ఇక్కడ రచ్చ సర్దుమణిగింది. అటు లింగాయపాలెంలోనూ వైసీపీ పాత నేతలు, ఎంపీ అనుచరులు మొదటి పది రోజుల్లో అడ్డదారుల్లో ఇసుక తరలించే ప్రయ త్నం చేసినా, ప్రస్తుతం అక్కడ కూడా అంతా పగడ్బందీగానే సాగుతోందనేది లారీల యజమానులు, నిర్మాణదారుల మాట.



మంత్రి మనోహర్ వస్తుండటంతో బండిపైనే కూర్చుని సీరియల్ నంబర్, బిల్లులు ఇస్తున్న చిత్రం



కరకట్టపై అడ్డదిడ్డంగా పెట్టిన నేతలు, అధికారుల సిఫార్సులున్న వారి లారీలు



నదిలో కనుచూపు మేరలో ఇసుక లేకుండా తవ్వేసినా, గాలు మార్గంలో బారులను తలపిస్తున్న ట్రాక్టర్లు

పింఛన్ల పండుగ

- ఉదయాన్నే ప్రారంభమైన పింఛన్ల అందజేత
- తొలి రోజే 99 శాతం పంపిణీ
- కర్లపాలెం మండలంలో పింఛన్ అందించిన కలెక్టర్
- ఉత్సాహంగా పంపిణీలో పాల్గొన్న టీడీపీ నేతలు



కూచిపూడిలో పెన్షన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు



కర్లపాలెంలో వృద్ధురాలికి పెన్షన్‌లు అందజేస్తున్న కలెక్టర్ కె.వెంకటమురళి



చీరాలలో పింఛన్ అందిస్తున్న ఎమ్మెల్యే ఎంఎం.కొండయ్య



పెన్షన్ పంపిణి చేస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): వృద్ధులకు ఇక్కట్లు లేవు...బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు అంతకన్నా లేవు.. మొదటి తారీఖు రాగానే తెల్లవారకముందే సచివాలయ ఉద్యోగులు వృద్ధులకు ఇంటి దగ్గరే పింఛన్ అందించే కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. జిల్లా యంత్రాంగంతో పాటు ఎమ్మెల్యేలు, స్థానిక టీడీపీ నేతలు పింఛన్ల పంపిణీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. పొద్దున్నే ప్రారంభమైన పంపిణీ రాత్రి సమయానికి 99 శాతం పూర్తవడంతో పింఛన్ లబ్ధిదారుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. కర్లపాలెం పంచాయతీ పరిధిలోని ఇందిరానగర్‌లో ఉదయం 6 గంటలకే పింఛన్ పంపిణీలో పాల్గొన్న కలెక్టర్ వెంకటమురళి లబ్ధిదారులకు పింఛన్ అందించారు. అప్పికట్ల గ్రామంతో పాటు బాపట్ల మున్సిపాలిటీ పరిధిలోని రైలుపేటలో జరిగిన పింఛన్ల పంపిణీలో జాయింట్ కలెక్టర్ బి. సుబ్బారావు పాల్గొన్నారు. పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యేలు వేగేశన నరేంద్రవర్మ, నక్కా ఆనంద్‌బాబు, ఎంఎం. కొండయ్య పాల్గొన్నారు. అద్దంకి, పర్చూరు నియోజక వర్గాల పరిధిలో స్థానిక టీడీపీ నేతలతో పాటు అధికారుల సారథ్యంలో పింఛన్ల పంపిణీ జరిగింది

తొలిరోజే 99 శాతం

పింఛన్ల ప్రారంభమైన గురువారమే 99 శాతం పూర్తయినట్లు అధికారులు తెలిపారు. 477 సచివాలయాల పరిధిలో 2,32,045 మంది లబ్ధిదారులకు గాను రూ.96.57 కోట్లను పింఛన్ల రూపంలో లబ్ధిదారులకు ప్రభుత్వం అందించింది. ఇంటింటి పింఛన్ల పంపిణీ విషయంలో పూర్తి సన్నద్ధతను ప్రభుత్వం రెండు రోజుల ముందు నుంచే చేపట్టడంతో గురువారం ఉదయం నుంచే సచివాలయ సిబ్బందితో పాటు మండల స్థాయి అధికారులంతా క్షేత్రస్థాయిలో పింఛన్ల పంపిణీలో పాల్గొనడంతో కార్యక్రమం సాఫీగా జరిగిపోయింది. ఏ ఒక్క లబ్ధిదారుడు తనకు పింఛన్ అంద లేదనే ఫిర్యాదు రావడానికి వీల్లేదని ప్రభుత్వం స్పష్టంగా చెప్పడంతో యంత్రాంగం మరింత అప్రమత్తంగా ఉండి పంపిణీని ఒక్కరోజులోనే 99శాతం పూర్తి చేసింది

కుటుంబంలో ఒకరిలాగా..

పింఛన్ల పంపిణీలో పాల్గొన్న అధికారులుకానీ, ప్రజాప్రతినిధులు కానీ లబ్దిదారుల కుటుంబంలో ఒకరిలాగా వృద్ధులను ఆప్యాయంగా పలకరించి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కర్లపాలెం పంచాయతీ పరిధిలో పింఛన్ల పంపిణీలో పాల్గొన్న కలెక్టర్ వెంకటమురళి లబ్ధిదారులతో మాట్లాడుతూ ఈ మొత్తాన్ని ఏఏ అవసరాలకు వినియోగిస్తున్నారంటూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇంటింటికీ పింఛన్ అందడంలో ఏవైనా సమస్యలున్నాయా అని కూడా వృద్ధులను అడిగారు. బాపట్ల నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల్లో పింఛన్ల పంపిణీలో పాల్గొన్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ వృద్ధుల కాళ్లకు నమస్కరించి మరీ పింఛన్ అందించారు. పూండ్ల గ్రామం, పిట్టలవానిపాలెం మండల పరిధిలోని ఖాజీపాలెం గ్రామంతో పాటు పలు చోట్ల పింఛన్ల పంపిణీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అనర్హులు చాలా మందికి పింఛన్ అందించారని, వాటిని ఏరివేయడానికి స్పెషల్ డ్రైవ్ చేపట్టడం జరుగుతుందని తెలిపారు. వేమూరు నియోజకవర్గ పరిధిలోని అమర్తలూరు మండలం కూచిపూడి గ్రామంతో పాటు వేమూరు మండల పరిధిలోని పెరవలిపాలెం గ్రామంలో జరిగిన పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు పాల్గొన్నారు. ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీ ప్రకారం మొదటినెల రూ.7,000 ఇచ్చామని, ఈ నెల నుంచి రూ.4,000 పింఛన్ అందిస్తున్నామని ఆయన అన్నారు. చీరాల పట్టణ పరిధిలో జరిగిన పింఛన్ పంపిణీ లో ఎమ్మెల్యే ఎంఎం. కొండయ్య పాల్గొన్నారు. రేపల్లె పట్టణ పరిధిలోని 15వ వార్డునందు జరిగిన పింఛన్ల పంపిణీలో మంత్రి అనగాని సోదరుడు శివప్రసాద్ పాల్గొన్నారు.



ప్రకాశం జిల్లా దోర్నాలలో పింఛన్ పంపిణీ చేస్తున్న మంత్రి గొట్టిపాటి రవి, ఎరిక్షన్‌బాబు

స్ట్రాంగ్ పాస్‌వర్డ్ ఓ ఆయుధం



ఎస్పీ తుషార్‌డూడీ

బాపట్ల, ఆగస్టు 1 : సైబర్ కేటుగాళ్ళ భారీనపడకుండా మనల్ని కాపాడుకునే ఒకే ఒక ఆయుధం స్ట్రాంగ్ పాస్‌వర్డ్ అని ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు. ఈ విషయమై గురువారం ఆయన మాట్లాడుతూ పాస్‌వర్డ్ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించరాదన్నారు. మనం ఇంటి నుంచి బయటకెళ్ళేటప్పుడు చాలా జాగ్రత్తగా ఇంటికి తాళం వేస్తాం ఒకటికి రెండుసార్లు పరిశీలించుకుంటాం. అలాగే సామాజిక మాధ్యమాలు, ఇంటర్నెట్ బ్యాంకింగ్, యూపీఐ, ఫోన్ పాస్‌వర్డ్‌ల విషయంలో కూడా చాలా జాగ్రత్తగా వ్యవహరించాలని ఎస్పీ తెలిపారు. తేలికైన పాస్‌వర్డ్‌లను పెట్టుకుంటే సైబర్ కేటుగాళ్ళ చేతికి తాళాలు మనమే ఇచ్చినట్లు అవుతుందన్నారు. గూగూల్, ఫేస్‌బుక్, జీమెయిల్, ఇన్‌స్ట్రాగ్రామ్, ఇంటర్నెట్, మొబైల్ బ్యాంకింగ్ ఇలా అన్నిటికి సంబంధించిన పాస్‌వర్డ్‌లు గుర్తుంచుకోవటం చాలా కష్టమని భావించి అన్నిటికి ఒకటే పాస్‌వర్డ్ పెట్టుకుంటున్నారన్నారు. ఒకదాని పాస్‌వర్డ్ తెలిస్తే అన్ని ఖాతాల గుట్టు సైబర్ నేరగాళ్ళ చేతికి చిక్కుతుందన్నారు. కావున ఇప్పటికైనా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. పుట్టిన తేదీ, పెళ్ళి రోజు, పిల్లలు, భాగస్వామి పేర్లు వంటివి పాస్‌వర్డ్‌లు పెట్టుకోవద్దు అని ఆయన సూచించారు. వీటివల్ల సులభంగానే పాస్‌వర్డ్‌ను హ్యాక్ చేసే ప్రమాదం ఉందన్నారు. పాస్‌వర్డ్ కచ్చితంగా 8 అంకెలు కంటే తక్కువ ఉండకూడదన్నారు. అక్షరాలతోపాటు నెంబర్లు, గుర్తులను జతచేయాలన్నారు. అప్పుడు పాస్‌వర్డ్ బ్రేక్‌చేయటం హ్యాకర్‌కు కష్టమౌతుందన్నారు. ప్రతిమూడునెలలకు ఒకసారి పాస్‌వర్డ్ మార్చుకోవటం, రీసెట్ చేసే అలవాటును పెంచుకోవాలన్నారు. అన్ని పాస్‌వర్డ్‌లను వేర్వేరుగా ఉంచాలన్నారు. ఇతరులతో షేర్ చేసుకోరాదని చెప్పారు. పాస్‌వర్డ్‌ని గుర్తుంచుకోవటానికి పేపరుపై రాసి పర్సులో పెట్టుకోరాదన్నారు. సైబర్ క్రైమ్ భారినపడినవారు తక్షణమే హెల్ప్‌లైన్ నెంబరు 1930కి కాల్ చేయాలని ఎస్పీ తుషార్ డూడీ కోరారు.

ఎన్ఐ వర్కులు కారణంగా పలు రైళ్ల రద్దు

గుంటూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): నాన్ ఇంటర్‌లాకింగ్ పనుల కారణంగా గుంటూరు మీదగా ప్రయాణించే 11 రైళ్లని దాదాపుగా వారం పాటు రద్దు చేస్తున్నట్లు డీఆర్ఎం రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 4 నుంచి 11వ తేదీ వరకు నెంబరు. 07781 విజయవాడ - మాచర్ల, 5 నుంచి 11వ తేదీ వరకు నెంబరు. 07785 రేపల్లె - గుంటూరు, రద్దు చేశామన్నారు. 5, 7, 8, 9, 10 తేదీల్లో నెంబరు. 12077 చెన్నై సెంట్రల్ - విజయవాడ జనశతాబ్ధి, నెంబరు. 12078 విజయవాడ - చెన్నై సెంట్రల్ జనశతాబ్ధి ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేశామని తెలిపారు.



కొండను పరిశీలిస్తున్న అటవీ శాఖ జిల్లా అధికారి భీమయ్య

బొబ్బేపల్లి గ్రావెల్ కొండను పరిశీలించిన అటవీ అధికారులు

మార్టూరు, ఆగస్టు 1: మండలంలోని బొబ్బేపల్లి గ్రావెల్ కొండను గురువారం జిల్లా ఫారెస్ట్ అధికారులు పరిశీలించారు. గత కొన్నేళ్లుగా కొండ నుండి గ్రావెల్ ను అక్రమార్కులు తరలించి సొమ్ములు సంపాదించారు.అయితే ఇటీవల ఈ కొండ అటవీ శాఖ పరిధిలోకి వచ్చిందని గత రికార్డుల ద్వారా వెలుగులోకి రావడంతో ఫారెస్ట్ అధికారులు తరచుగా కొండ ను పరిశీలిస్తున్నారు. దాదాపుగా 350 ఎక రాలు కొండ ప్రాంతం అటవీ భూముల పరిదిలోకి రావడంతో రీసర్వే చేయించి కొండపై సరిహద్దులను ఏర్పాటుచేయాలనే ఉద్దేశ్యంతో అధికారులు కొండను పరిశీలించారు.ఆదేవిధంగా నాగరాజుపల్లి గ్రావెల్ కొండ ప్రాంతంలో అటవీ శాఖ పరిధిలో ఉన్నంతమేర రీసర్వే చేయించి అక్కడ కూడా సరిహద్దులు,ఏర్పాటుచేస్తామని, కొండ ఆక్రమణలకు గురయిన చోట వారికి ప్రాధమికంగా నోటీసులుకూడా జారీచేస్తామని,అనంతరం అటవీ భూములు చుట్టూ హద్దులు ఏర్పాటుచేస్తామని అధికారులు తెలిపారు.ఈ పరిశీలనలో జిల్లా అటవీ అదికారి ఎల్ భీమయ్య,బీట్ ఆఫీసర్ రమేష్ పాల్గొన్నారు.

నాగుల చెరువుకట్టపై వాకింగ్ ట్రాక్

ఇంకొల్లు, ఆగస్టు 1: ఇంకొల్లులో నాగులచెరువుకట్టపై ఉపాధి హామీ పథకం కింద రూ.10 లక్షలతో వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేయనున్నట్లు పంచాయతీ సెక్రటరీ కోటినాగయ్య తెలిపారు. గత తెలుగుదేశం పార్టీ హయాంలో ఇంకొల్లులో పలువురు ప్రముఖులు నాగులచెరువు కట్ట చుట్టూ అబివృద్ధి చేసి వాకింగ్ కోసం ట్రాక్‌ను ఏర్పాటు చేస్తే గ్రామస్థులకు ఉపయోగకరంగా ఉంటుందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు దృష్టికి తీసుకెళ్లారు. అప్పటిలో ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఎమ్మెల్యే ఏలూరి సూచన మేరకు నాగులచెరువుకట్టను అభివృద్ధి చేసి వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధం చేశారు. గురువారం చెరువు చుట్టూ ఉన్న చిల్లచెట్లను ఎక్స్‌కవేటర్‌తో తొలగించే కార్యక్రమం చేపట్టారు. మరో రూ.35 లక్షలతో ఇంకొల్లు పంచాయతీ పరిధిలోని మురుగు కాల్వల నిర్మాణం చేయనున్నట్లు కార్యదర్శి కోటినాగయ్య తెలిపారు.

ఎస్ఐ దాడి ఘటనపై డీఎస్పీ విచారణ

బల్లికురవ, ఆగస్టు 1 : బల్లికురవలో మార్చి నెలలో టీడీపీ సానుభూతిపరుడైన వృద్ధుడు హనుమంతరావుపై ఎస్ఐ నాగశివారెడ్డి దాడి చేసిన సంఘటనపై గురువారం చీరాల ఇన్‌చార్జి డీఎస్పీ జగదీష్‌నాయక్ విచారణ చేశారు. ఆ దాడి సంఘటనపై అప్పట్లో వృద్ధుడు హనుమంతరావు ఎస్సైపై ఫిర్యాదు చేశారు. బెల్ట్ షాపు నిర్వహిస్తున్నట్లు ఉద్దేశపూర్వకంగానే తనపై దాడి చేసినట్లు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్ఐ నాగశివారెడ్డిని ఎన్నికల విధులకు కేటాయించారు. ఎన్నికల విధులలో ఆయన పలు విమర్శలు ఎదుర్కోవడంతో ఎస్ఐని సస్పెండ్ చేశారు. వృద్ధుడు హనుమంతరావు, కుటుంబ సభ్యులను, పోలీస్ సిబ్బందిని డీఎస్పీ జగదీష్‌నాయక్ విచారించారు. వారు చెప్పిన వివరాలను నమోదు చేశారు.

అంజిరెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన వైవీ



అంజిరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న వైవీ

పంగులూరు, ఆగస్టు 1 : మండలంలోని కొండమూరు గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బంధువు భీమనాథం అంజిరెడ్డి కుటుంబ సభ్యులను రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి గురువారం రాత్రి పరామర్శించారు. అంజిరెడ్డి మృతికి గల కారణాలను ఆయన కుమారుడు సుబ్బారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అంజిరెడ్డి సతీమణి సీతాదేవి, కుమార్తె పద్మావతిని ఓదార్చారు. అంజిరెడ్డి చిత్రపటం వద్ద వైవీ నివాళులర్పించారు.

రాష్ట్ర స్థాయి బీచ్ కబడ్డీ పోటీలకు జట్ల ఎంపిక



జిల్లా బీచ్ కబడ్డీ స్త్రీ, పురుషుల జట్టు సభ్యులు

చినగంజాం, ఆగస్టు 1: రాష్ట్ర స్థాయి బీచ్ కబడ్డీ పోటీలకు ఉమ్మడి ప్రకాశం జిల్లా స్త్రీ, పురుషుల జట్లను ఎంపిక చేసినట్లు ఉమ్మడి ప్రకాశం జిల్లా కబడ్డీ ఆర్గనైజింగ్ సెక్రటరీ చెరుకూరి పుల్లయ్య తెలిపారు. సోపిరాల గ్రామంలోని లలితా పరమేశ్వరి సమేత రామకోటేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం జిల్లా కబడ్డీ జట్లను ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. గత నెల 14వ తేదీన బీచ్ కబడ్డీ పోటీలకు జిల్లా స్త్రీ, పురుషుల కబడ్డీ జట్లకు ప్రాబబుల్స్‌ను ఎంపిక చేసి, జూలై 15వ తేదీ నుంచి గురువారం వరకు పురుషుల జట్టుకు స్థానిక రామకోటేశ్వరస్వామి దేవస్థాన ప్రాంగణంలో, స్త్రీల జట్టుకు పాకల సముద్ర తీరంలో శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. పురుషుల జట్టులో 7గురుకి శిక్షణ ఇచ్చి, వారిలో ప్రతిభ చూపిన ఆరుగురుని, స్త్రీల జట్టులో శిక్షణ ఇచ్చిన 6గురిని జిల్లా కబడ్డీ జట్టుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. చిల్లర నరసింహారావు జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యులు ఎంపికైన జిల్లా స్త్రీ, పురుషుల కబడ్డీ క్రీడాకారులకు క్రీడా దుస్తులను అందజేసినట్లు తెలిపారు. ఈ నెల 2 నుంచి 4వ తేదీ వరకు నెల్లూరు జిల్లా ఇందుకూరుపేటలో జరిగే రాష్ట్ర స్థాయి బీచ్ కబడ్డీ పోటీలలో ఉమ్మడి ప్రకాశం జిల్లా స్త్రీ, పురుషుల బీచ్ కబడ్డీ జట్లు పాల్గొన్నట్లు పుల్లయ్య తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ కబడ్డీ క్రీడాకారులు కుర్రి శ్రీనివాసరావు, భోగిరెడ్డి స్వామిరెడ్డి, పోలకం వెంకయ్యనాయుడు, ఫిజికల్ డైరెక్టర్ ముంగర సురేష్, రైల్వే గార్డ్ చిల్లర శేషుబాబు, రిటైర్డ్ రైల్వే గార్డ్ పల్లపోలు గోపాలరావు, జనసేన పార్టీ సీనియర్ నాయకులు సందు శ్రీరామ్, కబడ్డీ క్రీడాకారులు పాల్గొన్నారు.

ఉమ్మడి ప్రకాశం జిల్లా బీచ్ కబడ్డీ పురుషుల జట్టుకు వై.రాజశేఖర్‌రెడ్డి(కెప్టెన్), కోట హరిప్రసాద్‌రెడ్డి, గాలి లక్ష్మారెడ్డి, కుక్కల రామాంజనేయులురెడ్డి, బ్రహ్మారెడ్డి, ప్రసాద్‌రెడ్డి ఎంపిక కాగా, కోచ్‌లుగా భోగిరెడ్డి స్వామిరెడ్డి, మేనేజర్ తుమ్మలపెంట పద్మారావు ఉంటారు. స్త్రీల జట్టుకు వాయిల అర్చన (కెప్టెన్), కటారి భూమిక, వాయిల అపర్ణ, కొక్కిలిగడ్డ నందని, కుమారి సౌమ్య, కోడూరి త్రిపుర ఎంపికయ్యారు. వీరికి కోచ్‌లుగా పోలకం రామచంద్రారావు, మేనేజర్ దేవిరెడ్డి శ్రీనివాసరావు వ్యవహరిస్తారు.

ఒకటినే జీతాలు పడ్డాయ్!

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 1: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులకు ఒకటినే జీతాలు పడుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో వారికి జీతాలు, పెన్షన్లు ఎప్పుడు వేస్తారో తెలియని పరిస్థితి ఉండేది. ప్రభుత్వ ఉద్యోగులు వైసీపీ ప్రభుత్వంలో జీతాల కోసం రోజుల తరబడి ఎదురుచూడాల్సి వచ్చేది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉద్యోగులకు ఒకటో తేదీనే జీతాలు ఇచ్చేదంగా వెంటనే చర్యలు తీసుకున్నారు. జూలై నెల 1వతేదీనే 50శాతం మందికి జీతాలు పడగా ఆగస్టు నెలలో 60శాతం మందికిపైగా ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులకు జీతాలు, పెన్షన్లు పడ్డాయి. గురువారం 1వతేదీ కావడంతో ఉదయాన్ని అనేక ప్రభుత్వ శాఖల ఉద్యోగులకు తమ బ్యాంకు అకౌంట్లలో జీతాలు పడినట్లు మేసేజ్‌లు రావడంతో వారిలో ఆనందోత్సవాలు నెలకొన్నాయి.

జిల్లా నుంచే వర్గీకరణం..

నెరవేరిన లక్ష్యం

- ఈదుమూడిలో ఆవిర్భవించిన ఎమ్మార్పీఎస్
- ఒంగోలు కేంద్రంగా కార్యకలాపాల విస్తరణ
- జిల్లాకు చెందిన నేతల క్రియాశీలక పాత్ర
- సుప్రీంతీర్పుతో ఆ వర్గీయులలో ఆనందోత్సాహాలు

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం అలుపెరగని పోరాటం చేసిన ఎమ్మార్పీఎస్ ఆకాంక్ష గురువారం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో సఫలమైంది. దేశం దృష్టిని ఆకర్షించడమే కాక విభిన్న అంశాలను చర్చకు తెచ్చింది ఆ ఉద్యమం. మూడు దశాబ్దాలకుపైగా అనేక ఆటుపోట్లను ఎదుర్కొని కొన్ని సందర్భాలలో చీలికలకు గురై బలహీనపడినట్లు కనిపించినా అంతిమంగా దామాషాకు అనుగుణంగా ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణను సాధించుకున్నారు. కాగా ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి బీజం పడింది, తొలి కార్యక్రమాలను నిర్వహించింది జిల్లాలోనే. మూడు దశాబ్దాల మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఉద్యమానికి ప్రధానంగా నాయకత్వం వహించింది వరంగల్‌కు చెందిన మందకృష్ణ మాదిగ అయినప్పటికి జిల్లా నుంచే ఆయనకు బలమైన తోడ్పాటు లభించింది. ఇక్కడే సమితి ఆవిర్భవించడమే కాక అత్యంత క్రియాశీలకంగా జిల్లాకు చెందిన వారు వ్యవహరించారు.

ఒంగోలు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత నాగులుప్పలపాడు మండలం ఈదుమూడి గ్రామంలో 1994 జూలై 7న ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ లక్ష్యంతో ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించింది. వరంగల్‌కు చెందిన పూర్వపు రాడికల్ మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో 13 మంది యువకులతో సమితి ఏర్పడింది. మందకృష్ణ అధ్యక్షుడిగా వ్యవహరించగా వామపక్ష విద్యార్థి ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేసిన టంగుటూరు మండలం కారుమంచికి చెందిన కృపాకర్ మాదిగ కార్యదర్శిగా కార్యక్రమాలను ప్రారంభించా రు. ఈదుమూడికి చెందిన కొమ్మూరి కనకారావు, ఉసురుపాటి బ్రహ్మయ్య, పిల్లి మాణిక్యాలరావు వంటి జిల్లావాసులు ఉద్యమాన్ని జిల్లాలోనే కాక రాష్ట్రవ్యాప్తంగా విస్తరింపజేయడంలో మందకృష్ణకు తోడుగా నిలిచారు. రాజకీయ, సామాజిక అంశాలపై మందకృష్ణ చురుకుగా కదులుతున్న సమయంలో ఉమ్మడి రాష్ట్ర అధ్యక్షుడుగా కొమ్మూరి కనకారావు, ఉమ్మడి రాష్ట్ర విభజన తర్వాత అధ్యక్షుడిగా బ్రహ్మయ్య మాదిగలు ఎంపిక కావడం జిల్లాలో ఆ ఉద్యమానికి ఉన్న బలమైన బంధానికి నిదర్శనం. ఈదుమూడిలో ఆవిర్భావంతోపాటు ఒంగో లు కేంద్రంగా కార్యక్రమాలు పెద్దఎత్తున సాగాయి. కాగా కొంతకాలం తర్వాత ఇలాంటి కీలక నాయకులు విభేదాలతో ఒకరికి ఒకరు దూరమైనా ఎవరి పరిధిలో వారు ఉద్యమాన్ని కొనసాగిస్తూనే ఉన్నారు.

1998లో ఆర్డినెన్స్ తెచ్చిన బాబు

1994 జూలై 7న ఈదుమూడిలో 13మందితో ప్రారంభమైన ఎమ్మార్పీఎస్ ఉద్యమం కేవలం రెండేళ్ల వ్యవధిలోనే నాటి చంద్రబాబు ప్రభుత్వం ఈ సమస్యపై కమిషన్ వేసేలా ఉద్యమాలు నడిపింది. అలాంటి ఉద్యమానికి సంబంధించిన తొలి బహిరంగసభ ఒంగోలులోనే జరిగింది. ఇక్కడ 1995 మే 31న దాదాపు లక్షమంది మాదిగ ప్రజలతో నిర్వహించిన సభకు మాజీమంత్రి టిఎం.సదాలక్ష్మీ హాజరయ్యారు. అక్కడి నుంచి ఉద్యమం విస్తరించి నెల్లూరు, విజయవాడ, హైదరాబాద్‌ల్లో భారీ సభలు, ఆందోళన నిర్వహణ, మాదిగ విద్యార్థి, ఉద్యోగులు, మహిళా, యువజన విభాగాలు ఏర్పాటు వంటివి పెద్దఎత్తున సాగాయి. రెండేళ్ల కాలంలోనే ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని గుర్తించిన నాటి సీఎం చంద్రబాబు ప్రభుత్వం 1996 సెప్టెంబరు 10న రామచంద్రరాజు కమిషన్‌ను ఏర్పాటుచేయగా సానుకూలమైన నివేదిక ఇచ్చింది. దానికి వ్యతిరేకంగా మాలమహానాడు ఆవిర్భవించి నిరసనలు, ఆందోళనలు నిర్వహించగా అందులో నూ జిల్లాకు చెందిన వారు చురుకుగా పాల్గొన్నారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా చంద్రబాబు ప్రభుత్వ నిర్ణయం తీసుకొని 1998 అక్టోబరు 1న ఆర్డినెన్స్ కోసం రాష్ట్రపతికి పంపగా 1999 నవంబరు 30న రాష్ట్రపతి ఆర్డినెన్స్ జారీ చేశారు. తదనుగుణంగా 2000 ఏప్రిల్ 1న రాష్ట్రప్రభుత్వం ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అమలుచేయగా నాలుగేళ్లు ఆ లబ్ధిని పొందింది. దీనికి వ్యతిరేకంగా మాలమహానాడు సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో వర్గీకరణ చేసే అధికారం రాష్ట్రానికి లేదని, పార్లమెంట్‌కు మాత్రమే ఉందని ఇవ్వడంతో రిజర్వేషన్లు ఆగిపోయాయి.

మూడు దశాబ్దాల ఉద్యమం

వర్గీకరణ కోసం పదేళ్లుగా ఎమ్మార్పీఎస్ వివిధ రూపాలలో ఆందోళనలు కొనసాగిస్తూనే ఉంది. చివరకు ఈ అంశంపై భారత అత్యున్నత న్యాయస్థానం ఏడుగురు సభ్యుల ధర్మాసనం గురువారం సంచలన తీర్పును వెలువరించింది. కాగా మూడు దశాబ్దాల పాటు సాగిన ఉద్యమ ఆవిర్భావం, అనంతరం హైదరాబాద్‌కు సమానంగా ఒంగోలు కేంద్రంగా ఆ సమితి సాగించిన కార్యకలాపాలను ఆయా వర్గాలు గుర్తుచేసుకుంటున్నాయి. అనేక ఆటుపోట్లను, వందలాది కేసులను ఎదుర్కొని నడిపిన ఈ ఉద్యమంలో జిల్లాకు చెందిన కార్యకర్తలు అనేక మంది జైళ్ల పాలు కావడమే కాక కొందరు ప్రాణాలు కోల్పోయారు. కాగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించి పాతికేళ్లు అయినా సందర్భంగా మందకృష్ణ, బ్రహ్మయ్యల నేతృత్వంలో ఈదుమూడిలో భారీ బహిరంగసభను నిర్వహించి స్థూపాన్ని ఆవిష్కరించారు. నాటి సభలో కేంద్ర మంత్రిగా ఉన్న బీజేపీ నేత కిషన్‌రెడ్డి పాల్గొని వర్గీకరణకు సానుకూలమని ప్రకటించారు. తాజాగా గత జూలై 7న ప్రస్తుత అధ్యక్షుడు బ్రహ్మయ్యమాదిగ ఆధ్వర్యంలో వార్షికోత్సవం నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణ లక్ష్యంతో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావం జరిగినా ఆ ఉద్యమం స్ఫూర్తితో అనేకమంది కార్యకర్తలు నేటికి వివిధ సామాజిక ఉద్యమాలలో, రాజకీయ కార్యకలాపాలలో చురుకుగా పాల్గొంటున్నారు.



ఒంగోలులో గురువారం జరిగిన ఎమ్మార్పీఎస్ ర్యాలీ

వర్గీకరణ తీర్పుపై ఎమ్మార్పీఎస్ సంబరాలు

ఒంగోలు (కార్పొరేషన్), ఆగస్టు 1: ఎస్సీ వర్గీకరణ అంశంపై సుప్రీంకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పుతో జిల్లాలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకొన్నారు. ఈ మేరకు ఎమ్మార్పీఎస్, మహాజన సోషలిస్ట్ పార్టీ, వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో ఒంగోలులోని హెచ్‌సీఎం కాలేజీ, కలెక్టరేట్ ఎదుట, జిల్లాలోని అన్నీ ప్రాంతాలలో అంబేడ్కర్ విగ్రహాలతో పాటు, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పాలభిషేకాలు చేసి, ర్యాలీలు నిర్వహించి సంతోషాలు పంచుకున్నారు. అనంతరం స్థానిక అంబేడ్కర్ భవనంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ ముప్పై ఏళ్ల సుదీర్ఘ ఉద్యమ పోరాటానికి తగిన ప్రతిఫలం దక్కిందన్నారు. గురువారం సుప్రీంకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పు అభినందనీయమన్నారు. తమ నాయకుడు మందకృష్ణ మాదిగ నేతృత్వంలో చేపట్టిన ఉద్యమం ఎస్సీలను ఏబీసీడీలుగా విభజించాలనే డిమాండ్‌తో చేసిన ఉద్యమానికి అనేక అడ్డంకులు వచ్చాయన్నారు. ఈ పోరాటంలో ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పును దేశం మొత్తం హర్షిస్తుందన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికి, టీడీపీ కూటమికి తాము మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి ముఖ్యమంత్రిగా ఉన్న నారా చంద్రబాబునాయుడు వర్గీకరణ బిల్ అసెంబ్లీలో ప్రవేశపెట్టగా తమకు కొంతమేర మేలు జరిగిందన్నారు. కాగా ఇప్పుడు పూర్తి స్థాయిలో ఊరట లభించిందని, ఈ సందర్భంగా వారు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు తొరటి ఆనంద్, బిక్షాలు, నేలపాటి రాజు, తిరువీధి బాబు, మాదిగ ఉద్యోగుల సంఘం నాయకులు సర్వేపల్లి రవిరాజ్, కత్తి ఐజక్, జిర్రా బాబూరావు, తేళ్ళ జాలరావు, పి.కిషోర్, నక్కిపోయిన కోటేశ్వరరావు, రావినూతల కోటయ్య, గద్దల విల్సన్ కుమార్, కొమ్మూరి రవిచంద్ర, జంద్రాజుపల్లి ఆంజనేయులు మాదిగ, జి. ప్రభుదాస్, పాల్గొన్నారు.

'మదర్ మిల్క్ బ్యాంకులు' ఏర్పాటుకు చర్యలు

- కలెక్టర్ అన్సారియా
- ఘనంగా తల్లిపాల వారోత్సవాలు ప్రారంభం

ఒంగోలు(కార్పొరేషన్), ఆగస్టు 1: పిల్లలకు ఆస్తి, మంచి చదువుకు ఎలాంటి ప్రాధాన్యత ఇస్తా మో, అంతకుమించి పిల్లలకు తల్లిపాలు ఇవ్వడం వల్ల మంచి ఆరోగ్యాన్ని అందించవచ్చని, తల్లిగా తాను కూడా అదే నిర్ణయం తీసుకున్నానని కలెక్టర్ తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. గురువారం ఒం గోలులోని జీజీహెచ్‌లో తల్లిపాల వారోత్సవాలను కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు. బిడ్డలకు తల్లి పాలు పలుకారణాల వల్ల ఇవ్వలేకపోయే వారికి మదర్ మిల్క్ బ్యాంక్స్ (ఫీడింగ్ బ్యాంకులు) జిల్లా లో ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని గుర్తించామని తెలిపారు. ఆ దిశగా చర్యలు తీసుకుంటామని కలె క్టర్ వెల్లడించారు. వెయ్యి రోజులపాటు తల్లిపాలు బిడ్డకు ఇవ్వడం ఎంతో ఉత్తమమైన మార్గమని, ప్రజల్లో ఈ విషయంపై పూర్తి అవగాహన కల్పిం చాలని సూచించారు. ఇద్దరు బిడ్డల తల్లిగా తాను ఇదే తరహా పాటించినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. రిమ్స్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొం డలు మాట్లాడుతూ బిడ్డకు తల్లి తన పాలు ఇవ్వని పక్షంలో బ్రెస్ట్‌కేన్సర్ వచ్చే అవకాశాలు ఉన్నా యన్నారు. ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని తల్లులు అందరూ తమ బిడ్డలకు పాలు ఇవ్వడం తప్పని సరి పేర్కొన్నారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డా క్టర్ దుర్గాభవానీ మాట్లాడుతూ జీజీహెచ్‌లోని పనిచేస్తున్న సిబ్బందితోపాటు వచ్చే రోగులకు ఫీడ్ రూములు ఏర్పాటు చేశామన్నారు. వారం రోజుల పాటు తల్లిపాలపై పలు అవగాహన కార్యక్రమా లు నిర్వహిస్తామని తెలిపారు. జిల్లావ్యాప్తంగా తల్లిపాల వారోత్సవాలపై ఆరోగ్యకేంద్రాలలో ప్రజల కు అవగాహన కల్పిస్తామని చెప్పారు. చిన్నపిల్లల విభాగం అధికారి డాక్టర్ ఎలిజబెత్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డీఎంహెచ్‌వో సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

ఒంగోలు(కలెక్టరేట్): ప్రభుత్వ సహాయంతో ప్రారంభమైన గృహ నిర్మాణాలు త్వరగా పూర్తయ్యే లా చూడాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదే శించారు. గృహ నిర్మాణ సంస్థ, టిడ్కో ఆధ్వర్యంలో చేపట్టిన ఇళ్ళ నిర్మాణాల స్థితిగతులపై గురువారం స్థానిక కలెక్టరేట్‌లో ఆయా శాఖల అధికారులతో స మీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో చే పట్టిన ఇళ్ళ నిర్మాణాలలో పూర్తనవి, వివిధ దశ లలో ఉన్నవాటి వివరాలను పవర్ పాయింట్ ప్ర జంటేషన్ ద్వారా అధికారులు వివరించారు. అనం తరం కలెక్టర్ మాట్లాడుతూ లబ్ధిదారులు త్వరగా ఇళ్ళు పూర్తి చేసుకునే చూడాలన్నారు. ఎదైనా స మస్యలు ఎదురైతే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని కలెక్టర్ తెలిపారు. జిల్లా స్థాయిలో సంబంధిత శాఖలన్ని సమన్వయంతో పనిచేయాలని సూచిం చారు. టిడ్కో కాలనీల్లో మౌలిక సదుపాయాల కోసం చెల్లింపులు జరిగిన పనులు త్వరగా పూర్త య్యేలా చూడాలని ఆదేశించారు. సమావేశంలో హౌసింగ్ పీడీ పేరయ్య, ఒంగోలు, మార్కాపురం ఈఈలు పెరుగు శ్రీనివాస్‌ప్రసాద్, దశరథిశర్మ, డీటీ్కో ఈఈ వెంకటేశ్వరరావు, డీఈఈ వీరబ్రహ్మ చారి తదితరులు పాల్గొన్నారు.

బడుల్లో మోగిన ఎన్నికల నగారా

ఒంగోలు(విద్య), ఆగస్టు 1: ప్రభుత్వరంగ పాఠశాలల్లో పాఠశాల యాజమాన్య కమిటీ(ఎస్ఎంసీ)ల పునర్వ్యవస్థీకరణ కోసం ఎన్నికల ని ర్వహణకు నగారా మోగింది. పాఠశాలల హెచ్‌ఎంలు గురువారం ఉదయం ఎస్ఎంసీ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీచేశారు. మధ్యాహ్నం 1 గంటకు ఎన్నికల్లో పాల్గొనే తల్లిదండ్రుల ఓటర్ల జాబితాను హెచ్‌ఎంలు ప్రకటించారు. మధ్యాహ్నం 2 గంటలకు ఓటర్లకు అందుబాటులో ఉండేలా ఓటర్ల జాబితాలను పాఠశాల నోటీసు బోర్డులో ప్రదర్శించారు.

జిల్లాలోని 2,427 ప్రభుత్వరంగ పాఠశాలలకు ఎస్ఎంసీ ఎన్నికలు నిర్వహిస్తున్నారు. వీటిలో సింహభాగం అంటే 2,126 మండల పరిషత్ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో మొదట సభ్యులను ఎన్నుకుంటారు. వారు తమలో ఒకరిని చైర్మన్‌గా, మరొక రిని వైస్ చైర్మన్‌గా ఎన్నుకుంటారు. ఈనెల 5 ఓటర్ల జాబితాలపై అభ్యంతరాలను స్వకరించి అదే రోజు సాయంత్రానికి తుది జాబితాను ప్రకటిస్తారు. 8న ఎస్ఎంసీ ఎన్నికలు నిర్వహిస్తారు. ఉదయం 7.30 నుంచి ప్రక్రియ ప్రారంభమవుతుంది. మొదట ప్రతి తరగతి నుంచి ఎస్ఎంసీ సభ్యులను ఎన్నుకొని అదేరోజు మధ్యాహ్నం చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకుంటారు. సాయంత్రం మొదట సమావేశం జరుగుతుంది. ఎన్నికలను రాజకీయాలకతీతంగా నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది.

11లోపు డీఈఎల్ఈడీ పరీక్ష ఫీజు చెల్లించాలి

ఒంగోలు(విద్య), ఆగస్టు 1 : డిప్లమో ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఈఎల్ఈడీ) 2023-25 బ్యాంచ్ రెగ్యులర్, 2021-23, 2021-2024 బ్యాచ్‌లు ఒకసారి ఫైయిలైన విద్యార్థులు రెండవ సెమిస్టర్ పరీక్ష ఫీజు ఈనెల 11వ తేదీ లోపు చెల్లించాలని షైనంపాడు డైట్ ప్రిన్సిపాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష ఫీజు రూ.150, అపరాధరుసుంతో ఈనెల 19వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లింపునకు అవకాశం కల్పించారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష ఫీజు చెల్లించి పరీక్షలకు హాజరు కావాలని ఆయన కోరారు.

రొయ్యల సాగులో మేలైన పద్ధతులు పాటించాలి

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 1 : రొయ్యల సాగులో మేలైన పద్ధతులు పాటించి మంచి దిగు బడులు సాధించే దిశగా అడుగులు వేయాలని మత్స్యశాఖ కమిషనర్ టి.శంకర్ పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో గురువారం రొయ్యల పెంపకందారులు, హెచరీలయాజమాన్యం, ప్రాసెసింగ్ ప్లాంట్ల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతకు ముందు రొయ్యల రైతు సంఘం నాయకులు మాట్లా డుతూ నాసిరకం సీడ్ వల్ల తీవ్రంగా నష్టపోయా మని ఇవేదన వ్యక్తం చేశారు. పి.మోనోడాన్ సీడ్ ను వైష్ణవి హెచరీ గూడూరు నుంచి, ముస్నంగి హెచరీ నెల్లూరు నుంచి దిగుమతి చేసుకున్న సీడ్ వల్ల రొయ్య ఎదుగుదల తగ్గిపోయి రైతులు తీవ్రం గా నష్టపోవాల్సి వచ్చిందని చెప్పారు. దీనిపై కమిషనర్ శంకర్ మాట్లాడుతూ ఆయా హెచరీ లసీడ్ శాంపిల్స్‌ను సేకరించి ఎస్ఎఫ్‌డీబీ హైద రాబాద్ ల్యాబ్‌కు పంపడం జరిగిందన్నారు. ఆ ల్యాబ్ నుంచి నివేదిక వచ్చాక ప్రభుత్వానికి పంపుతామని తెలిపారు. అనంతరం కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ రొయ్యల సాగు కోసం మంచి నాణ్యమైన సీడ్‌ను అందించే విధంగా హెచరీలు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అందుకు సంబంధించిన అంశాలను దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో ఒంగోలు, నెల్లూరు మత్స్యశాఖ అధి కారులు ఆవుల చంద్రశేఖర్‌రెడ్డి, ఎం.నాగేశ్వరరా వు, మత్స్యశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ వీవీ ఆర్.బాబు, సంఘం అధ్యక్షుడు గోపీనాథ్ తదితరు లు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై సర్వత్రా హర్షం

విజయనగర్‌కాలనీ (చీరాలటౌన్), ఆగస్టు 1 : ఎస్సీ వర్గీకరణకు అత్యున్నత న్యాయస్థానం అనుకూల తీర్పును ఇవ్వడంపట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. పలువురు మాదిగ సామాజికవర్గం నాయకులు అన్నారు. గురువారం వెల్లడించిన తీర్పుపై హర్షం వ్యక్తం చేస్తూ ప్రతినిధులు చీరాల మండల పరిధిలోని విజయనగర్ కాలనీలో బాణసంచా కాల్చారు. అందరికీ స్వీట్లు పంచిపెట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మాదిగ, ఉపకులాల స్థితిగతులను బేరీజు చేసుకుని 1994 జూలై 7న ఉమ్మడి ప్రకాశం జిల్లా చీరాల నుంచి మాదిగ రిజర్వేషన్ పోరాట సమితిని మంద కృష్ణమాదిగ ప్రారంభించినట్లు తెలిపారు. ఈ విజయం దాదాపుగా 30 ఏళ్ల పోరాటానికి ప్రతిఫలమన్నారు. ఎన్‌డీఏ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బుడంగుంట్ల లక్ష్మీనరసయ్య, వందనం మాదిగ, తేళ్ల దేవదానం, ఏసుపాదం, తేళ్ల లక్ష్మీ శేఖర్, చైతన్య తాళ్లూరి రాజా, పిడతల అభిషేక్, తేళ్ల రాంబాబు, సుబ్బారావు, వంశీ, చుండూరి నాగేశ్వరరావు, సాంసన్, నల్లయ్య, సైమన్, వందనం, పోలయ్య, కిరణ్, యోహాన్, నాగరాజు ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఈఎఫ్ నాయకులు పాల్గొన్నారు.



బాణసంచా కాల్చి ఆనందం వ్యక్తం చేస్తున్న ప్రతినిధులు

అద్దంకిటౌన్ : ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు పట్ల మాదిగ ఉద్యోగులు, సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం అద్దంకిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్, ఎంఎస్‌పీ నాయకుల ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాణసంచా కాల్చి, కేక్‌ను కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ నాయకులు అనపర్తి రమేష్, గంగవరపు సిద్దు, కోటయ్య, పూనూరి నరేంద్ర, చక్రవర్తి, బుల్లియ్య, టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు వలపర్ల సుబ్బారావు పాల్గొన్నారు.



అద్దంకి అంబేడ్కర్ విగ్రహం వద్ద సంబరాలు నిర్వహిస్తున్న నేతలు

మేదరమెట్ల : ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు పట్ల ఎమ్మార్పీఎస్ నాయకులు మందా ఆమోస్ హర్షం వ్యక్తం చేశారు. సుప్రీం తీర్పుతో మాదిగ యువతకు ఉపాధి అవకాశాలు కలుగుతాయన్నారు.

పంగులూరు : ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు వందతరాల భవిష్యత్‌ను నిర్దేశించబోతుందని ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు వరపర్ల సుబ్బారావు అన్నారు. ముప్పవరం గ్రామంలో ఆయన ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ కృష్ణప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కాలనీల్లో వసతులు కరువు..!

- జగనన్న ఇళ్లకు వైసీపీ గ్రహణం
- కట్టిస్తామని మాట తప్పిన జగన్‌రెడ్డి
- రోడ్లు, డ్రైన్లు, తాగునీటి ఏర్పాట్లపై నిర్లక్ష్యం
- నివాసం ఉండటానికి విముఖత చూపుతున్న లబ్ధిదారులు
- సౌకర్యాలు కల్పించాలని చంద్రబాబు ప్రభుత్వానికి విజ్ఞప్తి

అద్దంకి, ఆగస్టు 1 : కొత్త కాలనీలు కాదు.. ఏకంగా ఊర్లే ఏర్పడుతున్నాయి.. ఇది గత వైసీపీ పాలనలో జగన్‌రెడ్డి నుంచి గల్లీ స్థాయి నాయకుడు వరకు ఊదరగొట్టిన ప్రసంగాలు... అయితే లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు పంపిణీపై చూపించిన శ్రద్ధ ఆ తరువాత ఆ కాలనీలలో మౌలిక వసతులు కల్పనపై పెట్ట లేదన్న విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో కొత్తగా ఊర్లు ఏర్పడడం మాట అలా ఉంచితే వైసీపీ పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఆయా కాలనీలలో నివాసం ఉండే పరిస్థితి లేకుండా పోయిందని లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి పేదకూ ఇంటిని తానే నిర్మించి ఇస్తామని చెప్పి జగన్‌రెడ్డి మోసం చేశారని లబ్ధిదారులు విమర్శిస్తున్నారు. జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణం పై లబ్ధిదారుల మెడ మీద కత్తి పెట్టి మరి పూర్తి చేయించారు. లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఇచ్చిన 1.80 లక్షల రూపాయలు పునాదికి కూడా సరిపోని పరిస్థితి. దీంతో అత్యధిక శాతం లబ్ధిదారులు అప్పులు చేసి ఇళ్లను నిర్మించారు. అప్పులు చేసకొని మరి కట్టుకున్న ఇంట్లో కనీసం ఉందా మన్నా అక్కడ వసతులు లేకపోవడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక్క విద్యుత్ వసతి మినహా ఎలాంటి సౌకర్యాలు లేవని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అద్దంకి పట్టణంలో మూడు చోట్ల బొమ్మనంపాడు రోడ్డు, వేలమూరిపాడు రోడ్డు, నాగులపాడు రోడ్డులలోని సుమారు 2వేల మందికి ఇళ్ల పట్టాలను అందజేశారు. సుమారు సగం మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించారు. వీటిలో కొంత మంది నిర్మాణం పూర్తి చేసు కొని గృహ ప్రవేశాలు చేసి నివాసం కూడా ఉంటున్నారు. ఎన్నికలకు ముందు గృహ ప్రవేశాలను వైసీపీ నాయకులు ఆర్భాటంగా చేయించారు. అయితే కాలనీల్లో రోడ్లు, డ్రైన్లు, తాగునీటి వసతిని కల్పించడంలో వైసీపీ ఘోరంగా విఫలమైంది. దీంతో ఇళ్లల్లో చేరినవారు ఖాళీ చేసి పట్టణానికి వచ్చారు. వివిధ దశల్లో నిలిచిన గృహ నిర్మాణాలపై లబ్ధిదారులు ఆసక్తి చూపడం లేదు. ప్రస్తుతం టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతో కాలనీల్లో వసతుల కల్పనకు కృషి చేయాలని లబ్ధిదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.



బొమ్మనంపాడులో కాలనీకి వేయని రోడ్డు



అద్దంకి పట్టణంలోని బొమ్మనంపాడు రోడ్డులో జగనన్న కాలనీ వ్యూ



వేలమూరిపాడు : కాలనీ రోడ్డులలో నిలిచిన నీరు



వారోత్సవాలను నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రం సిబ్బంది

తల్లిపాలతో చిన్నారులకు ఆరోగ్యం

బల్లికురవ, ఆగస్టు 1 : పుట్టిన బిడ్డకు ముర్రుపాలు పట్టిస్తే వారు ఆరోగ్యంగా జీవి స్తారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సలోమి, విజయనిర్మ తెలిపారు. గురువారం మండ లంలోని ఎస్ఎల్ గుడిపాడు, రామాంజనేయపురం గ్రామాలలో ప్రపంచ తల్లి పాల వారోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ చిన్నారులు, తల్లులతో ర్యాలీ నిర్వహించారు. తల్లిపాలతో కలిగే లాభాలపై అవగాహన కల్పిం చారు. పూర్వ కాలంలో బిడ్డ జన్మించిన వెంటనే తల్లి పాలు పట్టించే వారని, ఆ రోజుల్లో పిల్లలు ఎలాంటి అనారోగ్యానికీ గురికాకుండా ఆరోగ్యంగా ఉండేవారని గుర్తు చేశారు. ప్రస్తుతం పుట్టిన పిల్లలకు డబ్బాపాలను అలవాటు చేస్తుండడంతో రోగాలకు గురవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో అంగన్ వాడీ కార్యకర్తలు నాగమణి, అంకమ్మ, మహలక్ష్మి పాల్గొన్నారు.

కౌలు రైతులకు ప్రభుత్వ అండ



బ్యాంక్ మేనేజర్‌కు జాబితాను అందజేస్తున్న వ్యవసాయాధికారులు

చీరాలటౌన్, ఆగస్టు 1 : వాస్తవ కౌలుదారు రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుం దని జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ పేర్కొన్నారు. కౌలుదారులకు సాయం అందించే క్రమంలో చేపట్టిన కార్యక్రమంలో భాగంగా మండలానికి 370 పంట సాగు దారు హక్కు పత్రం (కార్డులు) లక్ష్యమని చెప్పారు. ఇప్పటికే 289 మందికి కార్డులు జారీ చేసినట్లు వివరించారు. ఈ కార్డులు వలన భూ యజమాని హక్కుకు రక్షణ, కౌలు రైతులకు పంట రుణాలు, సున్నా వడ్డీ, ఉచిత క్రాప్ ఇన్సూరెన్స్, ఇన్‌పుట్ సబ్సిడీ, పంట ఉత్పత్తుల కొనుగోలు తదితర సౌకర్యాలు ఉంటాయని వివరించారు. ఈ క్రమంలోనే 89 మందికి ముందస్తు రుణాలు ఇవ్వాలని యూనియన్ బ్యాంకు గవి నివారి పాలెం బ్రాంచి మేనేజర్ రమేష్‌కు జాబితాను అందజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిని సుమతి, ఫీల్డ్ ఆఫీసర్ గంగాధర్, దేవినూతల వీఏఏ మధుప్రియ పాల్గొన్నారు.

కొట్లాటపై కేసు

ఇంకొల్లు, ఆగస్టు 1 : ఇంకొల్లు వడ్డెర కాలనీకి చెందిన భూలక్ష్మి కొంతకాలంగా చీటీ పాటలు నిర్వహిస్తోంది. ఈ క్రమంలో కొంతమందికి తిరిగి చెల్లించాల్సిన డబ్బులు ఇవ్వలేక ఐపీ దాఖలు చేసి, నోటీసులు పంపింది. దీనిపై చీటీలు కట్టిన కోవూరి రంగయ్య, ఆదిమ్మ, అజయ్ తదితరులు వారి కట్టిన సొమ్ము తిరిగి చెల్లించా లని అడిగే విషయంలో భూలక్ష్మికి వారికి మధ్య మాటామాట పెరిగి కొట్లాటకు దారి తీసింది. ఈ ఘటనలో భూలక్ష్మికి గాయాలు అయ్యాయి. భూలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మల్లికార్జునరావు తెలిపారు.

నూరుశాతం లక్ష్యంగా పింఛన్‌ల పంపిణీ

- ఇంటింటికీ వెళ్లి ఇచ్చిన సచివాలయ ఉద్యోగులు
- పర్యవేక్షించిన అధికారులు
- ఆసుపత్రిలో ఉన్న లబ్ధిదారులకూ అందజేత
- పథకాలు పారదర్శకంగా చేరాలి
- ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి



పింఛన్‌ను పంపిణీ చేస్తున్న ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి

వాడరేవు(చీరాలటౌన్), ఆగస్టు 1 : ప్రభుత్వం నిస్సహాయకులకు అందిస్తున్న సంక్షేమ పథకాలను పారదర్శకంగా చేరేలా అధికారులు కృషి చేయాలని ఆర్డీవో సూర్యనా రాయణరెడ్డి అన్నారు. చీరాల మండల పరిధి లోని వాడరేవు గ్రామంలో గురువారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌ల పంపిణీ కార్యక్రమం ఆర్డీవో నిర్వహించారు. ఈసందర్భంగా నేరుగా లబ్ధిదా రులను కలిసి పెన్షన్‌ను పంపిణీ చేశారు. కా ర్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొ న్నారు.

బల్లికురవ : బల్లికురవ మండలంలోని 21 గ్రామం పంచాయతీలో పింఛన్‌ల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం ప్రత్యేకాధికారి సు రేంద్ర, ఎంపీడీవో హనుమారెడ్డి పరిశీలించారు. కొప్పెరపాలెం, గుంటుపల్లి గ్రామాలలో వృ ద్ధులు, వితంతువులకు పింఛన్లను అధికారులు దగ్గరుండి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటింటికీ సంచివాలయ ఉద్యో గులు వెళ్లి పింఛన్‌లను అందజేస్తున్నట్లు చెప్పారు. మెదటిరోజు మండలంలో 7789కిగా ను 7381 మందికి అందజేశామని, సాయంత్రా నికి 95 శాతం పంపిణీ జరిగిందని తెలిపారు. నర్సారావుపేట ఆసుపత్రిలో చికిత్స పొందుతు న్న వృద్ధుడి వద్దకు వెళ్లి పింఛన్ అందజేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సుమతి, కార్యా లయ సీనియర్ అసిస్టెంట్ సీహెచ్ కోటేశ్వర రావు (బుజ్జి) పంచాయతీ కార్యదర్శులు పాల్గొ న్నారు.

పింఛన్‌లు పంపిణీ చేసిన ఆర్డీవో

మార్టూరు : పింఛన్‌ల పంపిణీ కార్యక్ర మంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచి వాలయ ఉద్యోగులు, టీడీపీ నాయకులు పాల్గొని లబ్ధిదారులకు అందజేశారు. మండ లంలో మొత్తం 10032 మంది ఉండగా వారిలో 9713 మందికి పంపిణీ చేశారు. నాగరాజుపల్లి గ్రామంలో పింఛన్‌ల పంపిణీని ఆర్డీవో గంధం రవీందర్ పరిశీలించి వృద్ధులకు అందజేశారు. రేషను బియ్యం పంపిణీని కూడా పరిశీలిం చారు. ఆయన వెంట తహసీల్దార్ ప్రశాం తి, ఎంపీడీవో నితిన్, పంచాయతీ కార్యదర్శి ముర ళీకృష్ణ, సర్పంచ్ దాసరి నరేంద్రబాబు పాల్గొ న్నారు. మార్టూరులో పంచాయతీ కార్యదర్శి తన్నీరు శ్రీనివాసరావు, యద్దనపూడిలో టీడీపీ నాయకుల పర్యవేక్షణలో పింఛన్‌లను పంపిణీ చేశారు.

పర్చూరు : ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని గురువారం మండలంలో అధికా రులు, టీడీపీ శ్రేణులు కలిసి పంపిణీ చేశారు. పర్చూరు సచివాలయంలో లబ్ధిదారులకు ఆర్డీవో జీ రవీందదర్ పెన్షన్‌ను అందజేశారు. బా పట్ల డీఎంహెచ్‌వో విజయలక్ష్మిపరిశీలించి సం తృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఇన్ చార్జి తహసీల్దార్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చినగంజాం : మండల పరధిలోని 12 గ్రా మ పంచాయతీలలో 97.2 శాతం పింఛన్‌ల ను పంపిణీ చేసినట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో ఎన్. వేణుగోపాలకృష్ణమూర్తి తెలిపారు. మండ లంలో మొత్తం 6002 మంది పింఛన్ దారులుండగా, వారిలో 5834 మందికి పెన్షన్ అందజేసినట్లు తెలిపా రు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌లు, కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, టీడీపీ కూట మి నాయకులు పాల్గొన్నారు.



పర్చూరులో పింఛన్‌ను పంపిణీ చేస్తున్న ఆర్డీవో రవీందర్



బల్లికురవలో పింఛన్ ఇస్తున్న ప్రత్యేకాధికారి

చెప్పింది చేస్తాం : పెన్షన్ల పంపిణీలో ఎమ్మెల్యే కొండయ్య

చీరాల : చెప్పింది చేస్తాం. చేసేది చెప్తాం. అదే సీఎం చంద్రబాబు నాయుడు, ఎన్డీఏ కూటమి సిద్ధాంతమని ఎమ్మెల్యే ఎం.ఎం కొండయ్య చెప్పారు. గురువారం పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే కొండయ్య ఉదయం 5 గంటల నుంచి మున్సి పల్ కమీషనర్ చక్ర వర్తి ఇతర అధికారులు, సిబ్బంది, నాయకులుతో కలసి పట్టణ పరధిలో పెన్షన్ల సొమ్మును లబ్ధిదారులకు వారి, వారి ఇళ్ల వద్ద పంపిణీ చేశారు. అంనతరం రూరల్ పరిధిలోని అక్కాయిపాలెంలో పెన్షన్ల పంపి ణీలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆయా సందర్భాల్లో ఆయన మాట్లాడుతూ చెప్పింది చేస్తాం. చేసేదే చెప్తామని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు దిశానిర్దేశంతో సంబంధిత అధికారులు, నాయకులు, కార్యకర్తలతో కలసి పెన్షన్లు పంపిణీ చేశామన్నారు. అదే విధంగా నియోజవకర్గం మొత్తంలో కూడా ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు పెన్షన్లు పంపిణీలో వారి, వారి పరిధుల్లో పాల్గొని లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ చేయించటంలో తమ వంతు పాత్ర పోషించటం చరి త్రలో ఇదే ప్రధమం అన్నారు. ఇదంతా సీఎం చంద్రబాబు కార్యదక్షతకు నిదర్శనమని చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పింఛన్‌ను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య



పురుగు మందులను పరిశీలిస్తున్న ఏడీఏ మోహనరావు

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

చెరుకూరు(పర్చూరు), ఆగస్టు 1 : పురుగు మందులను ఎంఆర్‌పీ రేట్లకే విక్రయించాలని, నిబంధనలు అతిక్రమించి అమ్మితే చర్యలు తీసుకుంటామని పర్చూరు వ్యవసాయ సహాయ సంచాలకులు ఎన్.మోహనరావు దుకాణ యజ మానులను హెచ్చరించారు. గురువారం కారంచేడు మండలం కుంకలమర్రు గ్రామంలోని వినాయక ట్రేడర్స్, శ్రీ లక్ష్మీ శ్రీనివాస ఫెర్టిలైజర్స్ పురుగు మందల దుకాణాలను వ్యవసాయాధికారులు తనిఖీ చేశారు. ప్రభుత్వం నిషేధించిన పురుగు మందులను విక్రయించరాదని, అలా విక్రయిస్తే సంబంధిత దుకాణ దారునిపై క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవ సాయాధికారి కె.సుధీర్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా ప్రశాంతి బాధ్యతల స్వీకరణ



మార్టూరు, ఆగస్టు 1 : తహసీల్దార్‌గా ప్రశాంతి గురువారం కార్యాలయంలో ఉద్యోగ బాధ్యతలను స్వీకరించారు. ఆమె సంతమాగులూరు మండలం నుంచి బదిలీపై మార్టూరుకు వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన ప్రశాంతికి డీటీ శివ శ్రీను, రీసర్వే డీటీ కోదండరామ్, ఆర్ఐ రహమాన్ బాషా తదితర ఉద్యో గులు స్వాగతం పలికారు.

పచ్చ దోమపై అప్రమత్తం



పత్తి పంటను పరిశీలిస్తున్న ఏవో కుమారి

బల్లికురవ, ఆగస్టు 1 : ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పత్తి పంటలో పచ్చ దోమ అధికంగా ఉందని దీనిపై రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయా ధికారి కుమారి సూచించారు. మండలంలోని కె.రాజుపాలెం గ్రామంలో రైతులు సాగు చేసిన పత్తి పంటను ఏవో రైతులతో కలిసి పరిశీలించారు. ఈసందర్భం గా పచ్చ దోమతో పత్తి ఎదుగుదల లేకుండా నశించిపోతుందని రైతులు ఏవో దృష్టికి తెచ్చారు. దీనిపై ఆమె మాట్లాడుతూ దోమ నివారణకు 25 రోజుల పంటకు మోనోక్రోటో ఫాస్, నీటిని 1:4 నిష్పత్తిలో కలిపి కాండానికి పూత పూయాలని, 40 రోజుల పంటకు కూడా ఇలానే చేస్తే రసం పీల్చే పురుగులు సమర్థవంతంగా నివారించవచ్చని సూచించారు. ఈ పరిశీలనలో ఎంపీఈవో గుణశేఖర్ పాల్గొన్నారు.

రోగ నియంత్రణకు సహకరించాలి

సాల్మన్ సెంటర్(చీరాలటౌన్), ఆగస్టు 1 : పరిసరాల పరిశుభ్రత పాటించి గ్రామంలో రోగ నియంత్రణకు ప్రజలు సహకరించాలని సాల్మన్ సెంటర్ పంచాయతీ కార్యదర్శి బుచ్చిబాబు అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సెక్రటరీ గ్రామంలో ఫాగింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వివరిం చారు. ఈక్రమంలోనే చెత్త సేకరణ జరుగుతున్నట్లు చెప్పారు. ప్రజలు కూడా నివాసాల్లో మురుగు, వ్యర్థాలు నిల్వలు లేకుండా చూడాలని కోరారు. కార్యక్ర మంలో కార్యాలయ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

రోటరీ ఆధ్వర్యంలో 210వ నేత్రదానం

అద్దంకిటౌన్, ఆగస్టు 1 : రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో గురు వారం 210వ నేత్రదానం జరిగింది. పట్టణంలోని కాకానిపాలెంకు చెందిన బెజ వాడ సుబ్బులు (90) మృతి చెందగా, వారి కుమారులు సుబ్బారావు, రామా రావు, శ్రీనివాసులు అనుమతితో రోటరీ క్లబ్ సభ్యులు పెదకాకాని శంకర కంటి వైద్యశాలకు సమాచారం అందించారు. డాక్టర్ చేతన్ బృందం సుబ్బులు కార్ని యాలను సేకరించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వీ రయ్య, మురళీ సుధాకరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నాగండ్లలో నేత్రదానం

ఇంకొల్లు : నాగండ్లలో గురువారం నేత్రదానం జరిగింది. గ్రామానికి చెందిన గాడిపర్తి ఆంజనేయులు (67) మృతి చెందగా, ఇంకొల్లు రోటరీ అవయవదాన కమిటీ ఆధ్వర్యంలో గుంటూరు శంకర కంటి వైద్యశాల వైద్యులు నేత్రాలను సేకరించారు. నేత్రదానానికి సహకరించిన కుటుంబ సభ్యులు నరసమ్మ, నర సింహారావు, నాగేశ్వరరావు, రమేష్‌ను అవయవదాన కమిటీ సభ్యులు సోమే పల్లి రామ్మోహనరావు, జెట్టి వెంకటేశ్వర్లు, రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రఫి, చుండి సాంబశివరావు, రోటరీ సభ్యులు అభినందించారు.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పును రద్దు చేయాలి

అద్దంకిటౌన్, ఆగస్టు 1: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పునఃపరిశీలించి రద్దు చేయాలని మాలమహానాడు అద్దంకి నియోజకవర్గ అధ్యక్షుడు అంకం కిరణ్‌కుమార్ అన్నారు. గురువారం అద్దంకిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కోర్టు తీర్పుపై నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాగయ్య, వంశీ, అంకమ్మరావు, హనుమంతరావు, శ్రీనివాసరావు, నరసయ్య, శ్రీ కృష్ణ, రాజశేఖర్, అనంద్, కోటేశ్వరరావు, పూర్ణయ్య పాల్గొన్నారు.

మోటార్ సైకిలిస్ట్‌కి గాయాలు



మేదరమెట్ల, ఆగస్టు 1 : జాతీయ రహదా రిలో కొరిశపాడు ఫ్లైవోవర్ వద్ద మోటార్ సైకిల్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. గురువారం ఒంగోలులో ఉంటున్న బత్తుల నాగే శ్వరరా వు ముప్పవరంలో వృద్ధాప్య పింఛన్ తీసుకోవడానికి రామచంద్రరావుతో కలిసి ముప్పవరం వెళ్తున్నారు. కొరిశపాడు ఫ్లైవోవర్ వద్ద గుర్తు తెలియని కారు ఢీకొనడంతో రామచంద్రరావు, నాగేశ్వరరా వు ఇద్దరూ గాయపడ్డారు. వారిని 108లో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

దాతల సాయం అభినందనీయం

- ఎలిమెంటరీ స్కూల్‌కి ఎల్ఈడీ ప్రాజెక్టర్ అందజేత
- ప్రవాసాంధ్రుడు సూర్యను అభినందించిన ఏలూరి

బోడవాడ(పర్చూరు), ఆగస్టు 1 : విద్యాభివృద్ధికి దాతలు అందిస్తున్న సహ కారం అభినందనీయమని ఎంఈవో పి.వెంకట్రామయ్య అన్నారు. పర్చూరు మండలం బోడవాడ గ్రామంలోని ఎలిమెంటరీ పాఠశాలకు గ్రామానికి చెందిన ప్రవాసాంధ్రుడు తేలప్రోలు సూర్యనారాయణ రూ.లక్ష విలువ చేసే డిజిటల్ ప్రొజెక్టర్ కిట్‌ను గురువారం అందజేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఈవో మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ప్రభుత్వంతోపాటు, దాతలు అందజేస్తున్న సహకారం హర్షణీయమన్నారు. ప్రభుత్వ పాఠశాలల అధునీకరణ విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన మెరుగైన విద్యను అందిచాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆకాంక్ష మేరకు సూర్య తన సొంత గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు ప్రొజెక్టర్‌ను అందజేశారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కారుమంచి కృష్ణ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు. తేలప్రోలు సూర్య కృషి ని తెలుసుకున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అభినందించారు. అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రభుత్వంతోపాటు, ప్రజలు భాగస్వామ్యం కావాలని ఏలూరి కోరారు.



డిజిటల్ కిట్‌ను అందజేస్తున్న సూర్య కుటుంబ సభ్యులు

చీరాలలో సీఐలకు స్థానచలనం




చీరాల, ఆగస్టు 1 : పోలీస్ అధికారుల బదిలీలలో భాగంగా ఇప్పటికే చీరాల వన్‌టైన్ సీఐగా బాధ్యతలు నిర్వహిస్తున్న శేషగిరిరావును బదిలీ చేశారు. ఆయన స్థానంలో గుంటూరు రేంజి వీఆర్‌లో ఉన్న మారీదు శ్రీనివాసరావును చీరాల వన్‌టౌన్ స్టేషన్ సీఐగా నియమించారు. ఈ నేపథ్యంలో చీరాల టూటౌన్, రూరల్ సీఐలకు కూడా స్థాన చలనం కలగనున్నట్లు సమాచారం. అందులో భాగంగా చీరాల టూటౌన్‌కు ప్రస్తుతం మార్కాపురం సీఐగా పనిచేస్తున్న ఏ.వెంకటేశ్వర్లు, రూరల్ సీఐగా ప్రస్తుతం త్రిపురాంతకం సీఐగా పనిచేస్తున్న ఎస్. సుబ్బారావు బదిలో పై రానున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ క్రమంలో ప్రస్తుం టూటౌన్ సీఐ సోమ శేఖర్, రూరల్ సీఐ నిమ్మగడ్డ సత్యన్నారాయణలకు బదిలీ అనివార్యమని తెలుస్తోంది. ఇక చీరాల డీ ఎస్పీ నూత నంగా బదిలీపై రానున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికి అందిన సమాచారం మేరకు ఆవుల శ్రీనివాసరావు నియమి తులయ్యే అవకాశం ఉంది. టెక్నికల్‌గా కొన్ని నిబంధనలను పరిగణలోకి తీసుకుని ఉన్నతాధికారులు పరిశీలిస్తు న్నట్లు తెలుస్తోంది.

మార్టూరు సీఐగా శేషగిరిరావు

మార్టూరు : మార్టూరు సీఐగా పనిచేస్తున్న రాజశేఖర్‌రెడ్డి స్థానంలో ఎస్.శేషగిరిరావును నియమించారు. ఆయన గుంటూరులో వీఆర్ నుంచి బదిలీపై మార్టూరుకు వస్తున్నారు. 2010 నుంచి ఆయన మార్టూరు ఎస్ ఐగా 20 నెలలు పనిచేశారు. శుక్రవారం ఆయన ఇక్కడ సీఐగా బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం.

పేదలకు చేయూత అభినందనీయం

అద్దంకిటౌన్, ఆగస్టు 1 : పేదలకు ఆయా సంస్థలు, వ్యక్తులు తమ వంతు సహాయ సహకారాలను అందించి వారికి చేయూత నివ్వడం అభినందనీయమని అద్దంకి సీఐ పి.కృష్ణయ్య అన్నారు. గురువారం మండలం లోని మణికేశ్వరం గ్రామంలో యునైటెడ్ హ్యూమన్ రైట్స్ అద్దంకి ఆధ్వర్యంలో ఉచిత వీల్ చైర్‌ల పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అద్దంకి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.కృష్ణయ్య హాజరై పలు వురికి వీల్‌చైర్‌లను అందజేశారు. కార్యక్ర మంలో ఐసీఎం డైరెక్టర్ సీహెచ్ ఇస్రాయేలు, పాస్టర్ ఎం.బెంజిమెన్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



వీల్ చైర్లు పంపిణీలో పాల్గొన్న సీఐ కృష్ణయ్య


నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అద్దంకి, ఆగస్టు 1 : పట్టణంలో కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసేందుకు శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఏఈ శివప్రసాద్ తెలి పారు. 14వ వార్డు, 5వ వార్డు పరిధిలో కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో ఆయా ప్రాంతా లలో విద్యుత్ సరఫరా నిలిపి వేయడం జరుగుతుందని తెలిపారు.

ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (విద్య): ఉపాధ్యాయ దినోత్సవం నాడు అందించే రాష్ట్ర, జిల్లాస్థాయి ఉపాధ్యాయ అవార్డుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విద్యాశాఖ ఏడీ గ్లోరీకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు 2024 సంవత్సరానికి రాష్ట్ర, జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు ఈనెల 10వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు డిప్యూటీ ఈవో, ఎంఈవోల ద్వారా దరఖాస్తులను డీఈవో కార్యాలయంలో అందచేయాలన్నారు. గడువు దాటిన తరువాత వచ్చిన ప్రతిపాదనలను స్వీకరించబోమన్నారు. పూర్తి సమచారం కోసం విద్యాశాఖ కార్యాలయంలోనూ లేదా www.deo.nellore.50 web.comను సంప్రదించాలని తెలిపారు.

ఈ ఫొటోలు చూశారా!? ఇదేదో ఎండిపోయిన చెరువనో లేదా నీటివనరు కోసం జరుపుతున్న తవ్వకాలనో.. అనుకుంటే పొరబడ్డట్టే. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మట్టి మాఫియా దోపిడీకి నిలువెత్తు నిదర్శనమే ఈ చిత్రాలు. అధికారం చేతిలో ఉందికదా అని కావలి ప్రాంతంలో అక్రమార్కులు రెచ్చిపోయారు. అక్రమ లేఅవుట్లు, భూ ఆక్రమణలు, ఇసుక, గ్రావెల్ ఇలా అక్రమార్జనకు కాదేదీ అనర్హం అన్నట్టుగా వైసీపీ నాయకులు వ్యవహరించారు. వీరి ధనదాహానికి కొండలు సైతం కరిగిపోయాయంటే దోపిడీ ఎలా జరిగిందో అర్థం చేసుకోవచ్చు. బోగోలు మండలంలో సాక్షాత్తు రెవెన్యూ, పోలీసు కార్యాలయాల చుట్టూనే భారీ యంత్రాల సాయంతో గ్రావెల్‌ను తవ్వి తరలించారు. ఇందుకు నిదర్శనంగా ఇప్పటికీ అక్కడ నిలువెత్తు గుంతలు దర్శనం ఇస్తు న్నాయి. ఈస్థాయిలో మట్టిమాఫియా రెచ్చిపోయినా అప్పట్లో కళ్లుండి కూడా అధికారులు ఏం చేయలేని నిస్సహాయస్థితిలో ఉండిపోయారు. అయితే, ఇప్పుడు ఎన్డీఏ ప్రభుత్వం అధికారం చేపట్టినా అక్రమార్కులపై చర్యలు తీసుకునేందుకు సాహసించలేకపోతున్నారు.





బోగోలు తహసీల్దార్ కార్యాలయం వెనుక..



తిప్ప పోలీస్‌స్టేషన్‌కు వెనుక అసైన్‌మెంట్ స్థలంలో తవ్విన గ్రావెల్ గుంతలు

గుంతలు ఇవీ.. గంతలు విప్పండి!

- వైసీపీ హయాంలో కరిగిపోయిన సహజ వనరులు
- బోగోలులో ఇష్టానుసారంగా గ్రావెల్ తవ్వకాలు
- నేతల ఒత్తిళ్లతో అధికారుల మౌనం
- ప్రభుత్వం మారినా తీరుమారదే!
- అక్రమార్కులపై చర్యలకు మీనమేషాలు

ఆంధ్రజ్యోతి పరిశీలన

కావలి/బిట్రగుంట, ఆగస్టు 1: వైసీపీ ప్రభుత్వంలో బోగోలు మండలంలో కోట్లాది రూపాయల సహజ వనరులు దోపిడీ చేసినా అప్పటి అధికారులు అధికార పార్టీకి భయపడి దోపిడీదారులకు సహకరించారు. బోగోలు మండలంలో జాతీయ రహదారికి ఇరువైపులా ప్రభుత్వ కార్యాలయాలు, పోలీస్‌స్టేషన్‌ను ఆనుకుని విలువైన సహజ సంపద దోపిడీకి గురైంది. సహజ వనరులు దోపిడీకి గురవుతున్నా అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించింది. అయితే రాష్ట్రంలో ప్రభుత్వం మారి ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చినా ప్రభుత్వ స్థలాల్లో అక్రమ గ్రావెల్ తవ్వకందారులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అక్రమ గ్రావెల్ తవ్వకాలపై అప్పట్లో ప్రతి పక్షంలో ఉన్న టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు ఆందోళనలు చేపట్టినా ఎవరూ పట్టించుకోలేదు. అయితే ఆ మూడు పార్టీల కలయికతో ఏర్పడిన ఎన్డీఏ కూటమి ప్రస్తుతం అధికారంలోకి ఉన్నా వాటిపై ఎందుకు చర్యలు తీసుకోవటంలేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

● అధికారుల సాక్షిగా..

వైసీపీ పాలనలో అధికారుల సాక్షిగా అధికార పార్టీ నాయకులు గ్రావెల్‌ను రియల్టర్లకు తరలించి సొమ్ము చేసుకున్నారు. తిప్ప పరిసర ప్రాంతాల్లో రాత్రింబవళ్లు భారీ యంత్రాల ద్వారా తవ్వి టిప్పర్లతో లోడ్‌ల కొద్దీ గ్రావెల్ నెల్లూరుకు తరలించారు. తిప్ప పోలీస్ స్టేషన్‌కు తూర్పు వైపు అసైన్డ్ భూములను కుళ్లబొడిచారు. లబ్ధిదారులను బెదిరంచి దోపిడీకి పాల్పడినా అధికారులు మాత్రం అడ్డుకోలేక పోయారు. అలాగే జాతీయ రహదారికి తూర్పు వైపు ఉన్న గురుకుల పాఠశాల వెనుక కూడా గ్రావెల్ కోసం తవ్వేశారు. జాతీయ రహదారి ఆనుకుని పడమర వైపు ఉన్న ట్రైబల్ ట్రైనింగ్ సెంటర్ భవనాన్ని ఆనుకుని ఉన్న భూములను కుళ్లబొడిచారు. మట్టి కోసం తవ్విన తవ్వకాలకు సాక్ష్యంగా ఇప్పుడున్న గుంతలే ఉంటున్నాయి. ప్రహరీ వెంబడి సుమారు ఆరేడు అడుగుల లోతు వరకు గ్రావెల్ తవ్వి తరలించారు. దీంతో వర్షాలు పడితే గోడపక్కన ఉన్న కొద్దిపాటి మట్టి కరిగి పోతే ఆ భవనం కూలే ప్రమాదం ఉంది. ఈస్థాయిలో అధికార పార్టీ నాయకులు దోపిడీకి పాల్పడితే అధికారులు మాత్రం కళ్లుండి కబోదిలా వ్యవహరించారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అలాగే ఎఫ్‌సీఐ గోదాములకు పడమర వైపు కూడా భారీ గుంతలు దర్శనం ఇస్తున్నాయి. ఈ గుంతలను చూస్తే గ్రావెల్‌ను ఏస్థాయిలో తీసుకువెళ్లారో అర్థమవుతుంది. ఈ గుంతల మూలంగా గోదాముల భవనాలు కూడా ప్రమాదాల బారిన పడే అవకాశం దుపురించింది. మరోవైపు తహసీల్దార్ కార్యాలయం వెనుక కూడా భారీ గుంతలు పెట్టి గ్రావెల్ తరలించారు. ఈ విషయం అప్పట్లో అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఒకరిపై ఒకరు చెప్పుకుని తప్పించుకునే ప్రయత్నాలు చేశారే తప్ప ప్రభుత్వ సొమ్ము దోపిడీ కాకుండా కాపాడాలనే బాధ్యత గుర్తుకు రాకపోవటం బాధాకరం.

● ప్రభుత్వం మారినా...

రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చినా అక్రమ గ్రావెల్ తవ్వకందారులపై చర్యలు తీసుకోవాలనే ఆలోచనలో ఇప్పటి పాలకులు, అధికారులు ఆలోచించడం లేదనే విమర్శలు ఉన్నాయి. కావలిలో ప్రభుత్వ ఆస్తులను ఆక్రమించి వేసిన అక్రమ లేఅవుట్లను అధికారులు సర్వే చేసి బయటకు తీస్తున్నారు. అయితే బోగోలులో మాత్రం అక్రమ గ్రావెల్ తవ్వకందారులపై చర్యలు తీసుకునేందుకు వెనుకాడుతున్నారు. ఇప్పుడున్న గుంతలను సర్వే చేసి ఎంతమేరకు గ్రావెల్ తరలించారో గుర్తించి, అక్రమార్కుల నుంచి పెనాల్టీలు, పన్నులు వసూలు చేసి ప్రభుత్వ ఖజానాకు జమ చేయిస్తే భవిష్యత్తులో అధికారం ఉందని మరొకరు సహజవనరుల దోపిడీకి తెగించరని ప్రజలు కోరుతున్నారు.

ట్రైబల్ ట్రైనింగ్ సెంటర్ భవనం గోడ ఆనుకుని..





కుడితిపాలెంలో దివ్యాంగుడు సుమన్‌కు పెన్షన్ అందజేస్తున్న కలెక్టర్ ఆనంద్

ఎన్టీఆర్ భరోసా పింఛను లబ్ధిదారుల జీవనానికి ఆసరా

● జిల్లా కలెక్టర్ ఆనంద్ వెల్లడి

ఇందుకూరుపేట, ఆగస్టు 1: ఎన్టీఆర్ భరోసా పింఛను లబ్ధిదారులకు ఆసరా అని జిల్లా కలెక్టర్ ఆనంద్ తెలిపారు. మండలంలోని కుడితిపాలెం, ముదివర్తిపాలెం, నిడుముసలి గ్రామాల్లో జిల్లా కలెక్టర్ ఆనంద్ ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశా రు. గురువారం మండలంలో పర్యటించిన కలెక్టర్ వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు పింఛన్లను అందజేశారు. కలెక్టర్ గ్రామానికి వచ్చి పింఛను అందించడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో సాయి లహరి, తహసీల్దారు జగదీష్, సచివాలయ అధికారులు పాల్గొన్నారు.

96.71 శాతం పెన్షన్ల పంపిణీ

నెల్లూరు (హరనాథపురం): జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ గురువారం 96.71 శాతం జరిగింది. మొత్తం 3,11,540 పెన్షన్లకు గాను 3,01,280 పెన్షన్లను పంపిణీ చేశారు. ఇంకా 10,260 మందికి పెన్షన్లను అందజేయాల్సి ఉంది. శుక్రవారం వీరికి పంపిణీ చేయనున్నారు.

59 మందికి షోకాజ్ నోటీసులు

వరికుంటపాడు: నిబంధనలకు విరుద్ధంగా పింఛన్ల పంపిణీలో అలసత్వం ప్రదర్శించిన 59 మంది ఉద్యోగులకు గురువారం ఎంపీడీవో వెంకటకృష్ణ కుమారి షోకాజ్ నోటీసులు అందజేశారు. ఉదయం 6 గంటలకు పంపిణీ ప్రక్రియ ప్రారంభించాలని ఆదేశాలు ఉన్నా ఏమాత్రం పట్టించుకోని సదరు ఉద్యోగులు గంటల తరబడి ఆలస్యంగా పంపిణీని చేపట్టారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు క్రమశిక్షణ చర్యల్లో భాగంగా మూడు రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని కోరుతూ 12 సచివాలయాల పరిధిలోని ఉగ్యోగులకు షోకాజ్ నోటీసులు అందజేశారు.

నిషేధిత జాబితాలోకి ప్రభుత్వ భూములు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నెల్లూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): నిషేధిత జాబితాలో నుంచి తొలగించి రూ.100 కోట్ల విలువైన ప్రభుత్వ భూములను తిరిగి 22-ఏ జాబితాలోకి చేరుస్తూ కలెక్టర్ ఓ ఆనంద్ ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో నెల్లూరు రూరల్ మండలం గుడిపల్లిపాడు రెవెన్యూ పరిధిలోని కోడూరుపాడు వద్దనున్న సర్వే నెం.521, 525, 527, 529-ఏలలోని సుమారు 21 ఎకరాలను నిషేధిత జాబితాలో చేర్చారు. జూలై 13వ తేదీన 'ఎవరు చేశారు.. ఎందుకు చేశారు..?' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై కలెక్టర్ స్పందించారు. ఈ వ్యవహారంపై పూర్తిస్థాయి నివేదిక అందజేయాలని నెల్లూరు ఆర్డీవో, నెల్లూరు రూరల్ తహసీల్దార్‌ను ఆదేశించారు. అవి ప్రభుత్వ భూములేనని, సుప్రీంకోర్టులో కూడా కేసు నడుస్తోందని ఆర్డీవో, తహసీల్దార్ నివేదించారు. వెంటనే ఆ భూములను తిరిగి 22-ఏ జాబితాలోకి చేర్చాలంటూ ఆదేశించడంతో బుధవారం ఆ ప్రక్రియను రెవెన్యూ అధికారులు పూర్తి చేశారు. దీంతో ప్రభుత్వ భూములను కొట్టేయాలని అక్రమార్కులు వేసిన స్కెచ్ విఫలమైంది. కాగా ప్రభుత్వ భూములను తిరిగి నిషేధిత జాబితాలో చేర్చడం వరకూ బాగుంది కానీ ఈ పని ఎవరు చేశారు? ఎందుకు చేశారు? అన్నది మాత్రం వదిలేశారు. బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటే మరొకరు ఇటువంటి పనులు చేసేందుకు భయపడతారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

రైతుబజార్లలో తక్కువ ధరకు బియ్యం, కందిపప్పు



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్చార్జి జేసీ సూర్యతేజ

నెల్లూరు (హరనాథపురం), ఆగస్టు 1: రైతు బజార్లలో తక్కువ ధరకే కందిపప్పు, బియ్యంను ప్రజలకు అందజేయనున్నట్లు ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ సూర్యతేజ చెప్పారు. గురువారం తన చాంబర్‌లో రైస్‌మిల్లర్లు, దాల్ మిల్లర్ల అసోసియేషన్ నాయకులతో ఆయన సమావేశమయ్యారు. బహిరంగ మార్కెట్‌లో కందిపప్పు కిలో రూ.181 ఉండగా, రైతు బజార్లు, భారీ సంస్థాగత రిటైల్ దుకాణాల ద్వారా రూ.150కే విక్రయిస్తున్నట్లు తెలిపారు. కేజీ స్టీమ్ బియ్యాన్ని రూ.48లకు, పచ్చి బియ్యం రూ.47లకు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కందుకూరు సబ్ కలెక్టర్ విద్యాధరి, ఆర్డీఓలు మలోల, శీనానాయక్, మధులత, డీఎస్‌ఓ వెంకటరమణ, సివిల్ సప్లయిస్ డీఎం నరసింహం తదితరులు పాల్గొన్నారు.

'సోమశిల'కు చేరిన కృష్ణా జలాలు

అనంతసాగరం, ఆగస్టు 1: సోమశిల ప్రాజెక్టు ఎగువ నుంచి కృష్ణా జలాలు గురువారం చేరాయి. ప్రస్తుతం 3వేల క్యూసెక్కుల వరద వస్తుండగా భవిష్యత్తులో మరింత పెరగవచ్చని అధికారులు తెలిపారు. కాగా, జలాశయం పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 9.471 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 200, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

పిల్లల బడిలో పెద్దల పాలనకు సన్నాహాలు

- పాఠశాలల్లో విడుదలైన నోటిఫికేషన్
- 8న ఎస్ఎంసీ ఎన్నికల నిర్వహణ

నెల్లూరు (విద్య): ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ కమిటీలు (ఎస్ఎంసీ) ఎన్నికల ప్రక్రియకు సంబంధించి గురువారం నోటిఫికేషన్ విడుదలైంది. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో ఓటర్ల జాబితాలను నోటీస్ బోర్డుల్లో ఉంచారు. ఈ నెల 5వతేదీ ఉదయం 9 నుంచి 1 గంట వరకు ఓటర్ల జాబితాలపై అభ్యంతరాలు స్వీకరిస్తారు. అదే రోజు సాయంత్రం తుది ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు పరిష్కరించి ఫైనల్ జాబితా విడుదల చేస్తారు. 8వ తేదీ మధ్యాహ్నం వరకు ఎన్నికలు, 3 నుంచి 4 గంటల సమయంలో ఎన్నికైన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించి తొలి సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నారు. ప్రతి పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ముగ్గురు చొప్పున సభ్యులను ఎన్నుకుంటారు. తరగ తుల వారీగా తల్లిదండ్రులను సమావేశ పరిచి చేతులు ఎత్తే పద్ధతిలో సభ్యులను ఎన్నుకుంటారు. పోటీ తీవ్రంగా ఉంటే రహస్య ఓటింగ్ నిర్వహిస్తారు. అలా ఎన్నికైన సభ్యుల నుంచి చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎంపిక చేస్తారు. మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గాల వారికి కమిటీల్లో ప్రాధాన్యం ఉంటుంది. ఎక్స్‌అఫిషియో సభ్యులుగా పాఠ శాల హెచ్ఎంలు ఉంటారు. ఎన్నికల ప్రక్రియ ను విద్యాశాఖ అధికారులతో పాటు ఎంపీడీఓ, తహసీల్దారు కార్యాలయాల అధికారులు పర్యవేక్షి స్తారు. జిల్లాలో ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎన్నికలను పకడ్బందీగా నిర్వహిస్తామని డీఈఓ రామారావు, ఎస్ఎస్ఏ ఏపీసీ ఉషారాణి తెలిపారు.



సీతారామపురంలో ఓటర్ల జాబితాను ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులు

సమస్యలన్నీ పరిష్కరిస్తా!

- ఎవరూ ఆందోళన చెందొద్దు!
- ప్రత్యేక పరిష్కార వేదికలో మంత్రి నారాయణ
- కార్పొరేషన్‌లో సాయంత్రం వరకు అర్జీల స్వీకరణ

నెల్లూరు(సిటీ), ఆగస్టు 1: 'ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరంలేదు. ప్రశాంతంగా కూర్చోండి. నేనే మీవద్దకు వచ్చా. మీ సమస్య ఏమిటో చెప్పండి. పరిష్కారం నేను చూపిస్తా' నంటూ రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ నగర వాసులకు విజ్ఞప్తి చేశారు. గురువారం కార్పొరేషన్ కార్యాల యంలో జరిగిన ప్రత్యేక ప్రజా విజ్ఞప్తుల పరిష్కార వేదికలో కమిషనర్ ఎం సూర్యతేజ, రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డితో కలిసి మంత్రి అర్జీలు స్వీకరించారు. పలు ప్రాం తాల నుంచి వచ్చి బాధితులు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు వినతులు అందించారు. వాటన్నిటినీ స్వీకరించి వెంటనే పరి ష్కార మార్గాలు చూపాలని అక్కడున్న అధికారు లను ఆదేశించారు. న్యాయస్థానాలతో ముడిపడి ఉన్నవి తప్ప మిగిలిన సమస్యలన్నీ అర్ధరాత్రిలోపు, వీలు కాకపోతే శుక్రవారం నాటికి పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. అనంతరం మాట్లాడిన మంత్రి వారం తరువాత మళ్లీ ప్రజల సమస్యల పరిష్కారాల కోసం వేదికను నిర్వహిస్తామని ప్రకటిం చారు. ప్రతి నెల ఇలాంటి కార్యక్రమాలు క్రమం తప్పకుండా నిర్వహించ డం జరుగుతుందని, రాష్ట్రంలోని అన్ని మున్సి పల్ ప్రాంతాలలో ఉంటాయని, ప్రయోగాత్మకంగా నెల్లూరులోని మొదలుపెట్టి నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సిటీప్లానింగ్ విభాగం రాష్ట్ర డైరెక్టర్ విద్యులత, ఎన్ఎంసీ అధికారులు పాల్గొన్నారు. అనంతరం రైతు బజార్లలో అందించ బోయే సరసమైన ధరలకు సరుకుల వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. కందుకూరు సబ్‌కలెక్టర్ విద్యాధరి మంత్రి నారాయణను మర్యాదపూర్వకంగా కలిశారు.



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న మంత్రి నారాయణ తదితరులు

● మెరుగైన పాలనకు టైం ఇవ్వండి

రాష్ట్రంలోని ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకు ప్రజలు కాస్త టైం ఇవ్వాలని మంత్రి నారాయణ అన్నారు. నెల్లూరులోని 48వ డివిజన్, పొర్లుకట్ట ప్రాంతాలలోని పింఛన్లను పంపిణీ చేశారు. రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థను వైసీపీ చిన్నాభిన్నం చేసిందని దానిని గాడినపెట్టేపనిలో ఉన్నామని అన్నారు. ప్రజలు ఓర్పుగా కాస్త సమయం ఇస్తే మెరుగైన పథకాలు, పాలనను అందిస్తామన్నారు. ఈ నెల 15 నుంచి తిరిగి అన్న క్యాంటీన్లు ప్రజలకు అందుబాటులోకి వస్తాయన్నారు. అనంతరం పొర్లు కట్ట నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

కార్యకర్తలని టచ్ చేస్తే ఊరుకోను

- దర్గామిట్ట సీఐపై రూరల్ ఎమ్మెల్యే ఆగ్రహం
- కార్పొరేషన్ కార్యాలయంలో ఉద్రిక్తత

నెల్లూరు(సిటీ): 'కార్యకర్తలని టచ్ చేస్తే ఊరుకోను. ప్రజా విజ్ఞప్తుల దినంలోకి వెళ్లొద్దనేందుకు నువ్వెవ్వరు? అసలు నీ... పెత్తనమేంది...?' అంటూ నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి దర్గమిట్ట సీఐ అల్తాఫ్ హుసేన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన ప్రత్యేక ప్రజావిజ్ఞప్తుల పరిష్కార వేదిక వద్దకు కార్పొరేటర్లు, టీడీపీ నాయకులు, కార్య కర్తలతో కలిసి ఎమ్మెల్యే వచ్చారు. కార్యాలయంలోకి అనుమతిలేదంటూ సీఐ అల్తాఫ్‌హుసేన్ అభ్యంతరం వ్యక్తం చేసి కార్యకర్తలు, నాయకులు బయట ఉండాలని సూచించారు. దీంతో జోక్యం చేసుకున్న శ్రీధర్‌రెడ్డి వారిని ఆపేందుకు నువ్వెవరు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంతలో కార్యకర్తలు, నాయకులు జోక్యంతో ఉద్రిక్తంగా మారింది. పోలీసులు వారందరిని బయటకు నెట్టేయగా శ్రీధర్ రెడ్డి మరింతగా కోపోద్రిక్తులై పోలీసులను నిలదీశారు. ఇంతలో డీఎస్పీ జోక్యం చేసుకుని సర్దుబాటు చేయగా లోపలున్న మంత్రి నారాయణ, కమిషనర్ ఎం సూర్యతేజలకు శ్రీధర్‌రెడ్డి పరిస్థితిని వివరించారు. సీఐపై తప్పకుండా చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీఇవ్వడంతో ఎమ్మెల్యే శాంతించారు. దర్గామిట్ట సీఐ ఇంకా వైసీపీ మత్తులోనుంచి బయటకు రాలేదంటూ నాయకులు మధన్‌కుమార్, అరవ శీను ఆక్షేపించారు.



సీఐ అల్తాఫ్‌హుసేన్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే

ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ


ఆత్మకూరులో పింఛన్లు పంపిణీ చేస్తున్న తుమ్మల చంద్రారెడ్డి

ఆత్మకూరు, ఆగస్టు 1: మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో టీడీపీ పట్టణాధ్యక్షుడు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ తుమ్మల చంద్రారెడ్డి సచివాలయ సిబ్బందితో కలిసి గురువారం లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. 10వ వార్డులో ఆత్మకూరు మాజీ ఉప సర్పంచ్ చల్లా రవికుమార్‌రెడ్డి పాల్గొన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ సర్దార్, కౌన్సిలర్లు, నేతలు వార్డుల్లో పింఛన్లు పంపిణీ చేశారు.

ఉదయగిరి రూరల్:17పంచాయతీల్లో 95శాతం మంది లబ్ధిదారులకు పింఛన్ల నగదు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో దేవరకొండ ఈశ్వరమ్మ గురువారం తెలిపారు. ఉదయగిరి, కొండాయపాళెం పంచాయతీల్లో జరిగిన కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ బయ్యన్న, పార్టీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి, రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు షేక్ రియాజ్ పాల్గొన్నారు.


అనంతసాగరం : గౌరవరంలో నగదు అందిస్తున్న సర్పంచి సుబ్బారావు

సంగం: మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో ఈ నెల పింఛన్ పంపిణీ కార్యక్రమం లో టీడీపీ నేతలు జోరుగా పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొమ్మి లక్ష్మయ్య నాయుడు తరుణవాయి, ఉడ్ హౌస్‌పేటలో ఇంటింటికి వెళ్లి పింఛన్లు అందజేశారు. మండలాధ్యక్షుడు గుండ్లపల్లి శ్రీనివాసులు యాదవ్, రాజేష్‌రెడ్డి పాల్గొన్నారు.


సంగం : తరుణవాయిలో పంపిణీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్య నాయుడు

వింజమూరు: గుండెమడకలలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం గ్రామ హైస్కూల్‌ను సందర్శించారు. మండల కన్వీనర్ గొంగటి రఘునాథ్ రెడ్డి, నర్సారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, పాల్గొన్నా రు.

వరికుంటపాడు: 24పంచాయతీల్లో 96శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో వెంకట కృష్ణకుమారి తెలిపారు. 4,281 మందిలో 4,100 మందికి ఇంటింటికి వెళ్లి పింఛన్ల నగదులను అందజేశామన్నారు. అలాగే పెద్దిరెడ్డిపల్లి సచివాలయ సర్వేయర్ కాశె కొండయ్య నెల్లూరు వైద్యశాలకు వెళ్లి గ్రామానికి చెందిన గుర్రం సుబ్బారావుకు నగదుతో పాటు మరో రూ.10వేలను సొంతంగా అందజేశాడు. ఈయన కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు.

చేజర్ల: టి.కే.పాడు, పాతపాడులో చేపట్టిన


వింజమూరు : గుండెమడకలలో పింఛన్ల పంపిణీలో పాల్గొన్న ఎమ్మెల్యే సురేష్

పింఛన్ల పంపిణీలో నియోజక వర్గమాజీ శాసన సభ్యుడు కొమ్మి లక్ష్మయ్యనాయుడు పాల్గొన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు రావి లక్ష్మీ నరసారెడ్డి, మాజీ ఎంపీపీ అన్నలూరు శ్రీనివాసుల నాయుడు, రమేష్‌నాయుడు పాల్గొన్నారు.

అనంతసాగరం: 25 గ్రామ పంచాయతీలో పింఛన్ల పంపిణీ అట్టహాసంగా నిర్వహించారు. తొలిరోజు 96శాతం పూర్తి చేసిన్నట్లు ఎంపీడీవో తాజ్‌మస్రూర్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సీతారామపురం: స్థానిక హరిజనవాడలో పార్టీ మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్ రాజు, సీతారామపురం సర్పంచి కొడవటికంటి భాగ్యకుమారిలు పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్ర మంలో మండల క్లస్టర్ ఇన్‌చార్జి వెంకటేశ్వర్లు, చెన్నకేశవులు, దేవర వెంకటేశ్వర్లు, జాషువా, వెంకటయ్య, కిరణ్, రాజేష్, మాల్యాద్రి, మనోజ్ పాల్గొన్నారు. 93.5 శాతం పంపిణీ చేసినట్లు ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్ తెలిపారు.


వరికుంటపాడు : పింఛన్ అందిస్తున్న సర్వేయర్ కొండయ్య

చిత్రపటాల అందజేత

చేజర్ల, ఆగస్టు 1: ఆదురుపల్లిలోని ప్రభుత్వ కార్యాలయాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చిత్రపటాలను స్థానిక నాయకులు చీర్ల వెంకటేశ్వర్లు అందజేశారు. కార్యక్రమంలో చీర్ల వెంకటయ్య, ఎన్.పెంచలయ్య, అంకయ్య పాల్గొన్నారు.

శ్మశాన స్థలం మంజూరు చేయండి


ఇన్‌చార్జి తహసీల్దార్ గిరీష్‌కు వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

అనంతసాగరం, ఆగస్టు 1: స్థానిక గిరిజన కాలనీలోని 100కుటుంబాలకు శ్మశాన స్థలం కేటాయించాలని సీపీఎం నాయకులు గురువారం ఇన్‌చార్జి తహసీల్దారు గిరీష్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు అన్వర్‌బాష, కాలనీ వాసులు పాల్గొన్నారు.

సాధారణ సమావేశంలో ఏకగ్రీవ తీర్మానాలు

వింజమూరు, ఆగస్టు 1 : శంఖవరం గ్రామ పంచాయతీ సాధారణ సమావేశం గురువారం సర్పంచ్ బోగిరెడ్డి మల్లేశ్వరి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పారిశుధ్య మెరుగు, వీధి దీపాలు డ్రైనేజీ, మంచినీటి సౌకర్యం తదితర అంశాలపై ప్రతిపాదనలు చేశారు. వాటికి పంచాయతీ సభ్యులు ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సురేష్, బోగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ముర్రుపాలతో వ్యాధి నిరోధకశక్తి

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), ఆగస్టు 1: తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని, బిడ్డ పుట్టిన అరగంటలోపు ముర్రుపాలు తాపిస్తే పిల్లల్లో వ్యాధినిరోధకశక్తి పెరుగుతుందని దుత్తలూరు ప్రాథమిక కేంద్ర ఆరోగ్య బోధకురాలు టీబీజాన్ సూచించారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గురువారం సోమలరేగడ మెయిన్ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాలపై గర్భవతులు, బాలింతలకు అవగాహన కల్పించారు. పిల్లలకు పాలిస్తే అందం తరగిపోతుందనే అపోహలు నమ్మవద్దన్నారు. తల్లిపాలు బిడ్డకు అమృతం లాంటివన్నారు. పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యవంతంగా ఉండాలన్నారు. ఆరోగ్య పర్యవేక్షకులు ఖాజామొహిద్దీన్, ఏఎన్‌ఎం చంద్రావతి, ఆరోగ్య కార్యకర్త అరాఫత్, మహిళా పోలీసు షబానా, అంగన్‌వాడీ కార్యకర్త లక్ష్మమ్మ పాల్గొన్నారు.

గంధోత్సవానికి ఎంపీ, ఎమ్మెల్యేల రాక

ఉదయగిరి రూరల్, ఆగస్టు 1: స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో వెలసిన హజరత్ ఖ్వాజాషా సయ్యద్ అబ్దుల్ ఖాదర్‌ఖాన్ సాహెబ్ ఖాదరీ ఔలియా గంధోత్సవం శనివారం నిర్వహించనున్నట్లు, ఈ ఉత్సవాలకు నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఉదయగిరి, కావలి శాసన సభ్యులు కాకర్ల సురేష్, దగుమాటి కృష్ణారెడ్డిలు హాజరవుతున్నట్లు దర్గా కమిటీ చైర్మన్ రోజ్‌ధార్ మన్సూర్, టీడీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షులు రియాజ్‌లు పేర్కొన్నారు. గురువారం దర్గా ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. భక్తులకు అసౌకర్యం లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో ఖాదర్‌బాషా, సికిందర్, లియాఖత్, ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

యువకులే పారిశుధ్య కార్మికులు

ఉదయగిరి రూరల్, ఆగస్టు 1: స్థానిక దిలావర్ భాయ్‌వీధిలోని మురుగు కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోయి రోడ్లపై నీరు పారుతుంది. ఈ విషయాన్ని గుర్తించిన యువకులు స్పందించారు. గురువారం కాలువలను శుభ్రం చేశారు. వీధిలో ఎక్కడపడితే అక్కడ చెత్త పేరుకుపోయిన చెత్తను తొలగించారు.

కరపత్రాల ఆవిష్కరణ

ఆత్మకూరు, ఆగస్టు 1: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) స్థాపించి 80ఏళ్లు పూర్తయిన సందర్భంగా నెల్లూరు టౌన్‌హాలులో ఈ నెల 10న నిర్వహించనున్న విద్యా, వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ వెంకటేశ్వర్లురెడ్డి, జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి కోరారు. గురువారం కరటంపాడు, మహిమలూరు, అప్పారావుపాళెం, బట్టేపాడు, మురగళ్ల పాఠశాలల్లోని ఉపాధ్యాయులను కలిసి కరపత్రాలను అందజేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఎన్నికల కమిటీ సభ్యుడు సీహెచ్ మల్లికార్జునరెడ్డి, ఏపీటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నాయకుల సంబరాలు


ఉదయగిరిలో పాలభిషేకం నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఉదయగిరి రూరల్, ఆగస్టు 1: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడంతో గురువారం ఉదయగిరి పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో ఎమ్మార్పీఎస్ నాయకులు సంబరాలు చేసుకున్నారు. బాణ సంచా కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. ఎమ్మార్పీఎస్ వ్యవ స్థాపకులు మంద కృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు బకీరు జాషువా, బెజవాడ బాలగురవయ్య, అశోక్, పెంచలయ్య, ఇత్తడి రమణయ్య, ఆవుల రోశయ్య, నల్లిపోగు నరసింహ పాల్గొన్నారు.

కలువాయి: స్థానిక బస్టాండులోని అంబేద్కర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మంద కృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. బాణసంచా కాల్చి స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు దండు పెంచలయ్య, నరసింహులు, ఏడీపీయస్ నాయకులు నిజమాల ప్రసాద్ పాల్గొన్నారు.

వింజమూరు: ఎమ్మార్పీఎస్ ఉద్యమకారులు, మండల ఎంఎస్పీ అధ్యక్షుడు గంగపట్ల సురేష్ మాదిగ ఆధ్వర్యంలో బంగ్లా సెంటర్‌లోని బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అశోక్‌నగర్ కాలనీలో సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు మల్లెల తిరుమలేశుమాదిగ, ఎంఎంఎస్ జిల్లా అధ్యక్షురాలు మంద సుజాతమాదిగ, గంగపట్ల మురళీ మాదిగ, గంగపట్ల నాగరాజు మాదిగ పాల్గొన్నారు.


కలువాయిలో సంబరాలు చేసుకుంటున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలకు నోటిఫికేషన్

ఉదయగిరి రూరల్, ఆగస్టు 1: మండలంలోని 60ప్ర భుత్వ పాఠశాలల్లో యాజ మాన్య కమిటీ ఎన్నికల నిర్వహ ణకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఎంఈవో షేక్ మస్తా న్‌వలి తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన విలేక రులతో మాట్లాడారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి తరగతుల వారీగా ఓటర్ల జాబితా చేశామన్నారు. 5న ఫిర్యాదులపై అభ్యం తరాల స్వీకరణ, నోటీసు బోర్డుపై తుది ఓటర్ల జాబితా ప్రదర్శిస్తామని చెప్పారు. ప్రతి తర గతి నుంచి ముగ్గురు సభ్యులను ఎన్నుకుంటామన్నారు. 8న ఎస్ఎంసీ సభ్యుల ఎన్నిక, అ నంతరం చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక జరుగుతుందన్నారు. అదేరోజు సభ్యుల ప్రమాణ స్వీకారం, తొలి సమావేశం నిర్వహిస్తామన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలని ప్రధానోపాధ్యాయులకు సూచించినట్లు తెలిపారు.

వరికుంటపాడు: ఎస్ఎంసీ ఎన్నికలకు సంబంధించి గురువారం పాఠశాలల్లో ఎన్నికల నోటిఫికేషన్‌ను ప్రధానోపాధ్యాయులు విడుదల చేశారు. విద్యార్థుల తల్లిదండ్రుల జాబితాలో అభ్యంతరాలు ఉంటే ముందస్తుగా తెలియజేయాలన్నారు. ఈ నెల 8న మండలంలోని 8ఉన్నత, 4 ప్రాథమికోన్నత, 46 ప్రాథమిక పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నారు. అందులో భాగంగా తొలుత ఒక్కో తరగతికి ముగ్గురిని చొప్పున ఎన్నికుంటారు. అనంతరం ఎన్నికైన సభ్యుల నుంచి ఓటింగ్ ద్వారా చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకుంటారు.

సీతారామపురం: ఆదర్శ పాఠశాలలో తల్లిదండ్రుల కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, ఎన్నికకు గురువారం ఓ ప్రకటన విడుదల చేసినట్లు పాఠశాల ప్రిన్సిపల్ ఎస్ఎం రెహమాన్ తెలిపారు. పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి విద్యార్థుల తలిదండ్రుల జాబితాను ప్రదర్శించామన్నారు. ఈ నెల 5వ తేదీ 1గంటలోపు తల్లిదండ్రులు ఫిర్యాదు చేస్తే స్వీకరిస్తామని తదుపరి సాయంత్రం 4 గంటలకు పూర్తిస్థాయి ఓటర్ల జాబితాను ప్రకటిస్తామన్నారు. 8వ తేదీన ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సభ్యుల ఎన్నిక , అనంతరం చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక జరుగుతుందన్నారు.

కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులు

● గ్రామాల్లో అవగాహన సదస్సులు ● రుణ లక్ష్యం రూ.11.42 కోట్లు

ఆత్మకూరు, ఆగస్టు 1: సాగుచేసే రైతుల్లో ఎక్కువ మంది కౌలు రైతులు ఉన్నా.. వైసీపీ ప్రభుత్వ హయాంలో చాలా మందికి గుర్తింపు కార్డులు అందక అవస్థలు పడ్డారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మండలాల వారీగా లక్ష్యాలు నిర్దేశించి అర్హులైన కౌలురైతులందరికీ సీసీఆర్సీ (క్రాప్ కల్టివేటర్ రైట్స్ కార్డు) కార్డులు ఇవ్వాలని ఆదేశించింది. ఈ క్రమంలో వ్యవసాయశాఖ చర్యలు చేపట్టింది. కౌలురైతులకు సీసీఆర్సీ కార్డులపై అధికారులు అవగాహన కల్పించే కార్యక్రమాలను వేగవంతం చేశారు.

● ఆత్మకూరు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని మూడు మండలాల్లో 3,473 హెక్టార్లలో కౌలు రైతులు పంటలు సాగు చేస్తున్నారు. వీరికి ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు, రాయతీలు అందాలంటే పంటసాగు పత్రం(సీసీఆర్సీ) తప్పనిసరిగా ఉండాలి. ఈ కార్డు పొందాలంటే భూయజమాని అంగీకార సంతకం చేయాలి. అలా చేస్తే ఇబ్బందులు వస్తాయని పలువురు రైతులు వెనుకంజ వేస్తున్నారు. వారి అనుమానాలు నివృత్తి చేసేలా అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

● 3011 మందికి కార్డులు జారీ చేయాలని లక్ష్యం

ఆత్మకూరు మండలంలో 1101 మంది కౌలు రైతులు, ఏఎస్‌పేట మండలంలో 871 మంది, అనంతసాగరం మండలంలో 1,038 మందికి సీసీఆర్సీ కార్డులు మంజూరు చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. ఇప్పటివరకు 1,500 మందిని గుర్తించారు. కౌలు రైతులకు ఈ ఏడాదికి రూ.11.42 కోట్లు మేర రుణాలు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

ఎలా మంజూరు చేస్తారంటే...

పొలం యజమాని, కౌలురైతు ఇద్దరూ ఒప్పంద సంతకాలు చేసుకున్న తరువాత వీఆర్‌వో కార్డు జారీ చేస్తారు. యజమాని అందుబాటులో లేకుంటే ఆయన ధ్రువీకరించిన వ్యక్తి ఈ ఒప్పంద పత్రంలో సంతకం చేయవచ్చు. లేదా ఈ మెయిల్ ద్వారా కూడా తన అంగీకార పత్రాన్ని అందించవచ్చు.

● అర్హులందరికీ కార్డులు అందజేస్తాం: దేవసేనమ్మ, ఏడీఏ, ఆత్మకూరు

అర్హులైన కౌలు రైతులందరికీ సీసీఆర్సీ కార్డులను అందజేస్తాం. ఈ కార్డులతో భూయజమానులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని అవగాహన కల్పిస్తున్నాం. కార్డులు పొందిన వారిలో కాలపరిమితి ముగిస్తే తిరిగి పునరుద్ధరిస్తాం. భూమిని కౌలుకు తీసుకున్న రైతులు ఎప్పుడైనా అగ్రిమెంట్ చేసుకుని సీసీఆర్సీ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

పింఛన్ల పంపిణీ
చారిత్రాత్మక ఘట్టం

కావలి, ఆగస్టు 1: రాష్ట్రంలో ఏన్డీయే కూటమి అధికారంలోకి వచ్చాక చేపట్టిన పింఛన్ల పంపిణీ కార్యక్రమం దేశ చరిత్రలో చారిత్రాత్మక ఘట్టమని, ఈ ఘనత సీఎం చంద్రబాబు నాయుడికే దక్కిందని ఎమ్మెల్యే దగుమాటి క్రిష్టారెడ్డి కొనియాడారు. పట్టణంలోని 2, 3, 18, 19 వార్డుల్లో గురువారం చేపట్టిన పింఛన్ల పంపిణీ కార్యక్ర మంలో ఎమ్మెల్యే పాల్గొని మా ట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పట్టణంలో తాగునీటి సరఫరాలోని ఇబ్బందులు తొలగించామన్నారు. రూ8 కోట్లతో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణం చేపడతామ న్నారు. కావలి-తుమ్మలపెంట రోడ్డు పనులకు సెప్టెంబరు 1న శంకుస్థాపన చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.


కావలి: పింఛన్లు ఇస్తున్న ఎమ్మెల్యే క్రిష్టారెడ్డి

● అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

అనంతరం పట్టణంలోని 19వ వార్డు అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎమ్మెల్యే తనిఖీ చేశారు. అక్కడకు సమయానికి ఉద్యోగుల రాకపోవటంతో 40 మంది పిల్లల్లో నలుగురు మాత్రమే రావ డంతో ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం జనతాపేటలోని 31వ వార్డు అర్బన్ హెల్త్‌సెంటర్ భవనాలను పరిశీలించారు. కార్యక్రమాలలో ఆర్డీవో శీనానాయక్, మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్ కుమార్, డీఎస్పీ వెంకట రమణ టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ క్రిషోర్, జ్యోతి బాబూరావు, మొగిలి కల్లయ్య, శానం హరి, ఏగూరి చంద్రశేఖర్, రమణయ్య, తోట వెంకటేశ్వర్లు, సన్నిబోయిన కమల్, బీజేపీ పట్టణాధ్యక్షుడు బ్రహ్మానందం, జనసేన పట్టణాధ్యక్షుడు పొబ్బాసాయి విఠల్ పాల్గొన్నారు.

పింఛన్‌దారుల కళ్లలో ఆనందం : ఎమ్మెల్యే కాకర్ల

కలిగిరి: ముఖ్యమంత్రి చంద్రబాబు పెంచిన పింఛను అందుకుంటున్న అవ్వతాతల కళ్లలో ఆనందం చూస్తున్నట్లు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తెలిపారు. నాగసముద్రంలో గురువారం జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రంగసుబ్బరాయుడు, మండల విస్తరణాధికారి వెలుగోటి మధు, వీఆర్వో హజరత్తయ్య, బిజ్జం కృష్ణారెడ్డి, బీవీ రామారావు, చీమల తాతయ్య, యర్రగుంట రమణారెడ్డి, నరసాల మాల్యాద్రి పాల్గొన్నారు. ఏపీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ మెట్టుకూరు చిరంజీవి రెడ్డి అనంతపురంలో జరిగిన పింఛన్ల పంపిణీలో పాల్గొన్నా రు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

● **అల్లూరు** : మండలంలో గురువారం చేపట్టిన పింఛన్ల పంపిణీ కార్యక్రమం 96.41 శాతం పూర్తయినట్టు ఎంపీ డీఓ జ్యోతి తెలిపారు. 264 మంది మినహా మిగిలిన వారందరికీ పింఛన్ల నగదు అందజేశామన్నారు.


లింగసముద్రంలో దివ్యాంగుడికి పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

లింగసముద్రం: అన్నిరకాల పింఛన్లను పెంచి అందించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును ప్రతి లబ్ధిదారుడు గుర్తుంచుకోవాలని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు చెప్పారు. గురువారం లింగసముద్రం గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక ప్రసన్న వెంకటేశ్వరస్వామి, అంకమ్మతల్లి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి స్వయంగా పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ఇటీవల వివాదానికి కారణమైన ఆర్అండ్‌బీ స్థలాన్ని పరిశీలించి ఇందులో ప్రభుత్వ స్థలమని బోర్డు ఏర్పాటు చేయాలని ఎంపీడీఓ కె శ్రీనివాసులను ఆదేశించారు. ఈ సందర్భంగా పలువురు ఆయనకు అర్జీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు వేముల గోపాలరావు, మండల తెలుగు యువత అధ్యక్షుడు అడపా రంగయ్య, గ్రామ పార్టీ అధ్యక్షుడు అడపా రంగయ్య, గ్రామ పార్టీ అధ్యక్షుడు గాలంకి ప్రసాద్, మండల తెలుగు రైతు అధ్యక్షుడు మద్దెల రామారావు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు తాళ్లూరి ముసలయ్య తదితరులు పాల్గొన్నారు.


నాగసముద్రంలో పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే కాకర్ల


కొండాపురం: పింఛన్ల పంపిణీలో టీడీపీ నాయకులు, సిబ్బంది

పింఛన్ల పంపిణీ 95 శాతం పూర్తి

కొండాపురం: ఎన్టీఆర్ సామాజిక భరోసా పింఛన్లు గురువారం మండలంలో 95 శాతం పంపిణీ జరిగినట్లు ఎంపీడీవో సుజాత తెలిపారు. మండలంలోని 19 పంచాయతీలకు సంబంధించి 5,457 మంది లబ్ధిదారులుండగా 5,152 మందికి నగదు పంపిణీ చేశామన్నారు. మిగిలిన 305 మందికి త్వరలో అందజేస్తామన్నారు. మండల కన్వీనర్ ఎమ్.ఓంకారం పార్లపల్లి, భీమవరప్పాడు, సాయిపేట, రేణమాల గ్రామాల పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

బిట్రగుంట: విశ్వనాథరావుపేట పంచాయతీలోని రామస్వామిపాలెం గిరిజన కాలనీలో ఎమ్మెల్యే క్రిష్టారెడ్డి పింఛన్ పంపిణీ చేపట్టారు. కాలనీకి చెందిన కొందరు గిరిజనులు ఎమ్మెల్యేను కలిసి, తమ సమస్యలపై ఏకరువు పెట్టారు. త్వరలో ఇళ్ల మంజూరు చేయిస్తామని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. కాలనీలో శిథిలావస్థకు చేరిన కొన్ని ఇళ్ల మొండి గోడలను తొలగించేలా చర్యలు చేపట్టాలని అఖిల భారత మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు దాసరి సునీల్, జిల్లా కార్యదర్శి తిరుమల, సంయుక్త కార్యదర్శి బత్తుల రవిచంద్ర కోరుతు ఎమ్మెల్యేకి వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు, బీజేపీ మండలాధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులు యాదవ్, పిన్నిబోయిన సుధాకర్, ఎల్.సుధీర్, వేంకటేశ్వర రెడ్డి, రఘురాం నాయుడు, వెంకటేశ్వర్లు, బోగిరి ప్రభాకర్, అరుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

● **కందుకూరు:** పట్టణంలోని 9వ వార్డు ఆదిఆంధ్ర కాలనీలో గురువారం ఉదయం కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పలువురు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందించారు. కందుకూరు అర్బన్ పరిధిలో గురువారం ఒక్కరోజే 6240 మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కేవీ కృష్ణారెడ్డి, పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, పిడికిటి వెంకటేశ్వర్లు, చేవూరి రమేష్, చదలవాడ కొండయ్య, షేక్ రఫి, బెజవాడ ప్రసాదు, తదితరులు పాల్గొన్నారు.

● **వలేటివారిపాలెం** : అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు తెల్లవారుజాము 5 గంటలకే లబ్ధిదారుల ఇళ్లవద్దకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. పోకూరులో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొని లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాదాల లక్ష్మీనరసింహం, లక్ష్మీనరసింహం, సోమినేని తిరుమలరావు, నల్లమోతు రవీంద్ర, గురిజాల బెంజిమెన్, నాగభూషణం పాల్గొన్నారు.

జనసేన సభ్యత్వ నమోదు

కావలి : విట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం జనసేన కార్యదర్శి సమ్మను వెంకటసుబ్బయ్య పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పునఃప్రారంభించారు. నియోజకవర్గ పవన్‌కల్యాణ్ ఫ్యాన్స్ అధ్యక్షుడు,జనసైనికులు షేక్ షమీ, జానీ, షేక్ జిలానీ, జ్యోతి, ఖలీల్, వెంకటేశ్వర్లు వెంకటేశ్వరరావు, క్రిష్ణయ్య, హనుమంతురావు పాల్గొన్నారు.

వివాదాస్పద ఆశ్రమంలో ఇంటూరి పూజలు శోచనీయం

కందుకూరు, ఆగస్టు 1: గుడ్లూరు మండలంలోని చేవూరు వద్ద ఉన్న వివాదాస్పద రామదూత ఆశ్రమంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పూజలు చేయటం, వివిధ కార్యక్రమాలలో పాల్గొనటం శోచనీయమని హేతువాద సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నార్నె వెంకటసుబ్బయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చెరువు పోరంబోకును, అటవీ భూమిని ఆక్రమించి ఈ ఆశ్రమం నిర్మించారని, ఆక్రమిత భూమిని స్వాధీనం చేసుకోవాలని రెవిన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ 2021 ఏప్రిల్‌లో ఆదేశాలు జారీచేసి ఉన్నారని ఆయన తెలిపారు. ఇప్పటికైనా ఆక్రమిత భూమి స్వాధీనం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తిచేశారు.

‘ప్రకాశం’కు కెరీర్ 360 మ్యాగజైన్ ప్రశంసలు

కందుకూరు : కెరీర్ 360 జాతీయ మ్యాగజైన్ ఇటీవల నిర్వహించిన సర్వేలో ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాలకు అత్యుత్తమ గ్రేడ్ లభించిందని కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల రామయ్య ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల అడ్మిషన్లు, ఫలితాలు, పరిశోధనావకాశాలు, ఉద్యోగ కల్పన, సీనియర్ ఫ్యాకల్టీ, మౌలిక సదుపాయాలు తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని కళాశాలకు ఏఏఏ ప్లస్ గ్రేడ్‌నిస్తూ మ్యాగజైన్ యాజమాన్యం ప్రశంసాపత్రాన్ని కూడా అందజేసిందని రామయ్య తెలిపారు.

కూలిన అంగన్‌వాడీ కేంద్రం కిటికీ గోడ

బిట్రగుంట, ఆగస్టు 1: ముంగమూరు పంచాయతీలోని పేట గ్రామంలో నిర్మాణంలో ఉన్న అంగన్‌వాడీ ఫేస్-2 భవనం కిటికీ సైడ్ గోడ గురువారం కూలిపోవడంపై గ్రామస్థులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. నాసిరకంగా నిర్మాణం చేపట్టడం వలనే ఇలా జరిగిందని కొందరు అంటే మరికొందరు పలు రకాలుగా చర్చించుకుంటున్నారు.

సైబర్ నేరాలపై చైతన్య పరచాలి

కావలి టౌన్, ఆగస్టు 1: సాంకేతిక పరిజ్ఞానంతో సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని వాటి నివారణకు ఐటీ విద్యార్థులు గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించి సమాజాన్ని చైతన్య పరచాలని హైదరాబాద్ ట్రాయ్ అడ్వైజర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గురువారం విట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ సురేష్ అధ్యక్షతన కంజ్యూమర్ అవుట్రీట్ కార్యక్రమంలో ఆయన ట్రాయ్ సీనియర్ ఆఫీసర్ బిక్షమ్‌తో కలిసి పాల్గొని మాట్లాడారు. ప్రపంచం కమ్యూనికేషన్ వ్యవస్థపై నడుస్తుందని, ఈ వ్యవస్థతో మంచితో పాటు అంతే స్థాయిలో సైబర్ నేరగాళ్లు చెడుకు ఉపయోగిస్తున్నారని వాపోయారు. కార్యక్రమంలో ఈసీఈ విభాగాధిపతి స్రవంతి, టెలికాం డైరెక్టర్ అరవింద్, ఐటీఎస్ అడ్వైజర్ రాజు, ఆర్‌బీఐ డిప్యూటీ జీఎం వికాస్ జైస్వాల్ పాల్గొన్నారు.

కామ్రేడ్ నరసింహంకు ఘన నివాళి

గుడ్లూరు, ఆగస్టు 1: కందుకూరు డివిజన్ సీపీఎం సీనియర్ నాయకుడు, చేవూరు మాజీ సర్పంచ్ కామ్రేడ్ నూతలపాటి నరసింహం సేవలను మరువలేమని నెల్లూరు జిల్లా సీనియర్ సీపీఎం నాయకుడు ముప్పరాజు కోటయ్య అన్నారు. నూతలపాటి నరసింహం శుక్రవారం గుడ్లూరు మండలం చేవూరులో మరణించగా ఆయన మృతి విషయం తెలుసుకున్న, నెల్లూరు, ప్రకాశం జిల్లాల నాయకులు చేవూరుకు చేరుకొని ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం గ్రామంలో సాగిన నూతలపాటి అంతిమయాత్రలో గ్రామస్థులతో పాటు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు పాల్గొని నివాళులు అర్పించారు. అంతిమ యాత్ర అనంతరం నరసింహం మృతదేహాన్ని ఒంగోలు కిమ్స్ వైద్యసిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన సీపీఎం నాయకులు గంటెనపల్లి వెంకటేశ్వర్లు, సుంకరి విజయలక్ష్మి, పసుపులేటి పెంచలయ్య, నూతలపాటి వెంకటేశ్వర్లు, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


కామ్రేడ్ నరసింహం మృతదేహంపై ఎర్ర కండువా కప్పి నివాళులు అర్పిస్తున్న సీపీఎం నాయకులు

వర్ల రామయ్య జన్మదిన వేడుకలో ఎస్సీ సెల్ నాయకులు

కలిగిరి, ఆగస్టు 1: రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు కోడూరు అఖిల్ అధ్యక్షతన మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో గురువారం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య జన్మదిన వేడుకలో నియోజకవర్గ టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు స్వర్ణ కొండయ్య పాల్గొన్నారు. కార్యక్రమంలో నియో జకవర్గ టీడీపీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ఉపటూరి సుధీర్ బాబు, రాష్ట్ర ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి మాతంగి కృష్ణ జి రమేష్, ఎస్ రమేష్, రవి పాల్గొన్నారు.


వర్ల రామయ్యకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎస్సీసెల్ నాయకులు

ఎమ్మార్పీఎస్ నాయకుల ఆనందం

బిట్రగుంట, ఆగస్టు 1: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పుపై బోగోలులోనిఎమ్మార్పీఎస్, దళిత నేతలు సంబరాలు చేసుకున్నారు. స్థానిక బజారులోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మందకృష్ణమాదిగ చిత్రపటానికి పాలభిషేకం చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏసుపోగు జయరాజు, ఇశ్రాయేల్, బుద్దయ్య, ఫిలిప్, నవీన్, అభిషేక్, రాధయ్య, బోగిరి యోహాన్, జయరాజు పాల్గొన్నారు.

● **కావలి టౌన్ :** స్థానిక ట్రంకురోడ్డులోని బాబూ జగజ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద సంబరాలు నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్, జగజ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలు వేసి బాణసంచా కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ జాతీయ అధ్యక్షుడు శ్రీనివాసులు, చేవూరు కిరణ్, మందా వెంకటేశ్వర్లు, జీ వెంకటేశ్వర్లు, కొప్పర్తి కొండయ్య, మందా మహేష్ పాల్గొన్నారు.

● **లింగసముద్రం :** సాయంత్రం లింగసముద్రంలోని తిరుమణిశెట్టి కోటయ్య మందిరం సమీపంలో పలువురు నేతలు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. బైక్ ర్యాలీ నిర్వహించారు.

ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

కందుకూరు: పట్టణంలోని ప్రైవేటు విద్యాసంస్థలు, కళాశాలలు ఫిట్నెస్ లేని బస్సులు నడుపుతుండట మే గాక పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించుకుంటున్నారని ఎస్ఎఫ్ఐ నెల్లూరు జిల్లా కార్యదర్శి మెండా శ్రీహర్ష గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. విద్యాసంవత్సరం మొదలై మూడు నెలలు గడుస్తున్నా ఇంతవరకు ప్రైవేటు విద్యాసంస్థల బస్సులను రవాణాశాఖ అధికారులు ఫిట్నెస్ తనిఖీలు చేయకపోవడం శోచనీయమన్నారు. ఏదైనా ప్రమాదం జరిగాక స్పందించినా ప్రయోజనం ఉండదని, తక్షణం తనిఖీలు నిర్వహించి ఫిట్నెస్ లేని బస్సులను సీజ్ చేయటంతో పాటు పరిమితికి లోబడే విద్యార్థులను తరలించేలా చర్యలు తీసుకోవాలని శ్రీహర్ష డిమాండ్ చేశారు.